అనుదినం... జనస్వరం

# నవతెలంగాణ

సోమవారం 10-7-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 190 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు వెల : 6.50


## వణుకుతున్న ఉత్తరాది

- ఇప్పటివరకు 15 మంది మృతి
- 41 ఏండ్ల తరువాత ఢిల్లీలో రికార్డు స్థాయి వర్షపాతం

వివరాలు 2లో..



# లష్కర్ బోనాల్లో సీఎం

## ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో కేసీఆర్ దంపతులు

- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం కేసీఆర్
- తొలిబోనం సమర్పించిన మంత్రి తలసాని
- ప్రత్యేక పూజలు చేసిన కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి
- బంగారు బోనంతో ఎమ్మెల్సీ కవిత
- నేటి భవిష్యవాణికి ఏర్పాట్లు పూర్తి



నవతెలంగాణ-సిటీబ్యూరో, బేగంపేట

సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారి దర్శనానికి సందర్శకులు పోటెత్తారు. ఆలయ పరిసరాలు భక్తులతో కళకళలాడాయి. మహిళల కోలాటాలు, శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, డప్పుల దరువులు, యువతీ యువకుల నృత్యాల కోలాహలాలు, ఆనందోత్సవాల నడుమ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతర ఆదివారం కన్నుల పండువగా సాగింది. వేలాది మంది మహిళలు, భక్తులు, సందర్శకులు అమ్మవారికి బోనాలు , తొట్టెలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం 1.20గంటలకు ఆలయానికి చేరుకున్న సీఎం దంపతులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కు తీర్చుకున్నారు. ఆ తర్వాత డిప్యూటీ స్పీకర్ పద్మారావు నివాసంలోని ముత్యాలమ్మ గుడిలో సీఎం దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. సీఎం వెంట మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, ఇంద్రకరణ్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రైతుబంధు రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎంపీ సంతోష్ తదితరులున్నారు. అంతకుముందు ఉదయం 4.15 గంటలకు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, తన కుటుంబ సభ్యులతో ...11లో

# అప్పుల కుప్ప..




## భారీగా రుణాలు తీసుకుంటున్న మోడీ సర్కార్

- అదే బాటలో రాష్ట్రాలు
- అంతిమంగా ప్రజలపైనే భారం
- వ్యక్తిగత రుణాలూ పెరిగాయి




**అప్పల కోసం మోడీ ప్రభుత్వం వెంపర్లాడుతోంది. ప్రభుత్వ రంగ సంస్థలను హెూల్‌సేల్‌గా అమ్మేస్తున్నా...ప్రజల నెత్తిన మోయలేని ఆర్థిక భారాలు వేస్తున్నా కేంద్ర ఖజానా నిండట్లేదు. రిజర్వుబ్యాంకు మొదలు ప్రపంచబ్యాంకు వరకు అప్పలు చేస్తూనే ఉంది. కేంద్ర సర్కారు పరిస్థితే అలా ఉంటే, రాష్ట్రాలూ అదే బాటలో నడుస్తున్నాయి. ఇక ప్రజలూ వ్యక్తిగత రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. అన్నింటికీ కేంద్ర బిందువు కేంద్రంలోని మోడీ సర్కారు ఆర్థిక దివాళా పరిస్థితే కారణంగా కనిపిస్తున్నది. దీన్ని గాడిన పెట్టాల్సిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రపంచమే ఆర్థిక మాంద్యంలో ఉందంటూ అసమర్థతను కప్పిపుచ్చుకొనే ప్రయత్నం చేస్తుండటం గమనార్హం!**

న్యూఢిల్లీ : 2014వ సంవత్సరం నుండి దేశం క్రమేపీ అప్పుల ఊబిలో కూరుకుపోతోంది. గడచిన తొమ్మిది సంవత్సరాల కాలంలో రాష్ట్ర ప్రభుత్వాల అప్పులు 200% పెరగగా, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న రుణం సుమారు 150% పెరిగింది. ఇవి సాక్షాత్తూ రిజర్వ్‌బ్యాంక్ వెల్లడించిన అప్పుల చిట్టాలు. కేంద్ర ప్రభుత్వ రుణభారం 2022-23 సంవత్సరాంతానికి రూ.157 లక్షల కోట్లకు చేరగా, రాష్ట్రాలు రూ.76 లక్షల కోట్ల మేర అప్పల్లో ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి వివిధ బ్యాంకుల నుండి ప్రజలు తీసుకున్న వ్యక్తిగత రుణాలు కూడా రూ.41 లక్షల కోట్లకు చేరాయి. 2014తో పోలిస్తే ఈ అప్పులు 400% పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరపు బడ్జెట్ రూ.45 లక్షల కోట్లు కాగా ప్రజల వ్యక్తిగత రుణాలు దాదాపుగా అదే స్థాయిలో ఉండడం విశేషం.


మరోవైపు చిన్న, మధ్యతరహా పరిశ్రమలు బ్యాంకు రుణాలను పెద్దగా తీసుకోవడం లేదు. దీనిని బట్టి అవి తమ సామర్థ్యాలను పెంచుకోవడం లేదని అర్థమవుతోంది. అంటే ఏమిటి? ఆ పరిశ్రమలు ఉద్యోగాలను కల్పించలేకపోతున్నాయి. దీంతో కుటుంబ ఆదాయాలు పరిమితంగానే ఉంటున్నాయి. స్థూల దేశీయోత్పత్తిలో ప్రయివేటు వినియోగ వ్యయం తగ్గిపోతోందని ఆర్‌బీఐ గణాంకాలు చెబుతున్నాయి. అంటే కుటుంబాలను నెట్టుకురావడం కష్టమవుతోందన్న మాట.

### మనకు మేలు చేయదు

వ్యక్తిగత రుణాలు పెరగడం శుభ పరిణామమని కొందరు వాదిస్తున్నారు. వస్తువులు, సేవల కొనుగోలు కోసం ప్రజలు రుణాలు తీసుకుంటారని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు మంచిదని ...11లో

### ఈ రుణాలన్నీ ఎవరికి ఖర్చవుతున్నాయంటే..?

తీసుకున్న రుణాలను ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం కోసం ఖర్చు చేస్తే దానిని సమర్థించవచ్చు. కానీ ప్రభు త్వాలు సంక్షేమానికి కోత పెడుతున్నాయి. భారీ వ్యయా న్ని భరించలేమని, బడ్జెట్‌ను సమతూకం చేసుకోవాల్సి ఉంటుందని చెబుతున్నాయి. మరి ప్రభుత్వం తీసుకుంటున్న రుణాలు ఎక్కడికి పోతున్నాయి? కార్పొరేట్ రంగంలోకి. ఈ రంగానికి ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు అందిస్తోంది. పన్ను మినహాయింపులు, సబ్సిడీలు వంటి తాయిలాలు ఇస్తోంది. ప్రభుత్వం తీసుకుంటున్న రుణాలలో ఎక్కువ భాగం ఈ రాయితీలు ఇచ్చేందుకే ఖర్చు చేస్తున్నారు. జాతీయ రహదారులు, వందేభారత్ వంటి వేగంగా నడిచే రైళ్ల వంటి భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపైనా రుణాలలోనూ ను వెచ్చిస్తున్నారు. నిధుల వినియోగం నిత్యం ప్రశార్థకమవుతోంది.




### వడ్డీలకే సరి

ప్రభుత్వాలు తమ కార్యకలాపాల కోసం తరచుగా రుణాలు తీసుకుంటాయి. బ్యాంకులు వంటి ప్రైవేటు వాణిజ్య వనరుల ద్వారా లేదా ప్రజలకు జారీ చేసిన బాండ్ల ద్వారా లేదా ప్రావిడెంట్ ఫండ్ కార్పస్ నుండి లేదా చిన్న మొత్తాల పొదుపు నిధి నుండి ప్రభుత్వాలు రుణాన్ని సేకరిస్తాయి. అయితే ఈ రుణాల మొత్తం కొండలా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. 2022-23లో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న రుణాలలో 58% మార్కెట్ ...11లో

# డేటా ప్రొటెక్షన్‌లో జోక్యమా..?

## కేంద్రానికి మినహాయింపులు ఆందోళనకరం : వ్యక్తిగత సమాచార రక్షణ బిల్లుపై జస్టిస్ శ్రీకృష్ణ



న్యూఢిల్లీ : వ్యక్తిగత సమాచార రక్షణకు సంబంధించిన ముసాయిదా బిల్లులోని అన్ని సెక్షన్ల నుంచి ప్రభుత్వానికి, ప్రభుత్వ సంస్థలకు మినహాయింపు ఇవ్వడంపై సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి బీఎన్ శ్రీకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రిమండలి ఈ నెల ఐదున ఈ బిల్లుకు ఆమోదం తెలిపింది. దీని ప్రకారం... తమ అంగీకారం లేకుండా ఎవరైనా వ్యక్తిగత సమాచారాన్ని ఉపయోగించుకుంటున్నారని భావిస్తే (ఉదాహరణకు సెల్‌ఫోన్ నెంబర్లు లేదా ఆధార్ వివరాలు) ప్రజలు డాటా ప్రొటెక్షన్ బోర్డుకు ఫిర్యాదు చేయవచ్చు. కేంద్ర ప్రభుత్వం ...11లో

# రాజ్యాంగ పరిరక్షణకు సంఘటితం కండి

## మోడీ హయాంలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం

- మతోన్మాదులతో జాగ్రత్త...: సీపీఎం పోలిట్‌బ్యూరో సభ్యురాలు సుభాషిణి అలీ




నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజలంతా సంఘటితం కావాలని సీపీ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు సుభాషిణి అలీ పిలుపునిచ్చారు. మోడీ హయాంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయన్నారు. కొత్త రాజ్యాంగం పేరుతో మరో కొత్త డ్రామాకు మోడీషాలు తెరలేపుతున్నారని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల లోపు ప్రజల దృష్టిని మళ్లించి, ఓట్లు దండుకొనేందుకు మతోన్మాదశక్తులు కుట్రలు చేస్తాయనీ, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. సీపీఐ(ఎం) హైదరాబాద్ సౌత్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారంనాడిక్కడి జంగమ్మెట్‌లో 'రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లు' అంశంపై జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ...11లో

# 12వ తేది వరకే ఎంసెట్ ఆప్షన్లు

- ఒకే విద్యార్థి 1,048 కాలేజీలకు దరఖాస్తు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ స్టేట్ ఎంసెట్-2023 అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతున్నది. అందులో భాగంగానే వెబ్ ఆప్షన్లకు ఈనెల 12చివరి తేది అని సాంకేతిక విద్యా కమిషనర్, ఎంసెట్ కన్వీనర్ వాకాటి కరుణ తెలిపారు. 81,856 మంది విద్యార్థులు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకున్నారని, 66,215 మంది విద్యార్థులు ఆప్షన్లు పెట్టుకున్నారని వెల్లడించారు. విద్యార్థులు మొత్తం 40,44,827 ఆప్షన్లు పెట్టుకున్నారని, ఒక విద్యార్థి 1,048 ఆప్షన్లు పెట్టుకున్నారని వివరించారు.

# మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారు

## తమిళనాడులో శాంతికే ముప్పుగా పరిణమించారు : గవర్నరు చేష్టలపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు స్టాలిన్ లేఖ



చెన్నై : వివాదాస్పదుడైన తమిళనాడు గవర్నరు ఆర్ఎన్ రవి చేష్టలతో విసుగెత్తిపోయిన ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ ఆయనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఫిర్యాదు చేస్తూ ఆదివారం ఒక లేఖ రాశారు. మత విద్వేషాలను రెచ్చగొట్టే వ్యక్తి, తమిళనాడులో శాంతికి ముప్పుగా పరిణమించిన వ్యక్తి, తమిళనాడు రాష్ట్రానికి, తమిళ ప్రజలకు, తమిళ సంస్కృతికి శత్రు వుగా ఉన్న వ్యక్తి గవర్నరు పదవికి ఎంతమాత్రమూ తగరని స్టాలిన్ ఆ లేఖలో పేర్కొన్నారు. కేంద్ర హెూం మంత్రి అమిత్ షాతో ఢిల్లీలో తమిళనాడు గవర్నర్ సమావేశమైన తరుణంలో స్టాలిన్ ఈ లేఖాస్త్రాన్ని ...11లో

# బైక్ మెకానిక్‌గా రాహుల్

## ఢిల్లీలోని కరోల్‌బాగ్‌లో టూవీలర్‌కు మరమ్మతులు



న్యూఢిల్లీ : భారత్ జోడో యాత్ర తర్వాత కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ లారీలలో ప్రయాణిస్తూ ..డ్రైవర్ల కష్టాలు,బాధలు వింటున్నారు. తాజాగా ఢిల్లీలోని కరోల్‌బాగ్‌లోని బైక్ మెకానిక్ షాపులను సందర్శించారు. అక్కడి కార్మికులతో ముచ్చటించిన రాహుల్.. వారితో కలిసి కొన్ని బైక్‌లను రిపేర్ చేసేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా తన వద్ద ఉన్న బైక్ గురించీ ప్రస్తావించిన రాహుల్.. దాన్ని ఎందుకు బయటకు తీయరో వివరించారు. ఇందుకు సంబంధించిన వీడియో ...11లో

# తీస్తా సెతల్వాద్‌పై ఆరోపణలను ఉపసంహరించుకోవాలి

- ఉద్యమకారులపై వేధింపులకు ముగింపు పలకాలి: పెన్ ఇంటర్నేషనల్ ఆందోళన



న్యూఢిల్లీ : హక్కుల కార్యకర్త తీస్తా సెతల్వాద్‌పై న్యాయవ్యవస్థ, మోడీ సర్కారు చర్యలపై గ్లోబల్ ఫ్రీ స్పీచ్ వాచ్‌డాగ్ పెన్ ఇంటర్నేషనల్ సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. ఆమెను జైలులో ఉంచడానికి కొనసాగుతున్న ప్రయత్నాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అదే సమయంలో స్వేచ్ఛా వ్యక్తీకరణ, భారత ...11లో



(ఫైల్)

# దెబ్బ మీద దెబ్బ

## రాలుతున్న కమలం రెక్కలు

- మోడీ, నడ్డా వచ్చినా ఆగని కల్లోలం
- భారీగా వలసలు
- ప్రియాంక గాంధీ సమక్షంలో చేరేందుకు సిద్ధం
- 25న కాంగ్రెస్ బహిరంగ సభ

**బీజేపీకి దెబ్బమీద దెబ్బ పడుతున్నది. సోషల్ మీడియా ద్వారా మైండ్‌గేమ్ ఆడుతూ లేనిది ఉన్నట్టు ప్రచారం చేసిన కమలనాథులకు ఇప్పుడు వాస్తవ పరిస్థితేంటో తెలిసింది. తేరుకుని నష్టనివారణ చర్యలు చేపట్టినా.. తెలంగాణలో కమలం వికసించడం కష్టమని ఆ పార్టీలోని వలసనేతలకు అర్థమయ్యింది. దీంతో ఆ పార్టీని వీడి 'చేయి' అందుకునేందుకు కొందరు, కారు ఎక్కేందుకు మరి కొందరు పరిగెత్తుతుండటం బీజేపీని మరింత కలవరపాటుకు గురిచేస్తున్నది. వాడుతున్న కమలం పువ్వు నుంచి రెక్కలు రాలినట్టే ఆ పార్టీ నుంచి ఒక్కో ముఖ్యనేత జారుకుంటున్నారు.**

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీజేపీకి చెందిన 10 మంది కీలక నేతలు హస్తం గూటికి చేరబోతున్నారని కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన నోట్ 'పువ్వు' పార్టీలో మరింత కల్లోలానికి దారితీస్తున్నది. పార్టీ వీడకుండా వలస నేతలకు జాతీయ కార్యవర్గంలో చోటు కల్పించినా విభేదాలు మాత్రం ఆగటం లేదు. క్రమశిక్షణకు మారుపేరు, రామరాజ్యం గురించి గొప్పగా చెప్పుకునే బీజేపీ నేతల మధ్య ఆధిపత్యపోరు రావణ కష్టంలా మండుతూనే ఉన్నది. ఈ పరిస్థితులను చక్కదిద్దేందుకు ప్రధాని మోడీ వరంగల్‌కు వచ్చిపోయిన తర్వాత కూడా రాజకీయ పరిస్థితుల్లో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. బీఆర్ఎస్ అవినీతిపై మోడీ తీవ్ర విమర్శలు చేసినప్పటికీ...కేంద్రంలో అధికారంలో ఉండీ, ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే ప్రశ్నలను ఆ పార్టీ నేత ఎ.చంద్రశేఖర్ సంధించడం చర్చనీయాంశమైంది. దీనినిబట్టే సొంత పార్టీ నేతలను సైతం మోడీ ప్రసంగం సంతృప్తి పరచలేదనే గుసగుసలు వినిపిస్తున్నాయి. పార్టీ కలిసి కట్టుగా ఉండాలనే అధిష్టానం సూచనలను పెడచెవిన పెట్టినట్టు కనబడుతున్నది. అనివార్య పరిస్థితుల్లో బీజేపీలో చేరిన నేతల ...11లో



# యూసీసీ వద్దు..



## వ్యతిరేకిస్తున్న పలు వర్గాలు, మతాలు

- రాజ్యాంగం కలిగించిన హక్కులకు భంగం: విశ్లేషకులు
- ఎన్నికలు జరగనున్న మధ్యప్రదేశ్, మిజోరాం, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో తీవ్ర నిరసనలు

**న్యూఢిల్లీ:** పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లోనే యూనిఫాం సివిల్ కోడ్ (యూసీసీ) బిల్లును ప్రవేశపెట్టవచ్చనే ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి. ఇది అకస్మాత్తుగా దేశంలో తీవ్ర చర్చకు దారి తీస్తున్నది. అన్ని మత వర్గాలకు వర్తించే ఉమ్మడి చట్టాన్ని అమలు చేయటానికి కేంద్రంలోని అధికార బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. రాబోయే ఏడాది దేశంలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. ఈ తరుణంలో సార్వత్రిక ఎన్నికలకు కొన్ని నెలల ముందు యూసీసీ అమలు ప్రాధాన్యతను సంతరించుకున్నది.

ప్రస్తుతం దేశంలో హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, పార్సీల వివాహం, వారసత్వం, దత్తత, సంరక్షకత్వం వంటి జీవితంలోని వివిధ అంశాలు వారి స్వంత వ్యక్తిగత చట్టాల ద్వారా జరుగుతున్నాయి. అయితే, ఇస్లామిక్ చట్టం ప్రకారం, బహుభార్యత్వం అనుమతించబడుతుంది. అలాగే, పార్సీలు, సిక్కులు వంటి ఇతర మైనారిటీ మతాల్లోనూ ఇలాంటివి ప్రత్యేకంగా కొన్ని ఉన్నాయి.

అయితే, ఈ దశలో ఇది అవసరం లేదు, కోరదగినది కాదని 2018లో 21వ లా కమిషన్ కొన్ని ఆసక్తికరమైన సూచనలు చేసింది. అయితే, 22వ లా కమిషన్ చర్యల అనంతరం ఇలాంటి తరుణంలో కేంద్రంలోని మోడీ సర్కారు యూసీసీ విషయంలో ఒకడుగు ముందుకేసింది. ఇందులో భాగంగానే ప్రధా మోడీ వ్యాఖ్యలని విశ్లేషకులు గుర్తు చేశారు. "రెండు చట్టాల ప్రకారం ఒక దేశాన్ని ఎలా నడపాలి?" అని ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.యూసీసీ ఉన్న ఏకైక రాష్ట్రం గోవా.

రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు 1961లో విలీనమైనప్పటి నుంచి 154 ఏండ్ల నాటి పోర్చుగీస్ సివిల్ కోడ్‌కు కట్టుబడి ఉన్నారు. కానీ ఇందులోనూ అనేక ప్రతికూలతలు ఉన్నాయని కొందరు నిపుణులు చెప్పారు. ఇందులో కొన్ని హిందూ వివాహ చట్టానికి పూర్తిగా విరుద్ధం అని వివరించారు. అయితే, దేశంలో యూసీసీ అమలుపై ప్రధాని వ్యాఖ్యల నేపథ్యంలో కొన్ని మతాలు, వర్గాల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతున్నది. ముస్లింలే కాదు.. గిరిజనులు, సిక్కుల, పార్సీలు సైతం యూసీసీపై ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈశాన్య ప్రాంతాలతో సహా దేశవ్యాప్తంగా అనేక గిరిజన సంఘాలు తమ గుర్తింపు, స్వయం ప్రతిపత్తికి ముప్పు వాటిల్లుతుందని భయపడుతున్నారు. ఇటు రాష్ట్ర ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, మధ్యప్రదేశ్, మిజోరాం, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలోని ప్రధాన రాజకీయ పార్టీల భవితవ్యాన్ని యూసీసీ నిర్ణయించే అవకాశం ఉన్నదని విశ్లేషకులు చెప్పారు.ఉమ్మడి చట్టం చుట్టూ చర్చ ఊపందుకున్నందున, ఈ అన్ని రాష్ట్రాల్లోని వివిధ గిరిజన సంస్థలు ఈ చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఇది రాజ్యాంగ నిబంధనల ద్వారా రక్షించబడిన తమ సంప్రదాయాలను ఉల్లంఘిస్తుందని ఆందోళన వ్యక్తం చేశాయి.

## పెరిగిన ప్రయివేటు పెట్టుబడులు

- ప్రయోజనాలు మాత్రం విదేశీ కంపెనీలకే



**న్యూఢిల్లీ :** ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ మధ్యకాలంలో దేశంలో ప్రయివేటు పెట్టుబడులు బాగా పెరిగాయి. ఈ పెట్టుబడులు ప్రధానంగా రవాణా రంగంలో...అంటే విమానయాన రంగంలో వచ్చాయని బ్యాంక్ ఆఫ్ బరోడాకు చెందిన ఆర్థిక పరిశోధనా విభాగం తెలిపింది. అయితే తొలి త్రైమాసికంలో వచ్చిన ఈ పెట్టుబడులు దేశంలో నూతన వ్యాపారాలను ప్రారంభించేందుకు ఉపయోగపడలేదు. దేశానికి చెందిన అన్ని ఆర్డర్లు విదేశాలలోని కంపెనీలకే వెళ్లాయి. ఈ పెట్టుబడులతో విదేశీ కంపెనీలు కొత్తగా విమానాల ఉత్పత్తి చేపడతాయి. మరో మాటలో చెప్పాలంటే ఈ ప్రయివేటు పెట్టుబడులు విదేశీ కంపెనీలకే ప్రయోజనం చేకూరుస్తాయి. 2022-23లో ప్రయివేటు రంగానికి చెందిన పెట్టుబడులు బాగా పెరిగాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన మరో నివేదిక తెలిపింది. 2019, 2020 సంవత్సరాలలో ప్రయివేటు పెట్టుబడులు తగ్గాయని బ్యాంక్ ఆఫ్ బరోడా నివేదిక ప్రస్తావించింది. 2021లో పరిస్థితి కొంతమేర ఆశాజనకంగా ఉందని, అది 2022లోనూ, ఈ సంవత్సరం కూడా కొనసాగిందని వివరించింది. అయితే 2016, 2017 సంవత్సరాలతో పోలిస్తే ఇప్పటికీ ప్రయివేటు పెట్టుబడుల ప్రవాహం తక్కువగానే ఉన్నదని తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని మొదటి త్రైమాసికంలో రూ.5.96 లక్షల కోట్ల ప్రయివేటు పెట్టుబడులు వచ్చాయి. గత సంవత్సరం ఇదే కాలంలో వచ్చిన పెట్టుబడులు రూ.5.79 లక్షల కోట్లు. తొలి త్రైమాసికంలో ప్రకటించిన నూతన ప్రాజెక్టులలో 74% రవాణా రంగానికి సంబంధించినవే. విద్యుత్ రంగంలో 10%, రసాయనాల రంగంలో 8%, యంత్రాల రంగంలో 3%, ఆటో రంగంలో 2% మేర పెట్టుబడులు వచ్చా యి. ప్రయివేటు కంపెనీలు రుణాలు సేకరించి పెట్టుబడులు పెడుతు న్నాయి. రుణాలు లభించకపోతే పెట్టుబడులు పెట్టవు. ఈ సంవత్సరం బాండ్ మార్కెట్ నుంచి ప్రయివేటు కంపెనీలు రూ.2.33 లక్షల కోట్ల మేర రుణాలు తీసుకున్నాయి. గత సంవత్సరంతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ.

## వణుకుతున్న ఉత్తరాది

- ముంచెత్తుతున్న భారీ వర్షాలు..15 మంది మృతి
- హిమాచల్‌లో కొట్టుకుని పోయిన దుకాణాలు, కార్లు
- ఢిల్లీలో 41 ఏండ్ల తరువాత రికార్డు స్థాయి వర్షపాతం
- జమ్మూకాశ్మీర్, ఉత్తరాఖండ్, హర్యానాల్లోన కుండపోత

**న్యూఢిల్లీ :** ఉత్తర భారతదేశాన్ని భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. శుక్ర, శనివారాలతో పాటు ఆదివారం కూడా ఉత్తరాదిలో అనేక ప్రాంతాలను భారీ వర్షాలు ముంచెత్తాయి. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. భారీ వర్షాలకు ఆదివారానికి గత 24 గంటల్లో 15 మంది మరణించారు. అత్యధికంగా హిమాచల్ ప్రదేశ్‌లో తొమ్మిది మంది మృతి చెందారు. ఈ రాష్ట్రంలో వరదల ఉధృతి తీవ్రంగా ఉంది. వరద నీటికి అనేక దుకాణాలు, కార్లు కొట్టుకునిపోయాయి. ఇక దేశరాజధాని ఢిల్లీలో 41 ఏండ్ల రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదయింది. జమ్మూకాశ్మీర్, ఉత్తరాఖండ్, హర్యానా రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఢిల్లీ, పరిసర ప్రాంతాలను భారీ వర్షాలు దంచికొడుతున్నాయి. ఆదివారం ఉదయం 8:30 గంటల సమయానికి గత 24 గంటల వ్యవధిలో ఢిల్లీలో 153 మీమీ వర్షపాతం నమోదయింది. 1982 నుంచి ఒక రోజు వర్షపాతం విషయంలో ఇదే అత్యధికమని అధికారులు తెలిపారు. 1982 జులై 25న 24 గంటల వ్యవధిలో 169.9 మీమీ వర్షపాతం కురిసింది. దాని తరువాత ఇదే అత్యధిక వర్షపాతం. భారీ వర్షాలతో ఢిల్లీలో ఇప్పటికే లోతట్టు ప్రాంతాలతో పాటు, అండర్‌పాస్‌లు, పార్కులు, రోడ్లు పూర్తిగా జలమయ్యాయి. భారీ వర్షాలు కారణంగా ఢిల్లీలోని అన్ని పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించారు. హిమాచల్ ప్రదేశ్‌లో గత మూడు రోజుల నుంచి ఎడతేరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాల కారణంగా ఆదివారం నాటికి రాష్ట్రంలో తొమ్మిది మంది మరణించారు. ఇండ్లు కూలడం, కొండచరియలు విరిగిపడ్డం వంటి ప్రమాదాల్లో వీరు మృతి చెందారు. వర్షాలతో గంగానది ఉధృతంగా ప్రవహిస్తోంది. జాతీయ రహదారి 21ను అధికారులు మూసివేశారు.

వరదల్లో పలు దుకాణాలు, కార్లు కొట్టుకుని పోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. ఏడు జిల్లాలకు రెడ్ అలర్ట్, మూడు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్‌ను వాతావరణ శాఖ ప్రకటించింది. ఆకస్మిక వరదలు, కొండ చరియలు విరిగి పడే అవకాశం ఉందని హెచ్చరించింది. ఉత్తరాఖండ్‌లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రంలో ఉధమ్ సింగ్‌లో ఒక ఇల్లు కూలి ఇద్దరు మరణించారు. రాజస్థాన్‌లో ఆదివారం ఉదయానికి గత 24 గంటల్లో వర్షాల కారణంగా నలుగురు మృతి చెందారు. రాష్ట్రంలో తొమ్మిది జిల్లాల్లో 2,3 రోజుల వరకూ అతి భారీ వర్షాలు కురిసే అవకాశ ముందని వాతావారణ శాఖ హెచ్చరించింది.

జమ్మూకాశ్మీర్‌లో గత మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తునే ఉన్నాయి. ఆదివారం ఉదయానికి గత 24 గంటల్లో నలుగురు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు సైనికులు కూడా ఉన్నారు. ఆకస్మిక వరదలకు పూంచ్ ప్రాంతంలో ఇద్దరు సైనికులు మరణించగా, దోడా జిల్లా కొండచరియలు పడి ఇద్దరు మరణించారు. ఆదివారం కూడా అమర్‌నాథ్ యాత్రను నిలిపివేశారు. దీంతో వరుసగా మూడు రోజుల పాటు ఈ యాత్ర నిలిచిపోయినట్లయింది. యాత్రీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షాల కారణంగా 17 రైళ్లను రద్దు చేసినట్టు నార్తర్న్ రైల్వే శాఖ ప్రకటించింది. మరో 12 రైళ్లను దారి మళ్లించినట్టు తెలిపింది.

## మోడీది ద్వంద్వ వైఖరి

- ఆయన ప్రభుత్వ కనుసన్నల్లోనే మోసగాళ్లు దేశం విడిచి పారిపోయారు: ప్రధానిపై కాంగ్రెస్ విమర్శలు

**న్యూఢిల్లీ :** కేంద్రంలోని మోడీ ప్రభుత్వంపై కాంగ్రెస్ మాటల దాడికి దిగింది. మోడీ పాలనలో దుండగులు, మోసగాళ్ల జాబితాను ఆ పార్టీ ఉటంకించింది. ఆ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే మోడీపై ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ అవినీతికి గ్యారెంటీ అయితే.. అవినీతికి వ్యతిరేకంగా చర్యకు మోడీ గ్యారెంటీ అంటూ తన బహిరంగ సభలలో ప్రతిపక్ష నాయకులపై మోడీ ఆరోపణల దాడి చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మోడీ తీరుపై కాంగ్రెస్ పై విధంగా స్పందించటం గమనార్హం. అవినీతి విషయంలో మోడీ ద్వంద్వ వైఖరి ఇప్పుడు దేశమంతా తెలుస్తున్నదన్నారు. అవినీతిపై మోడీని టార్గెట్ చేసేందుకు రాహుల్ గాంధీ అనర్హత వేటును ఖర్గే లేవనెత్తారు. "రాహుల్ గాంధీ సత్యం కోసం పోరాడుతున్నారు.

ఆ పోరాటం కొనసాగుతుంది. కానీ రాహుల్ గాంధీని పార్లమెంటు నుంచి బయటకు పంపడానికి మోడీ సర్కారు కుట్ర చేసింది"అని ఆయన అన్నారు. లలిత్ మోడీ, నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీ, విజయ్ మాల్యా, జతిన్ మెహతా వంటి వారు మోడీ ప్రభుత్వ కనుసన్నల్లోనే భారత్‌ను లూటీ చేసి పారిపోయారన్నది నిజం. బీజేపీ వారిని విడిపించింది. ఇలాంటి అవినీతిపరులను తప్పించటం ద్వారా మోడీ సర్కారు అధికారాన్ని సుస్థిరరం చేసుకోవటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నదన్నారు.

## ఎస్‌ఏయూ అధ్యాపకుల సస్పెన్షన్ రద్దు చేయండి

- విదేశాంగ మంత్రులకు విద్యావేత్తల వినతి



**న్యూఢిల్లీ :** సౌత్ ఆసియన్ యూనివర్సిటీ (ఎస్‌ఏయూ)కి చెందిన నలుగురు అధ్యాపకులపై విధించిన సస్పెన్షన్‌ను రద్దు చేయాలని ఐదు వందల మందికి పైగా విద్యావేత్తలు దక్షిణాసియా దేశాల విదేశాంగ మంత్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు మంత్రులకు లేఖలు రాశారు. వీరిలో ఇర్ఫాన్ హబీబ్, ప్రభాత్ పట్నాయక్, అకీల్ బిల్‌గ్రామీ, జ్ఞాన్ ప్రకాశ్, అడ్రే ట్రస్కే వంటి ప్రముఖులు ఉన్నారు. ఫెలోషిప్ స్టైఫండ్ పెంపుదలపై విద్యార్థులకు, అధికారులకు మధ్య నెలకొన్న ప్రతిష్టంభనను తొలగించాల్సిందిగా కోరినందుకు అధ్యాపకులపై సస్పెన్షన్ వేటు వేశారు. సమ్మె చేస్తున్న విద్యార్థులను చెదరగొట్టేందుకు ఢిల్లీ పోలీసులను యూనివర్సిటీ క్యాంపస్‌లోకి అనుమతించడాన్ని కూడా ఉపాధ్యాయులు తప్పుపట్టారు. ప్రవర్తన సరిగా లేని కారణంగా వారిని సస్పెండ్ చేశామని అధికారులు చెబుతున్నప్పటికీ దానిపై సస్పెన్షన్ ఆదేశాలలో ఎలాంటి వివరణ ఇవ్వలేదు. తమకు ఇస్తున్న నెలవారీ స్టైఫండ్‌ను గత సంవత్సరం తగ్గించడాన్ని విద్యార్థులు వ్యతిరేకించారు. పలు కమిటీలలో తమకు సహేతుకమైన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కాగా డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న విద్యార్థుల పట్ల అధికారులు ప్రవర్తించిన తీరును ప్రశ్నిస్తూ అధ్యాపకులు ఈ-మెయిల్స్‌లో సమాచారాన్ని పంపారు. దీనిపై ఆగ్రహించిన అధికారులు వారిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# కమ్ముకుంటున్న కరువు మేఘాలు

## వర్షాభావంతో రాష్ట్రం విలవిల | వానల కోసం రైతుల బెంగ | ప్రత్యామ్నాయ చర్యలపై సర్కారు దృష్టి

**ఎలా లెక్కిస్తారు..**
కరువును అంచనా వేయడానికి ప్రత్యేకమైన మార్గదర్శకాలు ఉన్నాయి. వరుసగా 21 రోజులు వర్షంపడకపోతే కరువుఛాయలు నెలకొన్నట్టుగా భావిస్తారు. అలాగే 21 నుంచి 28 రోజుల వరకు వర్షం పడకపోతే కరువు కింద అంచనా వేస్తారు. ఇకపోతే 28 నుంచి 43 రోజులు వానరాకపోతే తీవ్రమైన కరువుగా నిర్ణయిస్తారు.

**లోటు**
వర్షం పడాల్సిన దానికంటే 25 లోపు ఉన్న జిల్లాలు రాష్ట్రంలో ఇప్పుడు 30 జిల్లాలు ఉన్నాయి. 51 శాతం నుంచి 75 శాతం ఆదిలాబాద్, కుమ్రంభీమ్ ఆసిఫాబాద్‌లో పడింది. మొత్తం వర్షపాతం 119.0 ఎంఎంకుగాను 66.9 శాతం పడింది. లోటు 44 శాతం తక్కువగా ఉంది.20 లోపు జిల్లాలు సంగారెడ్డి, రంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట్, నల్లగొండ, నాగర్‌కర్నూల్ ఉన్నాయి.

**ప్రస్తుతం పంటల పరిస్థితి**
వానాకాలంలో జూన్ 28 నాటికి 15 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కావాల్సి ఉంది. ఇందులో 12.25 లక్షల ఎకరాల్లో పత్తి వేశారు. గత ఏడాది ఇదే సమయానికి 20 లక్షల ఎకరాల్లో సాగైంది. అంటే దాదాపు 5 లక్షల ఎకరాల్లో పంటలు వేయలేని పరిస్థితి నెలకొంది. పత్తి మాత్రం బాగానే సాగవుతున్నది. వరినాట్ల సంగతి పరిశీలిస్తే వానల్లేక ఇప్పుడిప్పుడే నార్లు పోస్తున్నరు. పత్తి, మొక్కజొన్న, పప్పుధాన్యాలు, నూనెగింజలు విత్తారు. కొన్ని చోట్ల మొలకెత్తలేదు. గింజలకు పురుగులు, చీమలు ఆశించి విత్తనాలను తినేశాయి. ఎండలు సైతం ఒక కారణం. మొలిచిన పంటలకు సంబంధించి పత్తి విషయంలో ఎకరానికి రూ. 5 వేలు ఖర్చుపెట్టారు. కొంత మంది రైతులు పెట్టుబడి పెట్టలేక వదిలేశారు.

**కరువుతో నష్టం**
2014 నుంచి 2018 వరకు కరువులు తీవ్రంగా వచ్చాయి. భారీ నష్టం వచ్చింది. 2015లో రూ. వేల నష్టం వచ్చింది. రాష్ట్రం ఆవిర్భావం తొలినాళ్లలో కరువు రాగా, ఆతర్వాత వరదలు శాపంగా మారాయి. 2018-19 నుంచి ఒకే ప్రాంతంలో వరదలొచ్చాయి. కేంద్రం 14వ ఫైనాన్స్ కమిషన్ 2015 నుంచి 2020 వరకు, 15 వ ఫైనాన్స్ కమిషన్ 2020 నుంచి 2023 వరకు నిధులు ఇస్తున్నాయి. అయితే కేంద్ర ప్రభుత్వం మాత్రం భారీగా నష్టపరిహారం నిధులు ఇవ్వడం లేదు. బృందాలను పంపడంలో ఆలస్యం చేయడం, పదే పదే అడిగిన తర్వాత నిధులు ఇస్తుండటంతో ఆశించిన ప్రయోజనం ఉండటం లేదు.

**కరువు..మానవజీవితాన్ని తీవ్రంగా ప్రభావం చేసే ప్రకృతి బీభత్సం. సాధారణంగా నెర్రెలు బారీన నేలలు..ఎండిపోయిన పంటలు..నీళ్లు లేక నోరు తెరిచిన బావులు, చెరువులు, కుంటలు కనిపిస్తాయి. వీటన్నింటిని చూస్తే భీకర కరువుగానే అందరమూ భావిస్తాం. కానీ, అసలు వాస్తవం వేరు. వర్షపాతం ఆధారంగా కరువును అంచనా వేస్తారు. దానికి కొన్ని ప్రత్యేక నిబంధనలు ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రాన్ని కరువు మేఘాలు కమ్ముకుంటున్నాయి.**

**నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్**

వానల్లేక పంటల సాగు తీవ్ర ఆలస్యమవుతున్నది. దీంతో మేఘాల కోసం ఆకాశానికేసి చూడాల్సిన పరిస్థితులు ఇప్పుడు నెలకొన్నాయి. ప్రతిరోజూ మబ్బులు కనిపిస్తున్నాయి. వాతావరణం ఉక్కగా ఉంటున్నది. కాగా, వర్షం మాత్రం కురవడం లేదు. ఆకాశం మేఘావృతం కావడమే తప్ప, వానల జాడ లేదు. ఒకవేళ పడ్డా చెదురు,ముదురు చినుకులు మినహా భారీ వర్షాలు కురవకపోవడం గమనార్హం.

**వర్షపాతం...**

పడాల్సినదానికన్నా 19 శాతం లోపు వర్షపాతం తక్కువ పడితే 'లోటు' వర్షపాతం అంటారు. 35 శాతం లోపు పడితే కరువు ప్రాంతంగా గుర్తిస్తారు. 35 శాతంపైన పడకపోతే తీవ్రమైన కరువు కింద భావిస్తారు. 500 మిల్లీమీటర్ల లోపు వర్షపాతం పడే ప్రాంతాలు ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలు వీటి కిందే వస్తాయి. 500 ఎం ఎం నుంచి 700 ఎంఎం వరకు వానలుపడ్డ ప్రాంతాల కింద ఉమ్మడి మెదక్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలు ఉన్నాయి. 750 ఎంఎంపైన ఉమ్మడి ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్ ఉన్నాయి. ఇదిలావుండగా 2.5 ఎం. ఎం వర్షం పడితే ఒక వర్షం రోజు కింద పరిగణిస్తారు. 2.4 ఎంఎం పడితే ఒక తడిగా భావిస్తారు.

**రైతుబంధు 15 లక్షల మందికే**

రైతుబంధు 15 లక్షల మంది రైతులకే అందుతున్నది. 64 లక్షల మందికి ఇవ్వాల్సి ఉంది. కానీ, చాలా మంది ఈ పథకంపై ఆధారపడ్డారు. రుణ ప్రణాళిక ప్రకటించినా బ్యాంకులు అప్పులు ఇవ్వడం లేదు. ఒక్కో ఎకరాలకు కనీసం రూ. 5 వేలు పెట్టుబడిపెట్టారు. యంత్రాలతో దున్నడం, విత్తనాలు, డీఏపీ కోసం ఖర్చుపెట్టారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విత్తిన తర్వాత 90 రోజుల పాటు పంటలపై ఫెరిత్రాయిడ్ మందులు కొట్టకూడదు. బాగా దెబ్బతిన్న పంట పెసరు. మూడురోజులు గట్టిగా ఎండలు



కొడితే నాశనమవుతుంది. కందులు 5.62 లక్షల ఎకరాలకుగాను 85 వేల ఎకరాల్లో మాత్రమే సాగైంది. వేరుశెనగ వానాకాలంలో 20 వేల ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా, 729 ఎకరాల్లో మాత్రమే అయింది. ప్రభుత్వం నుంచి రుణాలు భారీగా లేకపోవడం, రైతుబంధు అందరికి అందకపోవడంతో ప్రయివేటు అప్పులు తెచ్చుకుంటున్న పరిస్థితి ఇప్పుడుంది.

**చెరువులు నింపడం**

సీఎం కేసీఆర్ ప్రకటన ప్రకారం ప్రాజెక్టుల్లోని నీళ్లతో చెరువులు నింపాల్సి ఉంది. మెట్టప్రాంతాలకు చెరువులు నింపడంతో ప్రయోజనం ఉండదు. వానాకాలంలో 1.34 కోట్ల ఎకరాల్లో పంటలు వేయాలి. కానీ, వర్షాభావంతో 15 లక్షల ఎకరాల్లో సాగుకావడం గమనార్హం. తక్కువ కాలంలో పండే ఆ మెట్ట పంటవిత్తనాలను రైతులకు అందుబాటులో తేవాల్సి ఉన్నా, ఆ ప్రయత్నాలేవీ సర్కారు నుంచి లేవు. మొక్కజొన్న, వేరుశెనగ, పత్తి, నూనెగింజలు, వరి ఒకే రకమైన విత్తనాలు మార్కెట్లో ఉన్నాయి. పరిశోధనలు లేకపోవడంతో తక్కువ కాలపరిమితి పంటల విత్తనాలు రాష్ట్రంలో దొరకడం లేదు. దీంతో పంటలువేసి నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేలు పరిహారంగా చెల్లిస్తేనే మళ్లీ కొత్తగా విత్తనాలు తయారుచేయడానికి వీలుంటుంది.

**మరమ్మత్తులు చేయాలి**

ప్రాజెక్టులు, చెరువులు, కాలువలను వానాకాలంలో కచ్చితంగా మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది. చివరి ఆయకట్టు వరకు సాగునీరు వెళ్లేలా ఈ చర్యలు తీసుకోవాలి. కృష్ణా, గోదావరిలో వస్తున్న నీటిని ప్రాజెక్టులు నింపడానికి ఎత్తిపోతల పథకాలను అన్నింటిని వినియోగించాలి. వ్యవసాయశాఖ, రెవెన్యూ శాఖ మొత్తం గణాంకాలు సేకరించి జరిగిన నష్టాన్ని అంచనా వేయాలి. మరో 10 రోజుల్లో వర్షాలు పడకపోతే వరి మినహా ఇతర పంటలను అనివార్యంగా మార్చాల్సి ఉంటుంది.

**తీసుకోవాల్సిన చర్యలు**

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతులకు సాయం చేయాలి. ఆమేరకు కరువు అంచనా చర్యలు తీసుకోవాలి. కరువు అంచనా వేసి గణాంకాలు తీయాలి. కేంద్రానికి ప్రత్యేకంగా నివేదిక పంపించాలి. అక్కడి నుంచి ప్రత్యేక కరువు గుర్తింపు బృందాలను నుంచి రప్పించాలి. అనంతరం కరువు సాయం కోరాలి.

| సంవత్సరం | కరువు | నష్టం (రూ. కోట్లలో) | కేంద్రం (రూ. కోట్లలో) |
|---|---|---|---|
| 2015-16 | 231 | 3506 | 1065 |
| 2016-17 | 313 | 2806 | 288 |
| 2017-18 | 232 | 2200 | 302 |
| 2018-19 | 280 | 1800 | 318 |
| 2019-20 | 383 | 4500 | 333 |
| | | 14,812 | 2306 |

## ఉద్యమ గాయకులు సాయిచంద్‌కు.. సీఎం ఘన నివాళి



**నవతెలంగాణ -వనస్థలిపురం**

తెలంగాణ మలిదశ ఉద్యమ గాయకులు సాయిచంద్‌కు సీఎం కేసీఆర్ నివాళులు అర్పించారు. హైదరాబాద్ వనస్థలిపురంలోని జీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన సాయిచంద్ దశదిన కర్మకు సీఎం కేసీఆర్ హాజరై సాయిచంద్ చిత్రపటానికి పూలమాల వేసి, పుష్పాలతో నివాళు లర్పించారు. సాయి చంద్ సతీమణికి ధైర్యాన్ని చెప్పారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సబితా ఇంద్రా రెడ్డి, జగదీష్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మహమూద్ అలీ, గంగుల కమలాకర్, నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ గోరంటి వెంకన్న, మండలి చైర్మెన్ గుత్తా సురేందర్ రెడ్డి, ఎంపీ రాములు, ఎమ్మెల్యేలు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి, లక్ష్మారెడ్డితోపాటు వందలాది అభిమానులు విచ్చేసి చిత్రపటానికి నివాళులర్పించారు.

## పాలికా బజార్‌లో అగ్నిప్రమాదం

- అగ్నికి దగ్ధమైన బట్టల దుకాణం
- మూడు ఫైర్ ఇంజన్లతో మంటలు అదుపు
- షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం



**నవతెలంగాణ-కంటోన్మెంట్**

షార్ట్ సర్క్యూట్ వల్ల బట్టల దుకాణంలో ఆదివారం భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నది. ఈ ఘటన సికింద్రాబాద్‌లోని మోండా డివిజన్ పరిధి పాలికాబజార్‌లో చోటు చేసుకుంది. స్థానికులు, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. అన్‌మోల్ సెలెక్షన్, అన్‌మోల్ కిడ్స్ వేర్, రెడీమెడ్ బట్టల షాప్‌లో ఆదివారం ఉదయం ఐదు గంటలకు దట్టమైన పొగలు రావడంతో గమనించిన స్థానికులు సకాలంలో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దాంతో మూడు ఫైర్ ఇంజన్లతో మంటలు అదుపు చేసినట్టు అధికారులు తెలిపారు. కాగా, షార్టుసర్క్యూట్ వల్లనే ఈ ప్రమాదం చోటు చేసుకున్నదని, ఆ సమయంలో జన సంచారంతో పాటు షాపుల్లో పనివాళ్ళు ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పిందన్నారు. ప్రమాదానికి గురైన షాపునకు ఆనుకునే చాలా షాపులు, లాడ్జీ ఉండటం వల్ల వారు కొంచెం సేపు భయాందోళనలకు గురయ్యినట్టు తెలిపారు. కాగా, అగ్నిప్రమాదంపై కేసు నమోదు చేసుకుని, ఈ ప్రమాదానికి గల కారణాలను దర్యాప్తు చేస్తున్నట్టు ఫైర్ అధికారులు, స్థానిక పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని స్థానిక కార్పొరేటర్ దీపిక పరిశీలించారు. జీహెచ్ఎంసీ అధికారుల ప్రత్యేక బృందం సహాయక చర్యలు చేపట్టారు.

## వివక్షకు వ్యతిరేకంగా పోరాడాలి

- మరియం ధావలే



**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

తమపై జరుగుతున్న దాడులను ఎదుర్కునేందుకు ఆడపిల్లలు కరాటేలాంటి శిక్షణ ద్వారా ఆత్మస్థైర్యాన్ని పెంచుకోవాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలె పిలుపునిచ్చారు. ఐలమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత మూడు నెలలుగా పిల్లలకు ఉచిత కరాటే శిక్షణను ఇస్తున్న నేపథ్యంలో వీరికి పోటీలు నిర్వహించి ఇందులో గెలుపొందిన విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. బ్లాక్ బెల్టు వచ్చే వరకు శిక్షణను పొందాలని సూచించారు. వ్యక్తి గత జీవితంలో క్రమ శిక్షణగా ఉంటూ విద్యలో మొదటి స్థానం సంపాదించాలని కోరారు. సమాజం పట్ల బాధ్యతగా ఉండాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఐద్వా జాతీయ అధ్యక్షులు పీకే శ్రీమతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, ట్రస్ట్ కార్యదర్శి బి హైమావతి, కెఎన్ ఆశాలత, బుగ్గవీటి సరళ తదితరులు పాల్గొన్నారు.

## వినోద్‌రెడ్డి మృతి సీపీఐ(ఎం)కు తీరనిలోటు

- సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు



**నవతెలంగాణ-సంస్థాన్‌నారాయణపురం**

గుజ్జ ఎంపీటీసీ, సీపీఐ(ఎం) నాయకులు దోడ వినోద్‌రెడ్డి మృతి పార్టీకి తీరనిలోటని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం గుజ్జ గ్రామంలో గ్రామ ప్రజలు, పార్టీ కార్యకర్తలు, బంధుమిత్రులు కన్నీటితో వినోద్‌రెడ్డి మృతదేహానికి తుది వీడ్కోలు పలికారు. మృతదేహానికి చెరుపల్లి సీతారాములు పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో పార్టీ బలోపేతానికి వినోద్‌రెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. ప్రజాసమస్యల పరిష్కారంలో నిరంతరం ముందుండేవాడని గుర్తు చేశారు. అంత్యక్రియలకు నారాయణపురం మండలంలోని పలు గ్రామాల పార్టీ కార్యకర్తలతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి అనేక మంది పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు. పుట్టపాకకు చెందిన డప్పు కళాకారులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన ప్రజానాట్యమండలి కళాకారులు ఆటపాటలతో అంతిమయాత్ర నిర్వహించారు. మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ వీరమల్ల భానుమతి వెంకటేష్, పుట్టపాక ఎంపీటీసీ మర్రి వసంత, సీపీఐ(ఎం) నల్లగొండ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీలో చేరగానే నీతిమంతులవుతారా?

### సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి



**నవతెలంగాణ-నేరేడుచర్ల**

అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఎమ్మెల్యేలు, మంత్రులు.. పలువురు రాజకీయనాయకులు బీజేపీలో చేరితే వారంతా నీతిమంతులవుతారా అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటిరంగారెడ్డి ప్రశ్నించారు. శనివారం ప్రధాని తెలంగాణ పర్యటనకు వచ్చిన సందర్భంగా చేసిన వ్యాఖ్యలపై ఆదివారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలోని అరిబండి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో స్పందిస్తూ ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జరిగిన అవినీతి, అక్రమాలు ఏ రాష్ట్రంలో జరగలేదన్న ప్రధాని మోడీ కేంద్రంలో ఉన్నది వారి ప్రభుత్వమే కదా ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని ప్రశ్నించారు. దేశంలోని అన్ని రకాల వస్తువులపై జీఎస్టీని ఇష్టమొచ్చిన రీతిలో పెంచుకుంటూ సామాన్య ప్రజలపై భారాలు మోపుతున్నారని విమర్శించారు. బ్యాంకుల్లో రూ.లక్షల కోట్లు అప్పులు తీసుకుని ఎగవేతకు పాల్పడే వారికి కేంద్రం అండగా నిలిచిందన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాకముందు అదాని ఆస్తి రూ.40 వేల కోట్లు ఉండేదని, ఇప్పుడు రూ.11లక్షల కోట్లకు చేరిందన్నారు. 60,70 ఏండ్లుగా ప్రజలంతా ఏర్పాటు చేసుకున్న పబ్లిక్ సెక్టార్లను బడా కార్పొరేట్ శక్తులకు అప్పనంగా అమ్మేస్తున్నారని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి రానప్పుడు దేశంలో రూ.60 లక్షల కోట్ల అప్పు ఉండగా, నేడు రూ.1.47లక్షల కోట్లకు చేరిందన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న పార్టీలను చీల్చడం, ప్రభుత్వాలను కూల్చడమే ధ్యేయంగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతుందని ఆరోపించారు. కార్మిక వ్యతిరేక చట్టాలు, రైతు వ్యతిరేక చట్టాలు తీసుకురావడంతో పాటు మతవిద్వేషాలు రెచ్చగొట్టి తెలంగాణలో బలపడాలని చూస్తున్నారన్నారు. వీర తెలంగాణ సాయుధ పోరాటం నడిపిన తెలంగాణ ప్రజలు ఇలాంటి వారిని దగ్గరకు రానివ్వరని స్పష్టంచేశారు. రాష్ట్రంలో కేసీఆర్ ఇచ్చిన హామీలు నెరవేర్చి ప్రజాస్వామ్యయుతంగా ప్రభుత్వాన్ని నడపాలని కోరారు. సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు మల్లు గౌతమ్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి కొదమగుండ్ల నగేష్, మండల కార్యదర్శి సిరికొండ శ్రీను, కుంకు తిరుపతయ్య, నీలా రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మాసిటీ భూ సేకరణలో అవినీతి

### 2013 భూ చట్టానికి విరుద్ధంగా భూ సేకరణ

- కంపెనీలతో ఈ ప్రాంతం సర్వనాశనం
- వెంటనే ఫార్మాసిటీ ఏర్పాటును విరమించుకోవాలి : టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం
- కుర్మిద్ద నుంచి చింతపట్ల వరకు చెరువుల పరిశీలన



**నవతెలంగాణ-యాచారం**

ఫార్మాసిటీ భూ సేకరణలో అవినీతి జరిగిందని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం ఆరోపించారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా యాచారం మండలం కుర్మిద్ద నుంచి 'ఫార్మాసిటీ హటావో తెలంగాణ బచ్చావో' అంశంపై తాడిపర్తి, నానక్‌నగర్, మేడిపల్లి, తక్కల్లపల్లి, చింతపట్ల చెరువులను పరిశీలించారు. ఫార్మాతో జరగబోయే ప్రమాదాన్ని అంచనా వేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కోదండరాం మాట్లాడుతూ.. రైతుల భూమిని టీఎస్ఐఐసీ పేరుమీద మార్చుకోవడం దుర్మార్గమన్నారు. 2013 భూ చట్టానికి విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం విచ్చలవిడిగా భూసేకరణ చేపట్టిందని తెలిపారు. 2013 భూ సేకరణ చట్టం నిబంధనలను గౌరవించకుండా స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. నిజమైన లబ్దిదారులకు ఇప్పటి వరకు ఫార్మా పరిహారం అందలేదని అన్నారు. ఫార్మాసిటీలో వచ్చే కంపెనీలతో ఈ ప్రాంతం మొత్తం సర్వనాశనం అవుతుందని తెలిపారు. రాబోయే రోజుల్లో విపరీతమైన కాలుష్య భరితంగా మారి, భవిష్యత్తు తరాలకు, పర్యావరణానికి పెను ప్రమాదం రానుందని హెచ్చరించారు. ఫార్మాసిటీతో గొలుసుకట్టు చెరువులు, కుంటలు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఫార్మా కంపెనీలు విసర్జించే విషపూరితమైన రసాయనాలతో గాలి, నీరు, నేల పూర్తిగా కలుషితమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో ఫార్మాసిటీని రద్దు చేసే వరకూ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముదిరెడ్డి కోదండరెడ్డి, ఇబ్రహీంపట్నం నియోజవర్గ కాంగ్రెస్ నాయకులు మర్రి నిరంజన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు లిక్కి పాండురంగారెడ్డి, సర్పంచ్లు దంతుక పెద్దయ్య, బందే రాజశేఖర్‌రెడ్డి, దోస రమేష్, ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట సమితి నాయకులు దార సత్యం, కౌవుల సరస్వతి, కనమోని గణేష్, శ్రీకాంత్ నాయక్, వెంకటేష్, కమలాకర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, స్థానిక నాయకులు, యుగంధర్‌రెడ్డి, గడ్డం యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## గురుకులంలో కనీస సౌకర్యాలు లేవంటూ..

- డోర్నకల్ మైనార్టీ పాఠశాల ముందు తల్లిదండ్రుల ధర్నా
- మైనార్టీ బోర్డు నాయకునిపై దాడి



**నవతెలంగాణ-మహబూబాబాద్**

మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థినీలకు సరైన వసతులు లేవంటూ విద్యార్థినుల తల్లిదండ్రులు ఆదివారం పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. తల్లిదండ్రులను సముదాయించేందుకు వచ్చిన మైనార్టీ సంక్షేమ సంఘం నాయకులు అఖిల్ కాన్‌పై తల్లిదండ్రులు దాడి చేశారు. తల్లిదండ్రులు, విద్యార్థినులు తెలిపిన వివరాల ప్రకారం.. రెండేండ్లుగా డోర్నకల్‌లో కనీస సౌకర్యాలు, భవన వసతి లేదంటూ డోర్నకల్ నియోజకవర్గంలోని కొరివి మండల కేంద్రంలో పాఠశాల కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆ పాఠశాలను డోర్నకల్ మండల కేంద్రంలోని ప్రయివేటు భవనానికి మార్చారు. జూన్ 12వ తేదీన పాఠశాల ప్రారంభమైంది. అయితే, 500 మంది విద్యార్థినులు ఉన్న హాస్టల్‌లో ఐదు బాత్‌రూమ్‌లు మాత్రమే ఉన్నాయని, అవి ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. అంతేకాకుండా త్రాగునీరు సక్రమంగా లేదని, విద్యార్థులకు స్నానాలకు సరిపోయేంతగా నీళ్లు రావడంలేదని, మోటార్లు పనిచేయడం లేదని, భోజనం సరిగ్గా ఉండటం లేక తమ పిల్లలు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం తమ పిల్లలను చూడటానికి వస్తే తమకు మంచినీళ్లు లేవని, బాటిళ్లు కొనుక్కురమ్మని చెప్పడం తమ హృదయాలను కలిచివేసిందని వాపోయారు. మైనార్టీ సంక్షేమ సంఘం కమిటీ సభ్యుడైన అఖిల్, ఎమ్మెల్యే రెడ్యానాయక్‌తో పాటు కొందరు అధికారపార్టీ నేతల రాజకీయ ఒత్తిళ్లతోనే పాఠశాలను డోర్నకల్‌కు తరలించి పిల్లల భవిష్యత్తులో ఆడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొరవిలో అన్ని హంగులతో సౌకర్యవంతంగా ఉందని, ఇప్పటికైనా కొరివికి పాఠశాలను తరలించాలని డిమాండ్ చేశారు.కాగా, తల్లిదండ్రుల ఆందోళన సమయంలో ప్రిన్సిపాల్ పుష్పజా రెడ్డి అందుబాటులో లేకపోవడంతో మైనార్టీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ సభ్యులు అఖిల్ ఖాన్ పాఠశాలకు రాగా, అతని ద్విచక్ర వాహనం తాళం చెవి, సెల్‌ఫోన్ లాక్కొని అతనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళన విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని తల్లిదండ్రులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ప్రిన్సిపల్ పద్మజా రెడ్డి హాస్టల్‌కు చేరుకున్నారు. ఇదే క్రమంలో వరంగల్‌కు చెందిన విజిలెన్స్ అధికారులు అంజద్ పాషా, మక్బూల్ ఆశ పాఠశాలకు చేరుకున్నారు. కాగా, ఈ మొత్తం ఘటనకు ప్రిన్సిపాల్ బాధ్యతా రాహిత్యమే కారణమని మున్సిపల్ చైర్మెన్ వాంకుడోత్ వీరన్న అధికారులకు ఫిర్యాదు చేశారు. కొరవి నుంచి డోర్నకల్‌కు పాఠశాలను తరలించడం ప్రిన్సిపాల్‌కి ఇష్టం లేదని, అం దుకే తల్లిదండ్రుల చేత ఆందోళన చేపిస్తుందని ఆరోపించారు. ఈ మేరకు డోర్నకల్‌కు చెందిన మైనార్టీ నాయకులంతా సంఘటన స్థలానికి వచ్చి ఆందోళన చేశారు. ఈ క్రమంలో కొంత ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీ సులు సంఘటన స్థలంలో పరిస్థితులను చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నారు.

## బాల కార్మికులతో వెట్టిచాకిరీ

- కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి
- వలస కార్మిక చట్టాన్ని అమలు చేయాలి
- పారిశ్రామిక ప్రాంత కార్మికుల సమస్యలపై జీపుజాతాలో..
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్, భూపాల్



**నవతెలంగాణ - చేగుంట/ తూప్రాన్ రూరల్/ మనోహరాబాద్**

పారిశ్రామిక రంగాల్లో బాల కార్మికులతో వెట్టి చాకిరీ చేయిస్తూ కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం చట్టాలను అమలుచేస్తూ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, జే.మల్లికార్జున్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్‌లో కనీస వేతనాలు సవరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 4న బయలుదేరిన జీపుజాత ఆదివారం మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్, ముప్పిరెడ్డిపల్లి, కూచారం, చేగుంట పారిశ్రామిక ప్రాంతాల్లో పర్యటించింది. సాగర్ ఏషియా యూనిట్ 2, మహాలక్ష్మి, గ్లోబల్, గ్లోస్టర్, కాలకల్ ఫౌండ్రి, ఇన్ఫ్రాటెక్, పరిశ్రమల దగ్గర, చేగుంటలో నిర్వహించిన సభల్లో భూపాల్, మల్లికార్జున్ కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వాలు కార్మికుల పొట్టకొట్టి బడా బాబులను పెంచి పోషిస్తున్నాయని విమర్శించారు. పారిశ్రామిక రంగ కార్మికులు, గ్రామ పంచాయతీ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులకు న్యాయం జరగడం లేదన్నారు. చాలా కంపెనీల్లో బాల కార్మికులతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని ఆరోపించారు. 2014 నుంచి కనీస వేతనాన్ని అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. పారిశ్రామిక ప్రాంతంలో పనిచేస్తున్న కార్మికులు ఈఎస్ఐ, పీఎఫ్, సెలవులు, ఓటి డబల్ వేతనం, యూనిఫామ్, బూట్లు, క్యాంటీన్ ప్రమాదం తర్వాత ఆదుకోవడం తదితర సౌకర్యాలు లేక ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మహాలక్ష్మి, గ్లోస్టర్, గ్లోబల్, సాగరేసియా, కాలకల్ ఫౌండ్రి, బీహార్, ఒడిశా, ఇతర రాష్ట్రాల కార్మికులకు సరైన సేఫ్టీ పరికరాలు ఇవ్వకుండా 12 గంటల పనులు చేయిస్తున్నారని చెప్పారు. వలస కార్మికులనైతే కంపెనీల ఆవరణలో చిన్న చిన్న గదుల్లో 10 నుంచి 15 మందిని పెట్టి, కనీస సౌకర్యాలు లేకుండా బానిసల మాదిరిగా గొడ్డు చాకిరీ చేయించుకుంటు న్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి అనువైన ప్రదేశాల్లో ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. వలస కార్మికుల చట్టాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ.మల్లేశం మాట్లాడుతూ.. రాష్ట్రంలో 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్‌లో కనీస వేతనాలు వెంటనే సవరించాలని కోరారు. ఐదు రంగాలకు చెందిన ఫైనల్ నోటిఫికేషన్ జీవో నెంబర్లు 21 ,22, 23, 24, 25ను గెజిటెడ్ చేయాలన్నారు. పెరుగుతున్న శాస్త్ర సాంకేతికత దృష్ట్యా రోజుకు 7 గంటలు, వారానికి ఐదు రోజుల పని దినం ఉండాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు చట్టబద్ధత సౌకర్యాలు పీఎఫ్, ఈఎస్ఐ, సెలవులు, బోనస్, గ్రాట్యూటీ అమలు చేయాలన్నారు. 1979 అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టం ప్రకారం హక్కులు, సౌకర్యాలు అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా వలస కార్మికులు ఉంటున్న ప్రదేశాలు, గదులను పరిశీలించారు. విద్యుత్ నీటి సౌకర్యం, వాష్ రూమ్, ఎలాంటి సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై ఈనెల 14న జిల్లా కలెక్టరేట్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులను, జిల్లా అధ్యక్షులను, అపోలో కార్మికులు సన్మానం చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి. బస్వరాజ్, అధ్యక్షులు ఏ. మహేందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బి. బాలమణి, అపోలో ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు గడ్డమీది రామస్వామి, సతీష్ గౌడ్, గ్రామపంచాయతీ జిల్లా కార్యదర్శి ఆసిఫ్, స్వామి, రాములు, వీరేష్, సుగుణ ప్రధాన కార్యదర్శి యాదగిరి, ఇండస్మేడ్ కేర్ ప్రధాన కార్యదర్శి బాలేష్, పారిశ్రామిక కార్మికులు, గ్రామపంచాయతీ సఫాయి కార్మికులు, పాల్గొన్నారు.

## ముసలి చారల పులి



చారలను చూసి బలుపనుకొని
గాండ్రిస్తున్నది
ముడుతల మొఖం పులి
వయసూ, రంగూ బయట పడుతుందనే
సోయిలేక పూనకంతో
సుళ్ళు తిరుగుతున్నది
ప్లాస్టిక్ కోరలు, గోద్రెజ్ జూలుతో
అరిగిన గోర్లతో అసపోస్తూ అసపోస్తూ
గోమాయువుపై నాలుక చాస్తున్నది
కారాలు చల్లుతున్నది
మిరియాలు నూరుతున్నది.

తన సత్య నిష్ఠను మాటల పొత్తిళ్లలో
భద్ర పరుచుకుంటూ
నిదానంగా విన్నవిస్తున్నది సాధు తల్లి
తన ఉడుకు నెత్తురు శక్తిని
పళ్ల పిడికిళ్లలో పట్టుకుంటూ
పెదాల తూములోంచి జారకుండా
పదిల పరుచుకుంటున్నది గోమాయి

మాటల వడగండ్లు చూపుల పిడుగులు
హుంకార హోరుగాలిని
తట్టుకుంటూ ఓర్చుకుంటూ
ఓపికను గుండె అల్చిప్పలో దాచుకున్నది.
దాడులు ముదిరినా
తుఫానులు చుట్టుముట్టి నా
పక్కనున్న మూక దోస్తులు
రెచ్చగొట్ట ఈ లలు వేసినా
తన శోకాన్ని వినయపు మూటలో
ముడేసుకుంటూ
తన జాతి శీలాన్ని రక్షించుకుంటున్నది.
ఆవు దుఃఖధారలను చూసి
గాయాల మూల్గులు విని
కరిగి పోవడానికి ఇదేమన్నా
అనంతుని కరుణ గల పులి కాదు గదా
దీనికేక్కడిది ఆ సంస్కారం
దీనికెక్కడిదీ ఆ నవనీత గుణం

అది ముసలిదైనా
రాగిదేలిన పోసల్ని వూపుకుంటూ
వెంట బడడమే దాని ధర్మమన్నట్టు
సొల్లు కారేట్టు అరుస్తున్నది
అవి యుద్ధ సంస్కృతీ లోంచి
తడబడ్డ అడుగులు గదా
ఆధిపత్య గుహలోంచి మొలిచిన కేకలుగదా

దాని జిగిలేని పంజా ఎత్తకముందే
సురభులకు ఆత్మ రక్షణ తర్ఫీదునివ్వాలి
దాడిని ఎదుర్కొనే సత్తువను
గోవులకు నూరి పోయాలి.
లేగలన్నిటికీ
పులి పాఠాలు నేర్పుతూ ఉండాలి.

– డా. ఉదారి నారాయణ
9441413666



## సాహితీ వార్తలు

### అక్షర సేద్యం కవితల పోటీ ఫలితాలు

అక్షర సేద్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కవితల పోటీల ఫలితాలు వెలువరించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు మనిషి జాడ – పెనుగొండ బసవేశ్వర్, పశువు – చిందం రమేష్, కొత్తగా చిగురించాలి – డా॥ మల్లిపూడి రవిచంద్రలతో పాటు పని దేవత – చింతా అప్పలనాయుడు, ఖాళీ మనుషులు – కళా గోపాల్, నన్ను నన్నులా – డి. నాగజ్యోతి శేఖర్, ఎన్నాళ్ళుంటారు రోడ్ల మీద – డా॥ జడా సుబ్బారావు, అవిభాజ్య దుఃఖం – లేదాళ్ళ రాజేశ్వరరావులు ఐదు ప్రత్యేక బహుమతులకు ఎంపికయ్యారు. పుస్తకావిష్కరణ రోజున బహుమతులు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. వివరాలకు 9701933704 నంబరు నందు సంప్రదించవచ్చు.

### చిన నాగయ్య స్మారక పురస్కారం

యం. చిన నాగయ్య స్మారక పురస్కారానికి ఉత్తమ కవితా సంపుటి, ఉత్తమ కథా సంపుటి, ఉత్తమ వ్యాస సంపుటి, ఉత్తమ జీవిత చరిత్ర విభాగాల్లో రచయితల నుండి రచనలు ఆహ్వానిస్తున్నట్లు నాగయ్య మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధి యం.రాం ప్రదీప్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు రెండు ప్రతులను ఆగస్ట్ 31లోగా యం. రాం ప్రదీప, 10-263-6,ఆర్చ్ రోడ్, సాయి రాఘవ కాలనీ, తిరువూరు, ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 521235 చిరునామాకు పంపవచ్చు. వివరాలకు 9492712836 నంబరు నందు సంప్రదించవచ్చు.


### కథలకు ఆహ్వానం

డాక్టర్ వేదగిరి రాంబాబు జయంతి సందర్భంగా, అక్టోబర్ 14న వెలువడనున్న మా కథలు - 2022 సంకలనంలో ప్రచురణ కోసం, 2022 లో పబ్లిష్ అయిన కథలను రచయితలు పంపవచ్చును. ఆసక్తి కలిగిన వారు ఆగస్టు 15లోగా సి. హెచ్. శివరామ ప్రసాద్, కన్వీనర్ స్వగృహ అపార్ట్మెంట్, 'సి' బ్లాక్, జి-2, భాగ్యనగర్ కాలనీ, కూకట్పల్లి హైదరాబాద్ - 500072 చిరునామాకు పంపవచ్చు. వివరాలకు 9390085292 నంబరు నందు సంప్రదించవచ్చు.

### మహాకవి శ్రీశ్రీ స్మారక కథల పోటీ

సింహ ప్రసాద్ సాహిత్య సమితి ఆధ్వర్యంలో తీసుకువస్తున్న సంకలనం 'మా కథలు -2022'. ఈ సందర్భంగా మహాకవి శ్రీశ్రీ స్మారకంగా కథల పోటీని నిర్వహిస్తున్నారు. కుక్కపిల్ల, అగ్గిపుల్ల, సబ్బు బిళ్ళ అనే అంశాల మీద కథలు రాయవచ్చు. ఒక వ్యక్తి మూడింటిమీద కథలు రాసి పంపవచ్చు. ఎంపికైన కథకు రూ.2000/- బహుమతి ఉంటుంది. 50 ఏళ్ళ దాటని వారికే ఈ పోటీ పరిమితం. ఆసక్తి కలిగిన వారు ఆగస్టు 20 లోగా సింహప్రసాద్ సాహిత్య సమితి, 401, మయూరి ఎస్టేట్స్, ఎం.ఐ.జి -2-650, కే.పి. హెచ్. బి. కాలనీ, హైదరాబాద్ - 500 072 చిరునామాకు పంపవచ్చు. అక్టోబర్ 14న హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించే కార్యక్రమంలో బహుమతి ప్రదానం ఉంటుంది. వివరాలకు 9849061668 నంబరు నందు సంప్రదించవచ్చు.


# కేతు కథల్లో స్త్రీ చైతన్యం



**తెలుగుకథా సాహిత్యంలో రాయలసీమ కథా సాహిత్యం ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకుంది. రాయలసీమ కథా రచయితలలో అగ్రేసరుడైన కేతు విశ్వనాథరెడ్డి కథా సాహిత్యంలో ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నారు. ఈయన రాయల సీమలో వానలు లేక పంటలు పండక మనుషులతో పాటు మూగ జీవాల దీన పరిస్థితులను తన కథలలో చిత్రీకరించాడు. సమాజిక దార్శనికుడైన కేతు విశ్వనాథరెడ్డి సమాజంలో స్త్రీ ఎదురుకొంటున్న సమస్యలను, వారు పడే కష్టాన్ని, వారి బాధలను తన కథలలో ప్రస్తావించకుండా ఉండలేకపోయారు. స్త్రీని కుటుంబానికే కాకుండా దేశానికే వెన్నెముకగా తన కథలలో చిత్రీకరించారు.**

ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి 1939లో ఆగస్ట్ 10న కడప జిల్లా కమలాపురం తాలూకా రంగసాయిపురంలో కేతు పెద్ద వెంకట రెడ్డి, శ్రీమతి నాగమ్మ దంపతులకు జన్మించారు. ఈయన కలం నుండి "జప్తు" (1974), "కేతు విశ్వనాథరెడ్డి కథలు" (1991), "ఇచ్ఛాగ్ని" (1996) అనే శీర్షికలతో కథా సంపుటాలుగా వెలువడ్డాయి. "వేర్లు", "బోది" (1994) అనే నవలికలు జాలువారాయి. "కేతు విశ్వనాథరెడ్డి కథలు" సంపుటానికి 1993 – 94లో తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం, 1996లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించాయి. కేతు విశ్వనాథరెడ్డి కథకునిగానే కాకుండా పరిశోధకుడిగా, విమర్శకుడిగాను ప్రసిద్ధి గాంచారు. "కడప ఊళ్ళ పేర్లు" ఈయన పరిశోధన గ్రంథం అయితే, సాహిత్యానికి సంబంధించిన అనేక విషయాలను చర్చిస్తూ "దృష్టి" అనే పేరుతో 1998లో వ్యాస సంపుటిని వెలువరించారు. ఈయన సాహిత్యానికి చేసిన కృషికి భారతీయ భాషా పరిషత్తు పురస్కారం, రావిశాస్త్రి పురస్కారం, రితంబరీ పురస్కారం, పులుపుల వెంకట శివయ్య సత్కారం, తుమ్మల వెంకట రామయ్య బంగారు పతకం, అజో అండ్ విభో పురస్కారం, గోపీచంద్ సాహిత్య సత్కారం ఇలా ఎన్నో పురస్కారాలు వరించాయి. ఈయన మొదట పాత్రికేయుడిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి కడప, తిరుపతి, హైదరాబాదు తదితర ప్రాంతాల్లో అధ్యాపకులుగా పనిచేసి డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డైరెక్టరుగా విధులు నిర్వహించి పదవీ విరమణ చేశారు. పాఠశాల స్థాయి నుండి విశ్వవిద్యాలయ స్థాయి వరకు అనేక పాఠ్య పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. 22 మే 2023న ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి కన్నుమూశారు.

నేడు స్త్రీ సమాజంలో మగవాళ్ళతో సమానంగా అన్ని రంగాలలో రాణిస్తున్నా దానికి గర్వించాల్సింది బోయి స్త్రీ శరీరాన్ని మాత్రమే దుర్బుద్ధితో కాంక్షిస్తున్న కొంతమంది మగవాళ్ళ మనస్తత్వాన్ని 'రెక్కలు' కథలో చూడవచ్చు. ఈ కథలో తండ్రి లేకపోవడంతో కుటుంబ భారం పంకజం మీద పడుతుంది. పదవ తరగతి వరకే చదువుకున్న పంకజం కుటుంబ పోషణ కోసం హోంగార్డ్ ఉద్యోగం చేయాల్సివస్తుంది. హోంగార్డ్ పంకజంతో పాటు కథకుడికి, పి.ఓ నాగేశ్వరరావుకి ఒక మారుమూల గ్రామం వద్ద ఎలక్షన్ డ్యూటీ పడటంతో ముందురోజు రాత్రి ముగ్గురూ ఊరికి కొంత దగ్గరలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో గడపాల్సివస్తుంది. ఆ రాత్రి నుండి ఎలక్షన్స్ అయిపోయేంత వరకు పి.ఓ నాగేశ్వరరావు తన దుర్బుద్ధితో పంకజాన్ని హింసించిన విధానం, పంకజం నాగేశ్వరరావుని ఎప్పటికప్పుడు దూరం పెడుతూ తనను తాను కాపాడుకుంటున్న విధానాన్ని గమనించిన కథకుడు తన అమ్మాయిలను కాపాడుతున్నవనుకుంటున్న తమ రెక్కలు ఎంత బలహీనమైనవో తెలుసుకుంటాడు. సమాజంలో ప్రతీరంగంలో స్త్రీలు పడుతున్న ఇబ్బందులను కేతు విశ్వనాథరెడ్డి ఈ ఒక్క కథ ద్వారా తెలియజేసాడు.





'చీకటినాడీ – వెలుగు నెత్తురు' కథలో ఎర్ర సుబ్బులు పాత్ర ధైర్యసాహసాలతో కూడుకున్నది. ఈ కథలో రామిరెడ్డి తనదగ్గర కూలీలుగా నమ్మకంగా పనిచేస్తున్న బడుగు వర్గాల వారికి ఇవ్వాల్సిన కూలీలు ఇవ్వకుండా, వారికి అవసరం అయినప్పుడు మాత్రమే అప్పుగా డబ్బిచ్చి వారిని బానిసలుగా చేసుకుంటాడు. తనదగ్గర పనిచేసే కూలీలందరి కంటే పుల్లన్న నమ్మకస్తుడు, ఎదురుమాట్లాడని అమాయకుడు అనుకుంటాడు రామిరెడ్డి. పుల్లన్న తర్వాత పుల్లన్న కొడుకు ఓబులేసును తన బానిస చేసుకోవాలనుకుంటాడు. కూతురు, కొడుక్కి పెండ్లి చెయ్యాలని పుల్లన్న తనకు రావాల్సిన డబ్బును అడుగుతాడు. "నాదగ్గర నీ బాబతు లెఖ్ఖేమీ లేదుకదరా. నువ్వు యింకా వెయ్యిపైన ఇవ్వాల్సి ఉంటుంది, యేదో నన్ను నమ్ముకొని వున్నందుకు దాని సంగతి యెత్తడం లేదు. యింకెక్కడినుంచీ తెచ్చేదీ? వూర్లో చిన్న చిన్న రైతులంతా నన్నే చంపుతారు డబ్బు డబ్బూ అని. మీదే సుఖంరా. మిమ్మల్ని అడిగేవాడుండడు" అంటాడు. ఓబులేసుకు కాబోయే భార్య ఎర్రసుబ్బులు కొంత చదువుకుని, పట్నం నుండి వచ్చిన పిల్ల కావడంతో పుల్లయ్యకు రావాల్సిన డబ్బులు లెక్కపెట్టి పుల్లయ్యను తనకు రావాల్సిన డబ్బును అడగమని, కూలికి పనిచేసే అందరినీ కూలీ పెంచమని అడగమని తిరుగుబాటుకు ప్రేరేపిస్తుంది. కూలీలందరి వెనుక ఎర్ర సుబ్బులు నాయకత్వం ఉందని తెలుసుకున్న రామిరెడ్డి "నువ్వు చెడింది చాలక వూరందరినీ చెడగొడుతున్నావు. శని లంజముండా...మొన్న తిరుపతిగాన్ని తగులుకున్నావు. యిప్పుడు ఓబులుగాన్ని తగులుకున్నావు. నీతీ, జాతీ లేకుండా బతికేదానికి నీ కెందుకే యీ గొడవలన్నీ..." అంటాడు. దాంతో సుబ్బులు కోపంతో ఊగిపోతూ "నేను సెడినదాన్నే అనుకో, నన్ను చూసి రెడ్డెమ్మను సెడిపోమను. వూర్లో రైతమ్మగార్లందరినీ సెడిపోమను. వీళ్ళందర్నీ సెడిపోమను. నేను సెడిపోతే నాకే నష్టం. ఎవ్వరికీ యేమీకాదు. నువ్వు మరి సానా మంచోడివి.

**కేతు విశ్వనాథరెడ్డి కథకునిగానే కాకుండా పరిశోధకుడిగా, విమర్శకుడిగాను ప్రసిద్ధి గాంచారు. "కడప ఊళ్ళ పేర్లు" ఈయన పరిశోధన గ్రంథం అయితే, సాహిత్యానికి సంబంధించిన అనేక విషయాలను చర్చిస్తూ "దృష్టి" అనే పేరుతో 1998లో వ్యాస సంపుటిని వెలువరించారు. ఈయన సాహిత్యానికి చేసిన కృషికి భారతీయ భాషా పరిషత్తు పురస్కారం, రావిశాస్త్రి పురస్కారం, రితంబరీ పురస్కారం, పులుపుల వెంకట శివయ్య సత్కారం, తుమ్మల వెంకట రామయ్య బంగారు పతకం, అజో అండ్ విభో పురస్కారం, గోపీచంద్ సాహిత్య సత్కారం ఇలా ఎన్నో పురస్కారాలు వరించాయి.**

పరాయి ఆడదాన్ని కన్నెత్తి సూడవు. సారాయి తాగావు. బీడీలు తాగావు. కానీ అందరినీ ముంచుతావు, మంచి మాటల్తో, దొంగ లెక్కల్తో. నిన్ను సూసి రైతులంతా నీ మాదిరి తయారయినారు. మాకు పుట్టగతులు లేకుండా సేస్తున్నారు. మూడేండ్లు మా పుల్లన్న మామతో గొడ్డు సాకిరి సేయించుకున్నావు. పిల్ల పెండ్లికి ఉంటుంది లెమ్మని యిన్నాళ్ళూ నిన్నడగలేదు. వొక్క వొడ్లగింజ యింటికివ్వకుండా, పావలా రూపాయి సేతిలో పెట్టి పదైదు నూర్లు బాకీ తేల్చినావు... అదేమంటే అడిగేవాండ్లు లేరు. పదేండ్లనుంచీ కూలీ వొక్క పావలా అన్నా పెంచి యిచ్చినావా? మీ ఆదాయం యేమన్నా తగ్గిందా, పెంచకపోవడానికి?... అని కుండబద్దలుకొడుతుంది. దాంతో రామిరెడ్డి చీకటి నాడుల్లో రక్తపు పోటు పెరుగుతుంది. ఎర్రసుబ్బులు వెంట వచ్చిన కూలీల చీకటి నాడుల్లో నెత్తురు వెలుగుతుంది. మొత్తం మీద చిన్న విప్లవంలా కనిపించినా పెద్ద మార్పు ఈ కథలో కనిపిస్తుంది. రాయలసీమ ప్రాంతంలో కొంతమంది మగవాళ్ళు తిండిలేక సంపాదన కోసం పొట్ట చేత్తో పట్టుకుని పట్టణాలకు వలసపోయి ఫ్యాక్టరీలు వంటి వాటిలో పనిచేసుకునే వారు ఒక రకంవారు అయితే జమిందారీ కుటుంబాలలో జన్మించి కాలానికి అనుగుణంగా మారకుండా ఎన్ని కష్టాలు వచ్చినా జమిందారీ తరహాలోనే తమ జీవనాన్ని గడిపేవారు రెండో రకంవారు. ఇలాంటి వారి వల్ల స్త్రీలే ఒంటెద్దు బండిలా కుటుంబాన్ని లాక్కోస్తున్న వైనం కేతు విశ్వనాథ రెడ్డి కథలలో కనిపిస్తుంది.

స్త్రీలు, పురుషులు అనే భేదం లేకుండా శ్రమను నమ్ముకున్న వారిని గౌరవింపజేయడం కేతు విశ్వనాథరెడ్డి రచనాశయం. కాలానికనుగుణంగా శ్రమను వెచ్చించాలని "తేడా" కథలో దివాకర్ పాత్ర ద్వారా రచయిత తెలియజేశాడు. స్త్రీలు ఎటువంటి కష్టాలనైనా, పరిస్థితులనైనా ఇంటా బయట ధైర్యంగా, చైతన్యవంతంగా ఎదుర్కొంటున్న వైనాన్ని ఈ కథలో ఆవిష్కరించారు. రోజుల్లో ప్రభుత్వం ఎప్పుడో ఒకసారి స్పందించి పశువులకు గడ్డిని సరఫరా చేస్తే ఆ గడ్డిని పేదవారి వరకు రానివ్వకుండా అధికారులు అన్యాయంగా మాయం చేయడాన్ని "గడ్డి" కథను చదివితే తెలుస్తుంది. ఈ కథలో అచ్చమ్మ పాత్ర ద్వారా కన్న బిడ్డల్లా చూసుకుంటున్న పశువులకు గడ్డి దొరకకపోవడంతో ఆమె పడే బాధను, ఆక్రోశాన్ని, ఆవేశాన్ని రచయిత ఆవిష్కరించారు. ఈ కథలో అచ్చమ్మ అధికారులను ప్రశ్నించి నిలదిసే ధైర్య సాహసాలు గల పాత్రగా కేతు విశ్వనాథ రెడ్డి చిత్రీకరించారు.

రాయల సీమ అంటే కరువు, దానివల్ల ప్రజలు పడే కష్టాలు, కరువు, ఆకలి వంటి దుస్థితులు తారసపడుతాయి. వీటన్నింటినీ ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి తన కథలలో చెప్పడం ఒక ఎత్తయితే, ఆ పరిస్థితులను చైతన్యవంతంగా ఎదుర్కొంటున్న స్త్రీల పరిస్థితులను చిత్రీకరించడం ఒక ఎత్తు. కేతు విశ్వనాథ రెడ్డి రచినచిన కథలలో 'రెక్కలు' కథలో పంకజం, 'చీకటి నాడీ – వెలుగు నెత్తురు' కథలో పంకజం, 'గడ్డి' కథలో అచ్చమ్మ పాత్ర మొదలనవి స్త్రీ చైతన్యానికి ప్రతీకలు.

(నేడు కేతు విశ్వనాథ రెడ్డి జయంతి)

– గొల్లపల్లి వనజ, పరిశోధక విద్యార్థి
హైదరాబాదు విశ్వవిద్యాలయం

**ప్రజల ప్రయోజనాలు నెరవేరాలంటే అప్పుడు వారు ఉన్న ప్రభుత్వ వ్యవస్థ సక్రమంగా పని చెయ్యాలి. అలా లేనినాడు లోపభూయిష్టమైన వ్యవస్థలో అవస్థలు తప్పవు. సామాన్యుల పరిస్థితే ఇలా ఉన్నప్పుడు అట్టడుగు ప్రజానీకం గురించి పట్టించుకునే నాథుడే కరువౌతాడు. అలాగని వ్యవస్థ నిద్రాణంగా ఉండిపోదు ప్రగతివాద శక్తులు ఆ బాధ్యత భుజాన వేసుకొని సమ్మెలు, ఘెరావ్‌లు, బందులు మొదలైన ఆందోళనలు చేస్తూ కర్షక, కార్మిక జనానీకానికి బాసటగా నిలుస్తారు. వారికి ఊరట కల్పిస్తూనే వారిలో చైతన్యాన్ని ప్రోదిచేస్తారు. మేధావి వర్గమైన కవులు, రచయితలు వారి వారి కళారూపాల ద్వారా వారికి వెన్నుదన్నుగా నిలుస్తారు. అలా నిలబడి వారిని చైతన్యవంతుని చేసే క్రమంలోనిదే అభ్యుదయ కవి సీరపాణి రచించిన 'అగ్నిగీతం' గేయం. ఇది ఆయన రచించిన 'ఢమరుధ్వని' కవితా సంపుటి లోనిది.**

# విప్లవ శంఖారావం సీరపాణి 'అగ్నిగీతం'

**'అగ్ని కేకేసింది అందరూ కదలండి!**
**తాడితులు పీడితులు మునుముందు నడవండి'**

ఇక్కడ అగ్ని అంటే చైతన్యం. ఆకలి, దారిద్ర్యం, అసమానత, అన్యాయం మొదలైన వాటితో సతమతమవుతున్న బడుగు వర్గాల ప్రజల వెనుక నిలబడి వారిని పోరాటానికి సంసిద్ధుల్ని చేసే ప్రయత్నంలో చేసే ప్రబోధమే ఇది.



**'పిరికివాడని ఎంచి, పిడుగు పడకుండునా?**
**ముఱికి బ్రతుకని తలచి, మృత్యువు తొలంగునా?**
**ఎన్నాళ్ళు బ్రతికినా ఏముంది జగతిలో?**
**కన్నీళ్లె మిగిలేను మన్నీల కొలువులో'**

పోరాటాల వల్ల ఎదురయ్యే దుష్ఫలితాలకు జడిసి వెనుదీయరాదని పై చరణాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రాణం మీది తీపితో దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తూ, నికృష్టంగా జీవించినా ఏదో ఒక రూపంలో మృత్యువు తప్పదు. భూస్వాములు, ధనస్వాములు, పెత్తందారులు, పెట్టుబడిదారుల దోపిడీ రాజ్యములో ఎంతకాలం జీవించినా కష్టాలు తప్ప సుఖము లేదు.

**సమాజంలో కొంతమంది భోగభాగ్యాలతో తులతూగుతూ ఉంటే, మరికొందరు రోగాల పాలై కునారిల్లుతున్నారు. ఈ సమాజ మనుగడ కోసం ఎండ వానలకోర్చి పంటలు పండించే కర్షకులు, యంత్రాల మధ్య నరాలు తెగేలా పని చేస్తున్న కార్మికుల చెమటలు వాగులై ప్రవహిస్తున్నాయి. మన పూర్వీకులు స్వాతంత్ర్య సమరంలో ధన, మాన, ప్రాణాల త్యాగాలతో సాధించి పెట్టిన శాంతి సౌభాగ్యాలకు భారతీయులందరూ హక్కుదారులే!**

**'ప్రకృతి మనకిచ్చేటి బంగారు సిరులన్ని**
**ఏ ఇనుప పెట్టెలో ఇరుకుకున్నాయి?**
**ఎవరి సొంతం గాలి? ఎవరి సొంతం నేల?**
**ఏ బాబు కట్టించె నీ భువనశాల?'**

తిరుగుబాటు ఎందుకు అనివార్యమో? పై చరణాల ద్వారా తెలియజేస్తున్నాడు కవి. ప్రకృతి ప్రసాదించిన వస్తుజాలమంతా ఏ కొంతమందికో హక్కుభుక్తాలౌతున్నాయి. ఇవి సమాజంలోని అందరికీ చెందవలసినవి. ఎందుకో కారణం చెబుతున్నాడు కవి. ప్రకృతిలోని గాలి, నీరు ఎలా అందరికీ అనుభవయోగ్యాలో ప్రకృతి వనరులు కూడా అందరికీ చెందవలసినవే అని విడమర్చి చెబుతున్నాడు.

**'రోగాలు కొందరివి, భోగాలు కొందరివి**
**వాగులై పారేటి ఈ చెమటలెందరివి?**
**యాగాల సంతలో, త్యాగాలతో కొన్న**
**శాంతి సౌభాగ్యాలు అందరివి!**
**అందరివి'**

సమాజంలో కొంతమంది భోగభాగ్యాలతో తులతూ గుతూ ఉంటే, మరికొందరు రోగాల పాలై కునారిలుతున్నారు. ఈ సమాజ మనుగడ కోసం ఎండ వానలకోర్చి పంటలు పండించే కర్షకులు, యంత్రాల మధ్య నరాలు తెగేలా పని చేస్తున్న కార్మికుల చెమటలు వాగులై ప్రవహిస్తు న్నాయి. మన పూర్వీకులు స్వాతంత్ర్య సమరంలో ధన, మాన, ప్రాణాల త్యాగాలతో సాధించి పెట్టిన శాంతి సౌభాగ్యాలకు భారతీయులందరూ హక్కుదారులే! అని ఎలుగెత్తి చాటుతున్నాడు కవి.


**'లెండహో ఈ ధాత్రి నిండి గర్జించండి!**
**దండెత్తి, స్వార్థభూతాల ఖండించండి!**
**బ్రతుకు సమిధలు పేర్చి చితులు మండించండి!**
**చితులలో, స్వర్గాల ద్యుతులు పండించండి'**

తాడితులూ, పీడితులూ అందరూ ఒక్కటై ఉద్యమించి సింహగర్జన చెయ్యండని అంటున్నాడు కవి. ఇంకా స్వార్థపరుల్ని మట్టు బెట్టమంటున్నాడు. ఈ ధాత్రి అనడంలో ప్రపంచంలో ఎక్కడెక్కడ అసమానత, పీడన, అణచివేతల ధోరణులు ఉన్నాయో అక్కడక్కడ అని భావం. తమ బ్రతుకుల్ని సమిధలుగా చేసి మండించి, భావితరాలకు స్వేచ్ఛ సమానత్వాలను సాధించి పెట్టమంటున్నాడు కవి.

**'పక్కదారులు వెతికి, బానిసలుగా బ్రతికి**
**మనకెందుకనుకొని మసలిపోయారంటె**
**ముందు తరములు కూడా మోసపోతాయి!**
**అన్నమో రామ! అని అలమటిస్తాయి'**

**'అగ్ని కేకేసింది అందరూ కదలండి!**
**తాడితులు పీడితులు మునుముందు నడవండి'**

ఇక్కడ కవి మరో హెచ్చరిక చేస్తున్నాడు. సాధారణంగా లోకంలో అనేకానేక అన్యాయాలూ, అక్రమాలూ కళ్ల ఎదుట జరిగినా చాలామంది తూష్ణీ భావం వహించి, మనకెందుకు అనుకొని పట్టించుకోకుండా కాలం గడుపుతూ ఉంటారు. కవి అటువంటి వారి అలసత్వాన్ని తీవ్రంగా గర్హిస్తున్నాడు. అలాంటి వారి బతుకులు బానిస బతుకులు సుమా! అని గుర్తు చేస్తు న్నాడు. లోకంలో ఒక్కోసారి విజ్ఞులు, మేధావులు సైతం మౌనం వహిస్తారు. దాని పర్యవసానం ఎంత భయంకరంగా ఉంటుం దంటే, రాబోయే తరాలు కూడా విరివిగా మోసపోతాయి. అంతే కాదు దుర్భర దారిద్ర్యంతో అన్నమో రామచంద్రా! అంటూ అలమటించిపోతాయి అని ఇక్కడ కవి తీవ్రంగా హెచ్చరిస్తున్నాడు. అందుకే ప్రగతిశీల శక్తులు అందరూ చైతన్య వంతమైన పిలు పునందుకుని ప్రతిఘటించమని కవి సందేశమిస్తున్నాడు.



ప్రఖ్యాత కథా రచయిత కీ:శే కె.ఎన్.వై పతంజలి కథా రచన ప్రారంభ దశలో 'సీరపాణి' ఈ అగ్నిగీతాన్ని గొంతెత్తి ఆలపించి ఎంతో ఉత్తేజాన్ని పొందేవారట. ఈ గేయం 1972లో రచించబడింది. 1974లో 'కొత్త గొంతులు' అనే కవితా సంకలనంలో ప్రచురితమైంది కూడా.

– పిల్లా తిరుపతిరావు, 7095184846

## ఎందుకో వాళ్ళు అలా.....



ఏ తల్లి కన్నీటి ప్రతిరూపాలో
ఏ నాన్న ఒడిలో మెసిలిన కుందేలు పిల్లలో
మిత్రుల మధ్య పేరుతో ప్రతిధ్వనించాల్సిన వాళ్ళు
ఇప్పుడు ఇలా ఫుట్ పాత్ మీద
అనామధేయులుగా

రోజొక మేఘంలా కనబడతారు
ఖాళీ కడుపుతో,
నూనె ఇంకిపోయిన చెమ్మెలాంటి కళ్ళతో,
ముత్తైమంత ఎదురుచూపు
అయిదు రూపాయల బువ్వ కోసం
చాచిన ఖాళీ చేతులతో

నిజానికి ఎన్ని పుట్ల ధాన్యాన్ని చాటలతో
తూర్పారబట్టిన చేతులో అవి
ఎడ్లబండి మీద కూర్చొని మీసం మెలేసిన
వడ్లసంపద సృష్టికర్తలో


బలామూ లేదు, బలగమూ లేదు
అన్నం పెట్టే అమ్మలూ లేరు, అన్నలూ రారు
ఇల్లులేదు, ఇల్లాలు లేదు
నవ్వుతరు, నటిస్తరు
పెదవులమీది నిశ్శబ్దపు బాధ చెప్పడానికి
ఒక భాష లేనివాళ్ళు
గూడులేని గువ్వపిట్టలు
క్యాల్ తప్పిన లోకానికి రాజులు

దినం కాలం చిటికెన వేలు పట్టుకొని నడిస్తే
వీళ్ళు సమయాన్ని
లోలకమై తిరిగే మనుషులను చూస్తూ ఖర్చు చేస్తారు

మందుల చిట్టీలు లేవు
షుగర్లు, బీపీలు తెలియవు
బతుకులు రంగులమయమైనా
వీళ్ళు మాత్రం ఆల్చిప్పలో ఎదుగుదల ఆగిపోయిన
ముత్యం లాంటి వర్ణులు

– వేముగంటి మురళి, 9676598465

## నైట్ వాచ్‌మాన్ ...



జీవితం రాత్రికే తెల్లవారుతుంది
రెప్పలను తెరిచి ఉంచాల్సిందే
కునుకు సైతం కోసు కోసు దూరం
ఆకలిగానో అరగకనో కడుపులో వాయు గుండం !
నిద్రను దూరం కొట్టడానికి ఫ్లాస్క్‌లో ఛాయ్
విడతలు విడతలుగా ఉదయానికల్లా ఇంకిపోతుంది
కన్నుల్లో ఎరుపు జాగరణ ముద్ర!

చలి స్వెట్టర్ వేసుకొమ్మంటుంది తల్లిలా !
మంకీ క్యాప్ కిరీటమౌతుంది
ఒంటరిగానే పున్నమ రాత్రులు!
చంద్రుడిలో చంద్రముఖి కనిపిస్తుంది వాచ్ మెన్ కు !
రాత్ కీ రాజా నైట్ వాచ్ మాన్ !

నైట్ వాచ్‌మాన్‌ను సొంత పేరుతో ఎవరూ పిలువరు
"నైట్ వాచ్ మాన్"గా ఒకే పేరు ఫిక్స్
నైట్ వాచ్‌మాన్‌తో రాత్రంతా తోడుగా
గట్టిగా అరిచి మాట్లాడేది విజిల్ మాత్రమే!

తెల్లవారితేనే రాత్రి అయినట్లు
గాఢనిద్ర వాచ్ మాన్ కు !
అంతే ! పొట్టకూటి కోసం "రాత్రి కావలి విద్య " !

– కందాళై రాఘవాచార్య, 8790593638

# కుల దురహంకార హత్యలపై పాలకుల మౌనం

- ప్రత్యేక చట్టం తేవాలి : రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కుల మత దురహంకార హత్యలపై పాలకులు మౌనం వీడాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. దురహంకార హత్యల నిరోధానికి ప్రత్యేక చట్టం తేవాలని సర్కార్‌కు విజ్ఞప్తి చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీపీఎస్‌కే, కేవీపీఎస్ సంయుక్తంగా కుల దురహంకార హత్యలపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ ఎవరికి వారుగా కాకుండా ఐక్యంగా 'కుల, మతాంతర వివాహాల రక్షణ వేదిక' గా ఏర్పడాలని సూచించారు. ఈ వేదిక బాధితులకు అండగా ఉండాలని సూచించారు. మీడియాలో పరువు హత్యల పేరు పెట్టి ప్రచారం చేయటం తగదని గుర్తుచేశారు. కులోన్మాద, పురుషాహంకార, హత్యలుగా చూడాలని విజ్ఞప్తి చేశారు టీపీఎస్‌కే రాష్ట్ర నాయకులు జి.రాములు మాట్లాడుతూ కుల,మత ధర్మాల పేరుతో, సనాతన సంప్రదాయం పేరుతో బీజేపీ ప్రభుత్వం ఇలాంటి సంఘటనలను ప్రోత్సాహిస్తున్నదని తెలిపారు. దేశంలో కులం కొందరికి వసరమైతే ..ఎందరికో శాపంగా మారిందని వివరించారు. కుల రహిత సమాజం కోసం సాంస్కృతిక విప్లవమే తీసుకురావాలని సూచించారు. కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు మాట్లాడుతూ.. కులం మతం పేరుతో ప్రేమించి పెళ్లి చేసుకున్న జంటలను హత్యలుగావిస్తున్నా. మానవ హక్కుల కమిషన్, మహిళా కమిషన్ స్పందించకపోవడం బాధాకరమని తెలిపారు. ఎస్‌వీకే కార్యదర్శి ఎస్. వినయ కుమార్ మాట్లాడుతూ..కుల మత వివాహాలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం అండగా ఉంటుందని తెలిపారు. కుల రహిత, మత రహిత సమాజం కోసం భూస్వామ్య భావజాలంపై సాంస్కృతిక యుద్ధం చేయాలని పిలుపునిచ్చారు. కుల నిర్మూలన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వహీద్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి ఇన్నేండ్లయినా 30 కోట్ల మంది అంటరానితనంతో, వివక్షను ఎదుర్కొంటున్నారని తెలిపారు.రాష్ట్రంలో కూడా కుల దురహంకార హత్యలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. టీపీఎస్‌కే రాష్ట్ర నాయకులు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థత వల్లనే కుల దురహంకార హత్యలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ హత్యలకు ప్రభుత్వాలే బాధ్యత వహించాలన్నారు. కుల నిర్మూలనా సంఘం గౌరవాధ్యక్షురాలు గట్టు జ్యోత్స్న, ఎస్‌వీకే బాధ్యులు జి బుచ్చిరెడ్డి, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నరేష్, సీనియర్ నాయకులు పీఎస్ఎన్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు. 'కుల,మతాంతర వివాహాల రక్షణ వేదిక (జేఏసీ) ఏర్పాటు చేసి,ఈ ఐక్య కార్యాచరణకు జస్టిస్ చంద్రకుమార్ అధ్యక్షతన కుల నిర్మూలన పోరాటాలకు పిలుపు నివ్వాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది.

# కేసీఆర్ అవినీతిపై చర్యలెందుకు తీసుకోరు?

- సర్కారుకు వైఎస్ షర్మిల ప్రశ్న

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఢిల్లీ దాకా కేసీఆర్ అవినీతి పాకిందని బీజేపీ చెబుతున్నదనీ, కేంద్రంలో అధికారంలో ఉండి ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. నువ్వు కొట్టినట్లు చెయ్యి, నేను ఏడ్చినట్టు నటిస్తానంటూ జరిగిన ఒప్పందంలో భాగమే ఇరు పార్టీలు విమర్శించుకుంటున్నాయని పేర్కొన్నారు. నిజంగా వీరి మధ్య ఎలాంటి రాజకీయ ఒప్పందం లేకపోతే..కేసీఆర్ ప్రభుత్వ అవినీతిపై దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. మాయల పకీరు ప్రాణాలు చిలకలో ఉన్నట్టుగా కేసీఆర్ అవినీతి చిట్టా బీజేపీ దగ్గర ఉందని తెలిపారు. కాళేశ్వరం అవినీతిపై సాక్ష్యాధారాలున్నప్పటికీ చర్యలు ఎందుకు తీసుకోవటం లేదని ప్రశ్నించారు. విభజన హామీలపై అమీతుమీకి ఎందుకు సిద్ధపడటంలేదో తేల్చాలని బీఆర్ఎస్ సర్కార్‌ను ఆమె ప్రశ్నించారు. లిక్కర్ స్కాం నుంచి ఇరు ప్రభుత్వాల మధ్య పలు అంశాలపై ఒప్పందాలు కుదిరాయని ఆరోపించారు.

# బీసీ గురుకుల వ్యవసాయ మహిళా డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం..

- 31లోగా ఆన్ లైన్‌లో దరఖాస్తులు :

కార్యదర్శి డాక్టర్ మల్లయ్య భట్టు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహాత్మా జ్యోతిబాఫూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ వ్యవసాయ మహిళా డిగ్రీ కళాశాలలలో బీఎస్‌సీ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం ఈ నెల 31లోగా ఆన్ లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని మహాత్మా జ్యోతిబాఫూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి మల్లయ్యభట్టు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో ఎంసెట్- 2023 ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థినులు https://mjptbcwreis.telangana.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంసెట్-2023 ప్రవేశ పరీక్షలో సాధించిన ర్యాంకు, రిజర్వేషన్ ప్రాతిపదికన విద్యార్థులను ఎంపిక చేస్తామని ఆయన తెలిపారు. సీటు సాధించిన విద్యార్థినీలు కాలేజి హాస్టల్‌లోనే ఉండాలనీ, డే-స్కాలర్స్ విధానం ఉండదని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.1,50,000,పట్టణ ప్రాంతాల్లో నివసించే వారి వార్షిక ఆదాయం రూ.2,00,000 మించని విద్యార్థినీలు మాత్రమే అర్హులని తెలిపారు .దరఖాస్తు చేయడంలో ఏమైనా సందేహాలు ఉంటే కార్యాలయ పనివేళల్లో 040-23328266 ఫోన్ నెంబర్లో సంప్రదించవచ్చని ఆయన సూచించారు.

# శ్వేతపత్రం విడుదల చేస్తాం... మీకు ఆ దమ్ముందా?

- బీజేపీకి పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రశ్న



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేస్తామనీ, ఆ పని చేసే దమ్ము కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికుందా? అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ ప్రధాని పర్యటనపై ఎన్నో ఆశలు పెట్టుకున్నామని తెలిపారు. " విభజన హామీలు తీరుస్తారని భావించాం. ప్రధాని రాజకీయ నేతగానే వ్యవహరించా రు.తెలంగాణకు ఒక్క హామీ ఇవ్వలేక పోయారు. ములుగు గిరిజన యూనివర్సిటీ గురించి ఒక్క మాట చెప్పలేదు. బయ్యారం, ఏపీ స్టీల్ ఫ్యాక్టరీని ఆదానికి అప్పగించే యత్నాల్లో పర్యటించారనే అనుమానం. ప్రధానమంత్రి ఎక్కువగా చదువుకోక పోవడంతో బీజేపీ నేతల స్క్రిప్ట్ చదివారు. మోడీ తెలంగాణ లో అవినీతి గురించి మాట్లాడే ముందు వ్యాపం స్కామ్‌పై స్పందించాలి. మద్యం కుంభకోణంలో ఒక్క రూపాయిని కూడా కేంద్ర సంస్థలు స్వాధీనం చేసుకోలేదు. బీజేపీకి ఒక్క స్థానం కూడా రాష్ట్రంలో నిలబెట్టుకునే స్థితి లేదు. అదాని,అంబానీల కోసమే ప్రధాని పనిచేస్తున్నారు. ప్రభుత్వ రంగంలో మేము ఇచ్చిన ఉద్యోగాలు దేశంలో ఎవరు ఇవ్వలేదు.బీజేపీ నేతల కుట్రలతో టీఎస్పీఎస్సీలో పేపర్ లీక్ అయింది.... " అని విమర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ మాట్లాడుతూ ప్రధాని దిగిన మమునూరుకు ఎయిర్ పోర్టు డిమాండ్ ఉంది ప్రధాని ఆ ఊసే ఎత్తలేదని విమర్శించారు. భద్రకాళి దేవాలయ అభివృద్ధికి నిధులివ్వలేదని తెలిపారు.

# పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం

- మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి
- తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్-475 ఏర్పాటు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పోరాటాల ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయని, అందుకు కాంట్రాక్టు లెక్చరర్ల 22 ఏండ్ల నుంచి చేసిన పోరాటమే నిదర్శనమని మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర 475 అసోసియేషన్ రాష్ట్ర విస్తతస్థాయి సమావేశం టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో వర్కింగ్ ప్రెసిడెంట్ జి.శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22ఏండ్ల పోరాట ఫలితంగా కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లను క్రమబద్ధీకరించడం విప్లవాత్మకమైన మార్పు అని అన్నారు. తక్కువ వేతనంతో ఉద్యోగంలో చేరారని, చాలా మంది తక్కుత జీతానికి పనిచేయలేక వెళ్లిపోయారని గుర్తుచేశారు. కాంట్రాక్టు లెక్చరర్లు జీతభత్యాలతో సంబంధంలేకుండా పేద విద్యార్థులకు విద్యనందించడమే లక్ష్యంగా పనిచేశారని తెలిపారు. రెగ్యులరైజేషన్ గురించి పలుమార్లు సీఎం కేసీఆర్, విద్యాశాఖ మంత్రితో చర్చించామని తెలిపారు. సమస్యలతోపాటు విద్యాపరిరక్షణకు లెక్చరర్లందరూ కృషి చేయాలని అన్నారు. తెలంగాణ విద్యా పరిరక్షణ సమితి కన్వీనర్ అందె సత్యం మాట్లాడుతూ జూనియర్ కాలేజీలను బలోపేతం చేసేందుకు లెక్చరర్లు కృషిచేయాలని అన్నారు. కార్పొరేట్ కాలేజీలకు ధీటుగా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. ప్రతి ఒక్కరూ నిజాయతీ, నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేయాలని, సంఘం పేరు చెప్పుకుని కాలేజీలకు ఆలస్యం రాకూడదని పిలుపునిచ్చారు. సమస్యల పరిష్కారానికే కాకుండా చదువు బాగా చెప్పడానికీ ఓ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మిగిలిన కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణకు కలిసిరావాలని కోరారు. తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగులు, లెక్చరర్లను క్రమబద్ధీకరించడం చారిత్రక నిర్ణయమని అన్నారు. ఈ నిర్ణయంతో సీఎం కేసీఆర్ దేశంలోనే ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారని తెలిపారు.2000 నుంచి ప్రభుత్వ కళాశాలల్లో కాంట్రాక్టు లెక్చరర్లుగా పనిచేస్తూ కాలేజీల అభివృద్ధి ఎంతో కృషిచేశామని చెప్పారు.

**టీజీజేఎల్ఏ ఏర్పాటు**

ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వ ఉన్నత విద్య పరిరక్షణకు , కాంట్రాక్టు లెక్చరర్ల హక్కుల కోసం పనిచేసిన కాంట్రాక్టు అధ్యాపకుల 475 సంఘాన్ని 'తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్-475' మారుస్తూ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో ఏక గ్రీవంగా తీర్మానం చేసినట్టు ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ తెలిపారు. 'ప్రభుత్వ ఉన్నత విద్యను పరిరక్షణకు కృషిచేయాలి. క్రమబద్ధీకరణ కానీ కాంట్రాక్టు లెక్చరర్లను వెంటనే క్రమబద్ధీకరించాలి. నూతన అధ్యాపకులకు సంబంధించి సర్వీసు ప్రొటక్షన్ కల్పించాలి. అన్ని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీల విద్యార్థుల హస్టల్ వసతి కల్పించాలి. ప్రభుత్వ జూనియర్ కాలేజీల నిర్వహణకు నిధులు కేటాయించాలి.

# విద్యారంగ సమస్యల పరిష్కారానికి 12న పాఠశాలలు,ఇంటర్ కళాశాలల బంద్

- లెఫ్ట్ స్టూడెంట్స్ యూనియన్స్ పిలుపు
- బంద్ పోస్టర్ ఆవిష్కరణ.



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఈ నెల 12న రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు, ఇంటర్ కళాశాలల బంద్ నిర్వహిస్తున్నట్టు, ఈ బంద్‌లో విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బంద్ పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్ఎల్.మూర్తి, టి.నాగరాజు(ఎస్ఎఫ్ఐ), పుట్టాలక్ష్మణ్, మణికంఠరెడ్డి(ఏఐఎస్ఎఫ్), పరుశరాం (పీడీఎస్‌యూ), మహేష్(పీడీఎస్‌యూ), రామకృష్ణ(పీడీఎస్‌యూ), గవ్వవంశీధర్ రెడ్డి(ఏఐఎస్‌బీ), విజయ్(పీడీఎస్‌యూ విజంభణ) మాట్లడారు. రాష్ట్రంలో కార్పొరేట్, ప్రయివేట్ ఫీజులు దందా కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వం వాటి నియంత్రణ కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. మంత్రులు ఉపసంఘం, తిరుపతిరావు కమిటీ రిపోర్ట్ బహిర్గతం చేయకపోవడం చూస్తే ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవరిస్తున్నట్టుగా ఉందన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా యూనిఫామ్స్ ఇవ్వలేదని, కొన్ని టైటిల్స్ పాఠ్యపుస్తకాలు పంపలేదని, చదువులు చెప్పే టీచర్లు లేరని, పారిశుద్ధ్య కార్మికులు లేరని, అనేక సమస్యలతో విద్యాసంవత్సరం ప్రారంభమైన నిర్దిష్టమైన చర్యలు ప్రభుత్వం తీసుకోవడం లేదన్నారు. తాగునీరు, మధ్యాహ్న భోజనం బిల్లుల పెండింగ్, మూత్రశాలలు, సరైన మౌళిక సదుపాయాలు లేక ప్రభుత్వ విద్యారంగం గొల్లుమంటుందన్నారు. మనఊరు-మనబస్తీ-మనబడి నిధులతో గుత్తేదారులు తూతూమంత్రంగా మాత్రమే పనులు చేశారని విమర్శించారు. ఎక్కడా సరిగ్గా పాఠశాలలకు ఉపయోగ పడలేదన్నారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం హామీ అందని ద్రాక్షగా మారిందని తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇంకా అందివ్వలేదని చెప్పారు. లెక్చరర్స్ లేరని, ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో నాలుగేండ్ల నుంచి ఫీజు రీయింబర్స్ మెంట్స్, స్కాలర్‌షిప్స్ రూ.5,177 కోట్లు పెండింగులో ఉన్నాయని, వాటిని కనీసం విడుదల చేయడం లేదని చెప్పారు. గురుకులాలు, కేజీబీవీలు, ఇంటర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేసినవాటికి భవనాలు లేక అరకొర సౌకర్యాలతో అద్దె భవనాల్లో నడుస్తున్నాయని వివరించారు. వాటికి నిధులు లేవని, లెక్చరర్స్, టీచర్స్ లేరని అన్నారు. నాణ్యమైన భోజనం లేక ఫుడ్ పాయిజన్ సంఘటనలు జరుగుతున్నా పట్టించుకోవడంలేదన్నారు. రాష్ట్రంలో భారీ సంఖ్యలో టీచర్, లెక్చరర్స్ పోస్టులు ఖాళీలు ఉన్నాయని, వాటిని భర్తీ చేయడం లేదన్నారు. ఒక్క డిఎస్సీ ఇప్పటివరకు వేయలేదని తెలిపారు. అందుకే ఈ సమస్యలను పరిష్కారం చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులను కదిలించి బంద్ నిర్వహిస్తున్నామని ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కారం చేయాలని అన్నారు. అన్ని జిల్లాలో బంద్ విజయవంతం చేయాలని విద్యార్థి లోకానికి వామపక్ష విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి, ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అశోక్‌రెడ్డి, సంతోష్, లెనిన్, స్టాలిన్(ఎస్ఎఫ్ఐ) క్రాంతి, నరేష్(ఏఐఎస్ఎఫ్), రియాజ్(పీడీఎస్‌యూ), సుమంత్(పీడీఎస్‌యూ) తదితరులు పాల్గొన్నారు.

# బీఎస్ఎన్ఎల్ పరిపుష్టికి చర్యలు తీసుకోవాలి

- బీఎస్ఎన్ఎల్ క్యాజువల్, కాంట్రాక్టు వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి అనిమేశ్ మిత్రా




నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీఎస్ఎన్ఎల్ పరిపుష్టికి చర్యలు తీసుకోవాలనీ, 4జీ, 5జీ సేవలను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని బీఎస్ఎన్ఎల్ క్యాజువల్, కాంట్రాక్టు వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి అనిమేశ్ మిత్రా డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో బీఎస్ఎన్ఎల్ సౌత్‌జోన్ రాష్ట్రాల సమావేశం జరిగింది. దీనికి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అనిమేశ్ మిత్రా మాట్లాడారు. ఉద్యోగ భద్రత కల్పించాలనే ప్రధాన డిమాండ్ తో పాటు కనీసం వేతనం రూ.26వేలు చెల్లించాలని సమావేశంలో తీర్మానించామన్నారు. సర్వీస్ లెవెల్ అగ్రిమెంట్ కాంట్రాక్టు పద్ధతి రద్దు చేయాలనీ, ఔట్ సోర్సింగ్ వర్కర్లకు కనీసం వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని కోరారు. సంస్థలో ఇప్పటివరకూ అక్రమంగా 60 వేల మందిని తొలగించారనీ, వాటిని ఆపాలని డిమాండ్ చేశారు. సర్వీసులను ప్రయివేటీకరణ చేసిన తర్వాత ఔట్ సోర్సింగ్‌లో వర్కర్లను నియమించుకుని ఎక్కువ గంటలు పనిచేయించుకుంటూ తక్కువ వేతనాలిస్తున్న తీరును వివరించారు. మేనేజ్ మెంట్ కక్షపూరితంగా యూనియన్లలో కీలకంగా ఉన్న కార్మికులను వేధిస్తూ వేరే జిల్లాలకు బదిలీ చేయడం దారుణమన్నారు.

**తెలంగాణ బీఎస్ఎన్ఎల్ క్యాజువల్ కాంట్రాక్టు ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎం.తిరుమలాచార్యులు, బి.పరిపూర్ణాచారి**

బీఎస్ఎన్ఎల్ తెలంగాణ క్యాజువల్, కాంట్రాక్టు ఎంప్లాయీస్, లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎం.తిరుమలాచార్యులు, బి.పరిపూర్ణాచారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ యూనియన్ సమావేశం హైదరాబాద్‌లో బి.మధు అధ్యక్షతన జరిగింది. అందులో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా జి. సాంబశివరావు, ఉపాధ్యక్షులుగా తలసీరామ్, బి. నాయుడు, కార్యదర్శులుగా రాఘవేందర్, హరీశ్, కోశాధికారిగా బి.శ్రీధర్లు, నిర్వహణ కార్యదర్శులుగా నవీన్, నాగరాజు , నవీన్, జానీ , రాజా సతీష్, కమిటీ సభ్యులుగా 10 మంది ఎన్నికయ్యారు.

# సహకార బ్యాంకు రంగంలో టు-టైర్ విధానం మేలు

- సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తా
- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్ కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సహకార బ్యాంకు రంగంలో టు-టైర్ విధానం ఎంతో మేలు చేస్తుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్ కుమార్ అభిప్రాయపడ్డారు. ఆదివారం కోఠిలో జరిగిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉభయ తెలుగు రాష్ట్రాల బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య ప్రతినిధుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో త్రీ-టైర్ విధానం అమల్లో ఉందనీ, దీని వల్ల పరిపాలనా పరంగా కానీ, నిర్వహణ పరంగా గానీ అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం త్రీ-టైర్ విధానంలో భాగంగా గ్రామాల స్థాయిలో ప్యాక్స్ చైర్మెన్, జిల్లా స్థాయిలో డీసీసీబీ చైర్మెన్, రాష్ట్ర స్థాయిలో టెస్కాబ్ చైర్మెన్ వ్యవస్థ అమల్లో ఉందని తెలిపారు. టు-టైర్ విధానం అమల్లోకి వస్తే గ్రామాల స్థాయిలో ప్యాక్స్ చైర్మెన్, రాష్ట్ర స్థాయిలో టెస్కాబ్ చైర్మెన్ ఉంటారనీ, జిల్లా స్థాయిలో డైరెక్టర్ మాత్రమే రాష్ట్ర బ్యాంక్ ప్రతినిధిగా ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. టు-టైర్ విధానం అమలులోకి వస్తే తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన 33 జిల్లాలలో సహకార బ్యాంకు డైరెక్టర్లు ఎంపిక అవుతారని వివరించారు. అయితే రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ( ఆర్బీఐ ) ప్రతిపాదన మేరకు దేశంలో 12 రాష్ట్రాల్లో టు-టైర్ విధానం అమలు జరుగుతోందని చెప్పారు. బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షులు రవీంద్రనాథ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి రాంబాబు, కార్యదర్శులు కృష్ణారావు, ఉదయ్ కుమార్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

# రవాణారంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి : తెలంగాణ ఆటో, మోటార్ రవాణారంగ కార్మికుల జేఏసీ డిమాండ్




నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలోని రవాణారంగ కార్మికుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని తెలంగాణ ఆటో, మోటార్ రవాణారంగ కార్మికుల జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జేఏసీ నేతలు నారాయణగూడలోని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యాలయంలో సమావేశమై, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. బీఆర్‌టీయూ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వేముల మారయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీ వెంకటేశం, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ కిరణ్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మల్లేష్ గౌడ్, టీఏడీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ సత్తిరెడ్డి, స్కూల్ వ్యాన్ యూనియన్ అధ్యక్షుడు డీ శ్రీనివాస్ తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆటో, మోటార్ రవాణా కార్మికుల సమస్యలపై చర్చించి, పరిష్కారం కోసం ఉద్యమించాలని తీర్మానం చేశారు. తమ సమస్యలు పరిష్కరించిన రాజకీయ పార్టీలకే వచ్చే ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని నిర్ణయించారు. రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలనీ, ఆటో మీటర్ చార్జీలు పెంచి, అర్హులైన వారికి ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ పథకంలో ఇండ్లు కేటాయించాలనీ, ఇన్సూరెన్స్ ప్రీమియం తగ్గించాలనీ డిమాండ్ చేశారు. అన్ని జిల్లాల్లో జేఏసీ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించి కార్మికులకు జరుగుతున్న అన్యాయాలను వివరించాలని నిర్ణయించినట్టు నాయకులు తెలిపారు. హైదరాబాద్‌లో జేఏసీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని వివరించారు.

# ఉత్తరాదిలాగా ఎందుకు బలపడట్లేదు?

- 11 రాష్ట్రాల బీజేపీ అధ్యక్షులు, సంస్థాగత ప్రధాన కార్యదర్శుల సమావేశంలో చర్చ
- దక్షిణాదిలో పట్టు కోసం ప్రత్యేక ఎజెండా పోలింగ్ బూత్ వారీగా బలోపేతం కావాలని నడ్డా ఆదేశం




నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉత్తరాది రాష్ట్రాల్లోలాగా దక్షిణాదిలో ఎందుకు బలపడలేకపోతున్నాం? లోపం ఎక్కడ జరుగుతున్నది? ఎలా ముందుకెళ్ళాలి? రాజకీయ పట్టు కోసం ఏం చేయాలి? పోలింగ్ బూత్‌ల వారీగా ఎందుకు బలోపేతం కాలేకపోతున్నాం? తదితర అంశాలపై ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన 11 రాష్ట్రాల బీజేపీ అధ్యక్షులు, సంస్థాగత ప్రధాన కార్యదర్శుల సమావేశంలో సుదీర్ఘంగా చర్చించినట్టు తెలిసింది. ఆ సమావేశం సుదీర్ఘంగా 6 గంటల పాటు కొనసాగింది.

ఈ సమావేశానికి ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దక్షిణాదిలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులు, ఎన్నికలు, పార్టీ బలోపేతం, విజయం సాధించేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించి ఒక ప్రత్యేక ఎజెండాతో ముందుకు పోవాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తొమ్మిదేండ్లలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధినీ క్షేత్ర స్థాయిలోకి చాలా మందికి తెలిసేలా ప్రచారం చేయాలని నడ్డా ఆదేశించినట్టు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని దిశా నిర్దేశం చేసినట్టు తెలిసింది. జాతీయ నాయకత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని నడ్డా స్పష్టం చేసినట్టు, అదే సమయంలో పలు రాష్ట్రాల అధ్యక్షుల పనితీరుపైనా, నేతల మధ్య సమన్వయలేమిపైనా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు ప్రచారం జరుగుతున్నది. తమిళనాడు అధ్యక్షులు అన్నామలై ఒంటరిగా స్టాలిన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్న తీరును ప్రశంసించినట్టు సమాచారం అందింది. దక్షిణ రాష్ట్రాల్లో పార్టీ బలోపేతం, పార్లమెంట్ సీట్ల సంఖ్య పెంపు పై చర్చలు జరిగినట్టు తెలిసింది. పోలింగ్ బూత్ లెవెల్ లో పార్టీని పటిష్ట పరిచి బూత్ కమిటీలు పూర్తీ చేయాలని నేతలకు నడ్డా ఆదేశించారు. ఈ సమావేశంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి(సంస్థాగత) బీఎల్ సంతోశ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి, ఏపీ అధ్యక్షులు డి.పురందేశ్వరి, తమిళనాడు, కర్నాటక, పలు రాష్ట్రాల అధ్యక్షులు పాల్గొన్నారు. ఆ సమావేశంలో ఈటల, డీకే అరుణ, ఎంపీ లక్ష్మణ్, బండి కూడా పాల్గొన్నట్టు తెలిసింది. ఆ సమావేశం అనంతరం నోవాటెల్‌లో బీజేపీ రాష్ట్ర కోర్‌కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమై తెలంగాణలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు.

# ఉమ్మడి పౌరస్మృతి ఎవరి కోసం? : పీవోడబ్ల్యూ ప్రశ్న





నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భిన్న జాతులు, మతాలతో కూడిన వైవిధ్యమైన దేశంలో మతోన్మాద వైషమ్యాలను సృష్టించే ప్రయత్నాల పట్ల అప్రమత్తంగా ఉండాలనీ, ఉమ్మడి పౌరస్మృతి ఎవరికోసమంటూ ప్రగతిశీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్షులు జి ఝాన్సీ ప్రశ్నించారు. ఆదివారం హైదరాబాద్‌లోని మార్క్స్ భవన్‌లో ఆ సంఘం ఉపాధ్యక్షులు అనసూయ అధ్యక్షతన 'కామన్ సివిల్ కోడ్ ఎవరి కోసం' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ భిన్న జాతులు, మతాల వైవిధ్య సంస్కృతులు కలిగిన దేశంలో ముందుగా వ్యక్తిగత చట్టాలలో సంస్కరణలు మొదలు పెట్టాలనీ, ఉమ్మడి పౌరస్మృతి అవసరం లేదన్న 21వ లా కమిషన్ సూచనలను ఎందుకు పక్కన పెట్టారని ప్రశ్నించారు. ఒకే దేశం, ఒకే భాష ఒకే సంస్కృతి పేరుతో వైషమ్యాలను సృష్టించి మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రజల మధ్య సామరస్యాన్ని దెబ్బతీయడానికి చూస్తున్నారని విమర్శించారు. మహిళల సమానత్వం పేరుతో, మైనార్టీలను, ఇతర జాతులను అణిచి వేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. సామాజిక కార్యకర్త సంధ్య మాట్లాడుతూ భిన్న జాతుల, మతాల సంస్కృతుల సమాహారంగా ఉమ్మడి పౌరస్మృతి అవసరం లేదని తెలిపారు. భారత ప్రజాస్వామ్య లక్షణంగా, రాజ్యాంగబద్ధమైన హక్కు అని లా కమిషన్ స్పష్టం చేసిందని గుర్తుచేశారు. సామాజిక కార్యకర్త సజయ ఈ ఉమ్మడి పౌరస్మృతి ఎలా ఉంటుందో డ్రాఫ్ట్ లేకుండానే ఒకే దేశం, ఒకే చట్టం అంటున్నారని తెలిపారు. ఉమ్మడి పౌరస్మృతికి మైనార్టీ మతస్థులు వ్యతిరేకం అన్నట్లు ప్రచారం చేస్తున్నారన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పీవోడబ్ల్యూ ప్రధాన కార్యదర్శి లక్ష్మీ, సీఎంఎస్ శ్రీదేవి, డీబీఎఫ్ నాయకులు కల్పన, సామాజిక కార్యకర్త అంబిక తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలొస్తున్నాయ్.. దర్యాప్తులు పూర్తి చేయండి

- అన్ని పోలీసు స్టేషన్లకు డీజీపీ కార్యాలయం అంతర్గత ఆదేశాలు



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి :

రాష్ట్రంలో త్వరలోనే అసెంబ్లీ ఎన్నికల సైరన్ మోగనున్న దృష్ట్యా కేసుల దర్యాప్తులను పూర్తి చేయాలని రాష్ట్రంలోని అన్ని పోలీసు స్టేషన్ల అధికారులకు డీజీపీ కార్యాలయం నుంచి ఆదేశాలు వెళ్లాయి. దీనికి సంబంధించిన కార్యాచరణను కూడా హెడ్‌క్వార్టర్స్ నుంచి పంపించినట్టు తెలిసింది. వచ్చే ఐదు నెలల్లో రాష్ట్ర శాసనసభ ఎన్నికలు జరపటానికి ఎలక్షన్ కమిషన్ (ఈసీ) ఒక పక్క సన్నాహాలు చేస్తున్నది. మరోపక్క, ప్రధానరాజకీయ పక్షాలు సైతం ఎన్నికల శంఖారావాలను పూరించి అందుకు తగిన ఏర్పాట్లను కూడా ప్రారంభించాయి. అయితే, ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతలను కాపాడే కీలకమైన బాధ్యతలు పోలీసుల భుజస్కంధాలపై ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల సైరన్ మోగించేనాటికి ఆయా పోలీసు స్టేషన్ పరిధుల్లో నమోదైన కేసులు, దర్యాప్తులో ఉన్న కేసులను ఒక కొలిక్కి తీసుకురావాలని పోలీసు ఉన్నతాధికారులు ఆశిస్తున్నారు. కారణం.. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైతే దాదాపు రాష్ట్రంలోని పోలీసు యంత్రాంగం ఎన్నికల బందోబస్తుపై దృష్టిసారించాల్సి ఉంటుంది. ప్రచారం మొదలుకొని ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యేంత వరకు వీరు తమ రోజువారి కేసుల దర్యాప్తు నుంచి దూరంగా ఉండే పరిస్థితి ఏర్పడుతున్నది. ఈ నేపథ్యంలో వచ్చే మూడు నెలల్లో ఆయా పోలీసు స్టేషన్ల పరిధులలో పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తులను పూర్తి చేయాలని ఉన్నతాధికారులు దర్యాప్తు అధికారులను ఆదేశించారు. సాధ్యమైనంత వరకు కేసులలో నిందితులను అరెస్టు చేయటం, పెండింగ్‌లో ఉన్న వారెంట్లను జారీ చేయటం, దర్యాప్తులను పూర్తి చేసి చార్జీషీట్లను కోర్టులకు సమర్పించటం వంటి ప్రక్రియలను పూర్తి చేయాలని కూడా ఆదేశించారు. దీనితో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యాక పెండింగ్ కేసుల భారం పడకుండా జాగ్రత్త పడినట్టవుతుందని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఈ విషయంలో ఆయా జిల్లాల ఎస్పీలు, నగర పోలీసు కమిషనర్లు తమ పరిధిలోని పోలీసు స్టేషన్ల దర్యాప్తు అధికారులకు తగిన కార్యాచరణను రూపొందించి ఇవ్వాలనీ, అలాగే ఎప్పటికప్పుడు కిందిస్థాయి అధికారులకు అందుబాటులో ఉంటూ తగిన దిశానిర్దేశం చేయాలని కూడా డీజీపీ హెడ్‌క్వార్టర్స్ ఆదేశించినట్టు తెలిసింది.

# సమస్యలు పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ-వనస్థలిపురం

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎస్ కే డీ నగర్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు ఆదివారం కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. స్పందించిన కార్పొరేటర్ త్వరలోనే ప్రతి సమస్య పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి సుధాకర్ రెడ్డి, శ్రీధర్ రావు, కార్యవర్గ సభ్యులు కృష్ణారావు, శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.



# సీఐ మల్లేష్‌కు ఘన సన్మానం



నవతెలంగాణ-సంతోష్ నగర్

ఐఎస్ సదన్ సీఐ మల్లేష్ నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆదివారం సంతోష్ నగర్ సౌత్ జోన్ పీస్ కమిటీ, సంతోష్ నగర్ డివిజన్ అధ్యక్షులు బీఆర్ఎస్ చింతల శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ వి. నర్సింగ్ రావు, బాలాజీ ముత్తు రవిలు స్థానిక నాయకులతో మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత సీఐ మల్లేష్‌కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ నెల 16న జరిగే బోనాలు ఘట్టాలు ఊరేగింపులకు సహకరించాలని సీఐ మల్లేష్, డీఐ నిరంజన్‌లను పార్టీ అధ్యక్షులు చింతల శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు సభ్యులు , అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# 'మాజీ సైనికుల' తొలి సర్వసభ్య సమావేశం



నవతెలంగాణ -నాగోల్

హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలోని మాజీ సైనికుల సంక్షేమ సంఘం తొలి సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం సెంట్రల్ హస్తినాపురంలోని మేజర్ పద్మపాని ఆచార్య స్మారక భవనంలో నిర్వహించారు. ఈ సమావేశానికి నూతన కార్యవర్గ కమిటీ కార్యవర్గ సభ్యులతోపాటు 100 మందిపైగా మాజీ సైనికులు హాజరయ్యారు. దీంట్లో సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి టి. వెంకటేశ్వర్లు కార్యవర్గ సభ్యులను పరిచయం చేయగా..అధ్యక్షులు కే. ప్రదీప్ కుమార్ రెడ్డి మాట్లాడారు. మాజీ సైనికులు వారి కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం సంక్షేమ సంఘం చేపట్టబోయే కార్యక్రమాలను క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు నాగేశ్వర్ రెడ్డి, సలహాదారు కిషోర్బల్లా, మల్లారెడ్డి, శ్రీనివాసరావు, కే .మహేందర్ రెడ్డి, కిశోర్, సోమశేఖర్ రెడ్డి, మాజీ సైనికులు పాల్గొన్నారు.

# కమలం వీడి కారెక్కిన లెనిన్ నగర్ యువత

- మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ - మీర్ పేట్

తెలంగాణ రాష్ట్రం మహేశ్వరం నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై లెనిన్ నగర్ యువకులు కమలం వీడి కారెక్కుతున్నారని తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 35వ డివిజన్ బీజేపీ పార్టీకి చెందిన దాదాపు 60మంది యువకులు బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో ఆదివారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి వారికి బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధి ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే సాధ్యమని యువకులు, విద్యార్థులు, రైతులు బీఆర్ఎస్ పార్టీలోకి చేరుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. బంగారు తెలంగాణే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. అనంతరం 35వ డివిజన్ కార్పొరేటర్ గిల్లా సౌందర్య విజయ్ ఆధ్వర్యంలో గూడేటి శేఖర్‌కు సీఎం సహాయ నిధి నుండి మంజూరైన రూ.30 వేలు విలువ గల చెక్కును మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు ముద్ద పవన్, ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ, కార్పొరేటర్ సిద్దాల లావణ్య, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జేటావత్ శ్రీనివాస్ నాయక్, కార్పొరేటర్లు వేముల నర్సింహా, ఇంద్రావత్ రవి నాయక్, నవీన్, కో ఆప్షన్ సభ్యులు జంగయ్య, శీను నాయక్, యువజన విభాగం ఉపాధ్యక్షుడు అక్విల్ తదితరులు పాల్గొన్నారు.

# పీర్జాదిగూడలో వైష్ణవి సేవా సంఘం కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ - బోడుప్పల్

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆర్ టీసీ కాలనీలో వైష్ణవి సేవా సంఘం సభ్యులు ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ సంఘం నూతన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆరుట్ల కరుణాకరా చార్యులు, ఉపాధ్యక్షుడిగా మారిగంటి అరుణ్ స్వామి, ప్రధాన కార్యదర్శులుగా ఆరుట్ల గోపి, శ్రీకాంత్, సహాయ కార్యదర్శులుగా గిరిమోటపల్లి శేశం, సందీప్, కోశాధికారిగా బి.వేణుగోపాలా చార్యులు, సహయ కోశాధికారి కారిదారూరి శేషా చార్యలు, గౌరవ సలహాదారులు నరసింహ చార్యులు, వేదాంతం అపాల చార్యులు, గోపినాదా చార్యులు, శేషా చార్యులు, కార్యవర్గ సభ్యులు జీయర్ రఘునాథ చార్యులు, జీడి కంటి సంతోష్, మరిగంటి వెంకట సంపత్, ఎస్.యాతిరాజ్, పక్షపల్లి మధుకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంఘం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కరుణాకరా చార్యులు తమ ఎన్నికలకు సహకరించిన వైష్ణవి సేవ సంఘం సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# సంతోష్ నగర్ ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్



నవతెలంగాణ - సంతోష్ నగర్

యాకుత్ పురా నియోజకవర్గం ఐఎస్ సదన్ డివిజన్ కల్వకుర్తి చౌరస్తా పక్కన సాగర్ రోడ్‌కు వచ్చే రోడ్డులో ఆదివారం సంతోష్ నగర్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ ను నిర్వహించారు. సంతోష్ నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ రద్దీ సృష్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ విక్రమ్ సింగ్, ఎస్ఐ వి. సత్యనారాయణ హెచ్చరించారు. ఈ డ్రైవ్‌లో కలిగిస్తున్న దుకాణదారులపై, గుడ్స్ ఆటోలపై కేసులను నమోదు చేసి జరిమానాలను విధించినట్లు తెలిపారు. అదే విధంగా చౌరస్తా, దేవరకొండ రోడ్ బిగ్ సి వద్ద ట్రాఫిక్ ఇబ్బందుల ఫిర్యాదులు వస్తున్నాయని దీనిపై కూడా ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉద్దేశపూర్వకంగా నెంబర్ ప్లేట్ కనిపించకుండా చేసినట్లయితే వాహన యజమాని పై మోటర్ వెహికల్ యాక్ట్ 129 (2) రూ. 2వేలు వరకు జరిమానా లేదా నెల రోజులు జైలు శిక్ష పడే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## దాతలు సహకరిస్తే..
# గ్రామాలు అభివృద్ధి చెందుతాయి



నవతెలంగాణ-ఘట్కేసర్

దాతలు ముందుకు వచ్చి సహకరిస్తే.. గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డి అన్నారు. ఘట్కేసర్ మండలం ఘణపురం గ్రామ పంచాయతీ పరిధిలోని లింగాపురం గ్రామంలో సిమెంట్ రహదారి నిర్మాణం కోసం సర్పంచ్ బద్దం గోపాల్ రెడ్డి తండ్రి బద్దం యాదిరెడ్డి రూ.4 లక్షను విరాళంగా అందజేశారు. ఆ విరాళంతో నిర్మాణం పూర్తైన రహదారిని ఆదివారం సర్పంచ్ బద్దం గోపాల్ రెడ్డి, పంచాయతీ పాలకవర్గం, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. ప్రతిఒక్కరూ తమ గ్రామ అభివృద్ధికి దోహదపడితే గ్రామాలు సస్యశ్యామలం అవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పరమేష్ గౌడ్, మాజీ సర్పంచులు రూప్ సింగ్ నాయక్, వేముల మమతా మహేష్ గౌడ్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు రాజు గౌడ్, టీపీసీసీ మహిళా కార్యదర్శి పాలడుగుల పద్మ, మహిళా కాంగ్రెస్ బి బ్లాక్, మండల అధ్యక్షురాళ్ళు బర్ల అనిత, పైళ్ళ లతా రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు నాగులపల్లి శ్రీనివాస్, పోచారం ఎస్టీ సెల్ అధ్యక్షులు విజయ్, గోవర్ధన్ గౌడ్, శంకర్ గౌడ్, సత్తయ్య గౌడ్, లక్ష్మయ్యగౌడ్, వరికుప్పల వెంకటేష్, గుర్జకుంట నర్సింహా, శ్రీనివాస్, రమేష్, శివాజీ నాయక్, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

# 'సర్వ్' భవన్ కూల్చివేత..గాంధీజీ వారసత్వంపై దాడి

ప్రముఖ సంఘ సేవకులు, గాంధీయవాది డాక్టర్ మోటూరి కృష్ణ ప్రసాద్



నవతెలంగాణ- సంతోష్ నగర్

గాంధీజీ ఆలోచనలను వ్యాప్తి చేయడానికి ఆచార్య వినోబా భావే, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, లాల్ బహదూర్ శాస్త్రి, జయప్రకాష్ నారాయణ్‌ల కృషితో వారణాసీలో స్థాపించబడిన సర్వ్ సేవా సంఘ్ భవన్ కూల్చివేత గాంధీజీ వారసత్వంపై దాడి అని ప్రముఖ సంఘ సేవకులు, గాంధీయవాది డాక్టర్ మోటూరి కృష్ణ ప్రసాద్ అన్నారు. వారణాసీలోని చారిత్రాత్మకమైన సర్వ్ సేవా సంఘ్ భవన్ కూల్చివేత ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని కోరుతూ హైదరాబాద్, సైదాబాద్, సింగరేణి కాలనీ, గిరిజన భవన్ వద్ద ఆదివారం తెలంగాణ సర్వోదయ మండలి లోక్ సేవక్ ల 'సత్యాగ్రహ దీక్ష' నిర్వహించింది. ఈ దీక్షకు తెలంగాణ సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షులు ఆర్. శంకర్ నాయక్ నేతృత్వం వహించగా.. డాక్టర్ మోటూరి కృష్ణ ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై 'సత్యాగ్రహ దీక్ష' ను ప్రారంభించి మాట్లాడారు. 1960, 1961, 1970లో మూడు రిజిస్టర్డ్ సేల్ డీడీల ద్వారా భారత ప్రభుత్వం నుండి భూమిని కొనుగోలు చేసి ఆచార్య వినోబా భావే అఖిల్ భారత్ సర్వ సేవా సంఘ్ భవన్ ను నిర్మించారని తెలిపారు. 'కాశీ కారిడార్' విస్తరణలో భాగంగా ఉత్తర్ ప్రదేశ్ బీజేపీ ప్రభుత్వం ఈ భవనాన్ని కూల్చి రైల్వే శాఖకు అప్పగిస్తామనడం దుర్మార్గమన్నారు. వారణాసి సర్వ సేవా సంఘ్ భవన్ లో ఐదు దశాబ్దాలుపైగా సర్వ సేవా సంఘ్ ప్రకాశన్ పబ్లికేషన్ హౌస్, సామాజిక-ఆర్థికంగా బలహీన వర్గాల పిల్లలకు ఫీజు లేకుండా బోధించే ప్రీస్కూల్, పుస్తకాలతో కూడిన లైబ్రరీ, సమావేశ మందిరం, గాంధీ ఆరోగ్య కేంద్రం, యువ శిక్షణ కేంద్రం, ఖాదీ భండార్, అతిథి గృహం విజయవంతంగా నిర్వహించబడుతుందని గుర్తుచేశారు. గాంధీయ విలువలను ప్రచారం చేయడానికి పనిచేస్తున్న సర్వ సేవా సంఘ్ భవనాన్ని. బీజేపీ ప్రభుత్వం చట్టవిరుద్ధంగా నిర్వహించే కూల్చివేతను శాంతియుత ఉద్యమాల ద్వారా, న్యాయ పోరాటం ద్వారా అడ్డుకుంటామని హెచ్చరించారు. మన దేశం, జాతీయ వారసత్వంపై బీజేపీ చేస్తున్న దాడిని దేశ ప్రజలు ఎన్నటికీ సహించరని, ఈ అత్యంత అవమానకరమైన చర్యను ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండించాలని పిలుపునిచ్చారు. అలాగే మహాత్మా గాంధీ వారసత్వంపై జరిగే ప్రతి దాడికి వ్యతిరేకంగా నిలబడి శాంతియుతంగా ఉద్యమించాలని కోరారు.

అనంతరం ఆర్. శంకర్ నాయక్ మాట్లాడుతూ... సర్వ్ సేవా సంఘ్ భవన్ ను కూల్చి వేసి అభివృద్ధి పేరట బీజేపీ ప్రభుత్వం ఆ భూమిని స్వాధీనం చేసుకోవడం అన్యాయం అని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పార్లమెంట్ సభ్యులైన ప్రధాని నరేంద్ర మోడీ తక్షణమే జోక్యం చేసుకొని ఈ వివాదాన్ని పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 'సత్యాగ్రహ దీక్ష' లోక్ సేవక్ లు, సీపీఐ షేక్ మొహమ్మద్ అమీనా ఎస్. రమేష్, ఆర్. పాండు, వి. అంజయ్య, అజయ్, బి. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# లోకయుక్త కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

కార్పొరేటర్ కొత్తకాపు అరుణా రవీందర్



నవతెలంగాణ-సంతోష్ నగర్

మలక్‌పేట్ నియోజకవర్గం సైదాబాద్ డివిజన్ పరిధిలోని లోకయుక్త కాలనీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ కొత్త కాపు అరుణా రవీందర్ రెడ్డి అన్నారు. ఆదివారం లోక యుక్త కాలనీ నుండి పోచమ్మ ఆలయం వరకు చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. అనంతరం అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించి..అక్కడి నిర్మాణ, అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఈ వెంకన్న, రవీందర్, దేశ్ పాండే, నాగరాజు, కాంట్రాక్టర్ శ్రీను, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం



నవతెలంగాణ- చైతన్యపురి

లకిడికాపూల్ నీలోఫర్ కాన్సర్ ఆసుపత్రిలో రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం చేసినట్లు ఆ ఫౌండేషన్ చైర్మన్ పెద్ది శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ ప్రదీప్ కుమార్, తెలంగాణ ఉద్యోగ స్టేట్ మహిళా వింగ్ అధ్యక్షురాలు పద్మ, శ్రీకాంత్ రెడ్డి, సినీ దర్శకా నిర్మాత, జగన్ రెడ్డి చౌదరి సినీ నటులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ జంజర్ల ప్రమీల కుమారి అమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆసుపత్రికి వచ్చే రోగులకు, వారి సహాయకులకు అన్నదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ ప్రకాష్, శివచైతన్య ప్రవీణ్, బిటి నాయుడు, శివ నేత, బి. నవీన్, సభ్యులు చెరుకు రాజు, నితిన్ గౌడ్, నరేంద్ర వర్మ, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతో దోహదం



నవతెలంగాణ- సంతోష్ నగర్

ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజలకు ఎంతగానో దోహదపడుతున్నాయని చంపా పేట్ డివిజన్ పరిధిలోని మారుతీ నగర్ శ్రీ త్రివేణి హై స్కూల్ పక్కన విజయ క్లినిక్ ఎండీ డాక్టర్ పల్లవి అన్నారు. ఆదివారం శ్రీ సాయి డయాగ్నస్టిక్ సెంటర్ ఎం. నవీన్, సందీప్, ప్రభాకర్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎం. నవీన్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో రక్త పరీక్షలు, బీపీ, షుగర్, పరీక్షలు చేసినట్లు తెలిపారు. ఆరోగ్యం వ్యాపారంగా మారిన ఈ రోజుల్లో సామాజిక దక్పథంలో ఉచిత వైద్య శిబిరం ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పేద ప్రజలు, ఆటో డ్రైవర్లు, వ్యాపారస్తులు, స్థానికులు, నాయకులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి

- ఉప్పల శ్రీనివాస్ గుప్త



నవతెలంగాణ - నాగోల్

ఆర్యవైశ్య సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. ఆదివారం హైదరాబాద్ లోని నాగోల్, ఉప్పల్ మెట్రో స్టేషన్ పక్కన గల హెూటల్ ఎస్వీఎం గ్రాండ్ లో అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో ఐవీఎఫ్ తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగానే నూతన అధ్యక్షుడు, కమిటీ కార్యవర్గ సభ్యులకు ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్యఅతిథులుగా అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు అశోక్ అగర్వాల్, ఐవీఎఫ్ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ గంజి రాజమౌళితో కలిసి ఉప్పల శ్రీనివాస్ గుప్త హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐవీఎఫ్ జాతీయ అధ్యక్షుడు అశోక్ అగర్వాల్ మాట్లాడుతూ అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో 20 దేశాల నుంచి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ప్రిలిమినరీ పాస్ అయి ఐఎఎస్ చదువుతున్న పేద ఆర్యవైశ్యులైన 26 మందికి రూ.లక్ష ఆర్థిక సాయం చేశామని తెలిపారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రూప కర్త రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమాలు కూడా దేశ వ్యాప్తంగా చేపడుతున్నామని అన్నారు. అనంతరం ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలకు సభ్యులు అందరూ ప్రతిసంవత్సరం స్వచ్ఛందంగా పాల్గొని, భాగస్వాములు కావడం సంతోషకరం అన్నారు. 33 జిల్లాల్లో ఐవీఎఫ్ ను బలోపేతం చేసేందుకు నాయకులు, యువత సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో వైశ్య ప్రదేశం రాష్ట్ర జనరల్ సెక్రటరీ పబ్బ చంద్ర శేఖర్, ప్రథమ మహిళ ఉప్పల స్వప్న, స్టేట్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు చందా భాగ్య లక్ష్మి, గ్రేటర్ హైదరాబాద్ జిల్లా ప్రెసిడెంట్ ఊట్కూరి శ్రీనివాస్ గుప్తా, తెలంగాణ స్టేట్ యూత్ ప్రెసిడెంట్ కట్ట రవికుమార్, తెలంగాణ స్టేట్ యూత్ జనరల్ సెక్రటరీ రొంపల్లి సంతోష్ కుమార్, తెలంగాణ స్టేట్ యూత్ వైస్ ప్రెసిడెంట్ కొల్పురి నరేష్ గుప్త , రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చింతల రజినీకాంత్, జనగం జిల్లా అధ్యక్షుడు బిజ్జాల నవీన్, మహిళా అడ్వైసర్ కమిటీ సభ్యులు, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ - తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు, అన్ని జిల్లాల అధ్యక్షులు, సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే పాదయాత్ర



నవతెలంగాణ- ఉప్పల్

ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉప్పల్ నమస్తే పేరుతో ఎమ్మెల్యే భేత్ సుభాష్ రెడ్డి పాదయాత్ర ముందుకు సాగుతోంది. ఈ మేరకు ఆదివారం చిల్కానగర్ డివిజన్లోని మల్లికార్జున నగర్ బొడ్రాయి మార్కండేయ నగర్ పలు ప్రాంతాలలో కార్పొరేటర్ బన్నాల గీతతో కలిసి పాదయాత్ర చేస్తూ ..ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిల్కానగర్‌లోని తాగునీటి, డ్రైనేజీ, కరెంటు, రోడ్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు బేతి సుమంత్ రెడ్డి, బన్నాల ప్రవీణ్, నేర్దం భాస్కర్ గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి, గరిక సుధాకర్, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, లేతాకుల రఘుపతి రెడ్డి, గుడి మధుసూదన్ రెడ్డి, జల్లి మోహన్, పిట్టల నరేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

# బీటీ రోడ్ పనుల పరిశీలన



నవతెలంగాణ-వనస్థలిపురం

బీఎన్ రెడ్డి నగర్ డివిజన్‌లోని టీచర్స్ కాలనీ ఫేస్ 1 సౌత్ లో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఆ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కటికి రెడ్డి అరవింద్ రెడ్డి ఆదివారం కాలనీ అధ్యక్షులు విష్ణువర్ధనరెడ్డి తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అరవింద్ రెడ్డి మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కాంట్రాక్టర్లను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం పార్టీ యూత్ అధ్యక్షులు ముద్ద పవన్, డివిజన్ యూత్ అధ్యక్షులు మునగాల రాఘవేందర్ రావు, ప్రవీణ్ రెడ్డి, మోహన్ రెడ్డి, కొండల్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, మైపాల్ రెడ్డి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రాబోయే ఎన్నికల్లో 119 అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తాం

ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్



నవతెలంగాణ - సిటీబ్యూరో

రాష్ట్రంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజా పార్టీ 119 అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం ఎల్బీనగర్‌లోని యశోదనగర్ కాలనీలో ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రజా పార్టీ బీసీలకు 70 అసెంబ్లీ స్థానాలను కేటాయిస్తామన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రి చేస్తామన్నారు. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు బీసీ డిక్లరేషన్ పేరుతో సభలు పెట్టడం కాదని, బీసీని సీఎం చేసే దమ్ముందా అని సవాల్ విసిరారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు డిక్లరేషన్ పేరుతో బీసీలను మోసం చేసే కుట్ర పన్నుతున్నాయన్నారు. బీసీ కులాల మధ్యన ఓట్ల బదలాయింపు జరగాలన్నారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను కార్పోరేట్ శక్తులు నడిపిస్తున్నాయ న్నారు. రాష్ట్రంలో ప్రధాన ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీగా ప్రజా పార్టీ మారుతుందన్నారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశంలో పేదలకు నేటికీ విద్య, వైద్యం ఉచితంగా అందడం లేదన్నారు. ప్రజా పార్టీ అధికారంలోకి పేదలకు ఉచిత విద్య, వైద్యం అందిస్తామన్నారు. పేదల కష్టాలు పోవాలంటే ప్రజా పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెంట రమేష్, పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అంజి యాదవ్, మహిళా విభాగం అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, రాష్ట్ర నాయకులు రాగం సతీష్ యాదవ్, లక్ష్మయ్య గౌడ్, ఓరుగంటి వెంకటేశ్వర్లు యాదవ్, ప్రశాంత్, నాగప్ప, మహేష్ యాదవ్, రాములు యాదవ్, ఈశ్వర్, శ్రీశైలం, చంద్ర శేఖర్ యాదవ్, అరుణ్ యాదవ్, కొండలు, ప్రజా పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీ ఆయుర్వేద హాస్పిటల్‌లో వైద్య శిబిరం



నవతెలంగాణ-వనస్థలిపురం

వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీలో డాక్టరు వై. శ్రీనివాసులు ఆదివారం లక్ష్మీ ఆయుర్వేద హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీ ఆయుర్వేద హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ వై. శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ శిబిరంలో మోకాళ్ళ, నడుము నొప్పులు, పక్షవాతం ఆస్తమా, షుగర్ వంటి పరీక్షలు చేసి, ఉచితంగా ముందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. లక్ష్మీ ఆయుర్వేద హాస్పిటల్‌లో ప్రభుత్వ ఉద్యోగులు వారి కుటుంబీకులు, విశ్రాంతి ఉద్యోగులకు ప్రభుత్వ తరఫున రీఫ్లేస్మెంట్ సౌకర్యమే ఉండటమే కాక వీరికి ప్రతి నాలుగో ఆదివారం ఉచితంగా చూడబడునని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు నికిత, నవీన్ కుమార్, ఎఫ్సీఐ కాలనీ అధ్యక్షుడు సిరిగిరి రామ్ రెడ్డి, బలరాం, సైదులు గౌడ్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# అందరికీ అందుబాటులో 'మధుర అవెన్యూ'

ఉత్తరప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి అనిల్ రాజ్ బార్



నవతెలంగాణ - సిద్దిపేట

పేద, మధ్యతరగతి కుటుంబాలకు సైతం అందుబాటులో ఉండే వెంచర్ ను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఉత్తరప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి అనిల్ రాజ్ బార్ అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలో ముస్త్యాల గ్రామ శివారులోని 42ఎకరాల్లో ఏర్పాటుచేసిన మధుర అవెన్యూ వెంచర్ ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి సామాన్యునికి సొంత ఇంటి కల నెరవేర్చుతూ అనుగుణంగా అత్యాధునికమైన ప్రాంగణంతో పాటు మౌలిక వసతులను కల్పిస్తూ వెంచర్ ను దిగ్విజయంగా పూర్తి చేయాలని నిర్వాహకులను కోరారు. ఈ కార్యక్రమంలో మధుర అవెన్యూ డైరెక్టర్లు మంజులాదేవి, రామేశ్వర్ సింగ్, కుష్బు సింగ్, ఆదిత్య సింగ్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## బోనం సమర్పించిన కార్పొరేటర్ దీపిక



నవ తెలంగాణ కంటోన్మెంట్

మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక ఆదివారం లష్కర్ బోనాల సందర్భంగా ఉజ్జయిని మహ ంకాళి అమ్మకు పోచమ్మకు బోనం సమర్పించారు. అనంతరం మెహబూబ్ కాలేజ్ ప్యాట్నీలో భారతీయ జనతా పార్టీ నాయకులకు కార్యకర్తలకు బోనాల భోజనాలు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతితులు మురళీధర్ రావు సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్య క్షులు శ్యాంసుందర్ గౌడ్ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్య క్షులు గౌతంరావు మహిపాల్ రెడ్డి కార్పొరేటర్లు కొప్పుల నరసింహారెడ్డి ఆకుల శ్రీవాణి శంకర్ యాదవ్ ఫ్లోర్ లీడర్ రవి చారి సుప్రియ నవీన్ గౌడ్ సీనియర్ నాయకులు హాజరయ్యారు.

## పేదలకు వరం సీఎంఆర్ఎఫ్ ఉపేందర్ రెడ్డి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

సీఎంఆర్ఎఫ్ అనారోగ్యంతో బాధ పడుతున్న పేదలకు ఓ వరమని బీఆర్ఎస్ మల్కా జిగిరి సర్కిల్ వైస్ ప్రెసిడెంట్ ఉపేం దర్‌రెడ్డి అన్నారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు ఆదేశాల మేర కు ఆదివారం పలువురి లబ్ధిదారురాలకి ఎల్‌ఓసి పత్రాన్ని అందజేశారు. నేరేడ్ మెట్ డివిజన్ పరిధిలోని యాప్రాల్ జవహర్ నగర్‌కి చెందిన ఫాతిమా కి వైద్య చికిత్సకు రూ.లక్ష రూపాయలు మంజూరైంది. సంబంధించిన ఎల్‌ఓసి పత్రాన్ని నేరేడ్‌మెట్ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో అందచేశారు. ఈ కార్యక్రమంలో మల్కా జిగిరి సర్కిల్ వైస్ ప్రెసిడెంట్ ఉపేందర్ రెడ్డి, చెన్నారెడ్డి, శివ,రాజేష్, సుధ తదితరులు పాల్గొన్నారు.

# అల్వాల్‌లో అక్రమ సెల్లార్లు

- పాత భవనాలపై పర్మిషన్ లేకుండా కొత్త కట్టడాల నిర్మాణం
- పట్టించుకోని అధికారులు.. జేబులు ఫుల్.. చర్యలు నిల్..





నవతెలంగాణ-నేరేడ్‌మెట్

అల్వాల్ సర్కిల్ పరిధిలోని అక్రమ నిర్మాణాలు ఊపందు కున్నాయి. నిర్మాణ దారులతో టౌన్ ప్లానింగ్ అధికారులు కుమ్మక్కు కావడంతో నిబంధనలకు విరుద్ధంగా బహుళ అం తస్తుల భవనాలు వెలు స్తున్నాయి. దీంతో అటు అధికారులకు, ఇటు మధ్య దళారులకు కనకవర్షం కురుస్తుంది. గతంలో రెండు అంతస్తులకు అనుమతులు తీసుకున్న పాత భవ నాలపై 4,5 అంతస్తుల నిర్మా ణాలు చేపడుతున్నారు. నిబంధనలు తుంగలో తొక్కుతూ అసలే వర్షాకాలం పాత భవనాలపై కొత్త కట్టడాలు జరుగుతున్న జీహెచ్ఎంసీ అధికారులు స్పందించడం లేదని స్థాని కులు ప్రశ్నిస్తున్నారు. డ్రయినేజీ కలెక్షన్ ఉండవు.. ఎవరికి వారు ఎక్కడపడితే అక్కడ అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నా టౌన్ ప్లానింగ్ విభాగం నిమ్మకు నీరెత్తిన ట్టు మొద్దు నిద్రలో ఉంటూ ప్రభుత్వ ఆదాయానికి పంగనామాలు పెడుతున్నారు. అక్రమ నిర్మాణాలు ఊపందుకోవడంలో చైన్‌మెన్‌లో హవా నడుస్తోం ది.అక్రమ భవన నిర్మాణాలక సంబంధించి ఫిర్యాదు లు చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అంతే కాకుండా మధ్య దళారులు రంగ ప్రవేశం చేసి అటు టౌన్ ప్లానింగ్ అధికారులు, ఇటు నిర్మాణదారులతో మాట్లాడి పెద్ద ఎత్తున సెటిల్మెంట్లు చేసి లక్ష లాది రూపాయలు జేబులు నింపుకుంటూ అక్రమ నిర్మాణాలు కూల్చకుండా మధ్యవర్తిత్వం చేస్తున్నారని ఆరోపణలు విన వస్తున్నాయి. దళారులు, అధికారుల స్వలాభంతో జీహెచ్ఎంసీ ఆదాయానికి పెద్దఎత్తున గండి పడుతోం దని ప్రజలు వాపోతున్నారు. చేతివా టానికి అలవాటు పడ్డ టౌన్ ప్లానింగ్ అధికారులు కిందిస్థాయి సిబ్బంది నిర్వాకం కారణంగానే అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నా యని స్థాని కంగా ఆరోపణలు విన వస్తున్నాయి. అక్రమ నిర్మా ణాల భరతం పట్టాలని స్వయంగా మంత్రి కేటీఆర్ అధికారులను ఆదేశిం చినప్పటికీ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారుల చేతివాటం కార ణంగా నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు యథతథంగానే కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్ప టికైన జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి అక్రమ నిర్మాణాలను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

**టౌన్‌ప్లానింగ్ ఏసీపీ వివరణ :**

అక్రమ నిర్మాణాలు, మా దృష్టికి వస్తే తప్పక చర్యలు తీసుకుంటాం.

### హక్కులు సాధించుకోవడం కోసం

## బహుజన వర్గాలు ఏకం కావాలి

- బీసీకులాల జేఏసీ చైర్మెన్ కుందారంగణేష్ చారి



నవతెలంగాణ-నేరేడ్ మెట్

రాజ్యాంగంలో హక్కులను సాధించుకోవడం కోసం బహుజన వర్గాలు ఏకం కావాలని తెలంగాణ రాష్ట్ర బీసీ కులాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి పిలుపునిచ్చారు. ఆదివారం అల్వాల్ లోతుకుంట లోని విశ్వ రత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 18 వ వారం జ్ఞానమాల వేసే కార్యక్రమానికి ము ఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అల్వాల్ కాంగ్రెస్ 134 డివిజన్ అధ్యక్షులు సూర్య ప్రకాష్‌రెడ్డితో కలిసి జ్ఞాన మాల వేసిన అనంతరం ఆయన మాట్లాడారు. బహుజన వర్గాలు ఇంకా అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, వారి చైతన్యం కోసం ప్రతి ఒక్కరూ తమ తమ వంతు కృషి చేయాలని ఈ సందర్భంగా తెలిపారు. సామాజిక సేవలో భాగంగా అంబేద్కర్ రాజ్యాంగపరంగా కల్పించిన ఓటు హక్కులను ప్రతి ఒక్కరికి తెలియచేయాలని అప్పుడే అంబేద్కర్ కలలుగన్న దేశం సాధ్యమవుతుందని తెలిపారు. బహుజన వర్గాలు మహనీయుల బాటలో నడవాలని, అధికారం ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. 134 డివిజన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సూర్య ప్రకాష్ రెడ్డి నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరిని చైతన్య పరుస్తున్నారని చెప్పారు. జ్ఞాన మాల కార్యక్రమంలో అల్వాల్ వెంకటాపురం భూదేవి నగర్ ప్రాంతంలోని డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు పెద్ద సంఖ్యలో హాజరు కావడం పట్ల జ్ఞానమాల నిర్వహణ కమిటీ సభ్యులు ఆర్ చంద్రశేఖర్ అభినందించారు. విద్య ద్వారానే ప్రతి ఒక్కరు చైతన్యవాదాలు అవుతారని చైతన్య వంతులైన ప్రతి ఒక్కరు అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తున్నారని డ్రైవర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి స్వామి తెలిపారు.పాల్గొన్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. 18 వారం జ్ఞానమాల కార్యక్రమంలో నిర్వాణ కమిటీ సభ్యులు ఆశిష్ రాజ్ , అనంత రాజ్ , కేడి రమేష్, ఓంకార్ , ఆస శ్రవణ్‌కుమార్, డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు వెంకటయ్య తో పాటు డ్రైవర్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## గాంధీనగర్ అభివృద్ధికి నిరంతరం కృషి



నవతెలంగాణ-జవహర్‌నగర్

గాంధీనగర్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని సింగన్న బాల్‌రాజ్ అన్నారు. ఆదివారం కార్పొరేషన్ లోని 21వ డివిజన్ గాంధీనగర్ కాలనీలో నూతన కమిటీని ఎన్ను కున్నారు. ఈ మేరకు కాలనీవాసులు సింగన్న బాల్ రాజ్‌ను ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. ఈ సంద ర్భంగా బాల్ రాజ్ మాట్లాడు తూ కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తూ ప్రగతి పథంలో నడిపిస్తానన్నారు. ఉపాధ్యక్షులుగా నాగేశ్వరి, రవీందర్, సోమేశ్వర్రావు, పాండు, కార్యదర్శి బాలు, కోశాధికారి రాంచందర్, కమిటీ సభ్యులు నర్సింహులు, సతీష్, భాస్కర్, యాదగిరి, రాంరెడ్డి, సూర్జనా, జయమ్మ, నవీన్, శ్రీలత పాల్గొన్నారు.

## నూతన కమ్యూనిటీ హాల్ భవనం, ఓపెన్ జిమ్ ప్రారంభం



నవతెలంగాణ-కాప్రా

మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ హెచ్‌బీ కాలనీ ఫేస్-2 లో రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గ్రౌండ్‌లో నూ తనంగా నిర్మిం చిన కమ్యూ నిటీహాల్ భవనం, ఓపెన్ జిమ్ ప్రారంభోత్సవాన్ని ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి , స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, డివిజన్ అధ్యక్షులు మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డిలు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఎన్నో అభివృద్ధి కార్యక్ర మాలు చేసుకున్నామని, అవన్నీ మన కళ్ళ ముందే కనపడుతు న్నాయని ఇక ముందు కూడా అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తూ ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటానని తెలిపారు. కాలనీ అసో సియేషన్ కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి, కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ డివిజన్ అధ్యకులు మాజీ కార్పొ రేటర్ శ్రీనివాస్‌రెడ్డి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షు లు చంద్ర మోహన్, సెక్రటరీ ఉల్లేం బాలరాజు, ఈశ్వర రావు, రాజేష్, శ్రీనివాస రావు, వెంకటేష్, శ్రీరాములు, సోమయాజులు, శ్రీనివాస్, హనుమంతరావు మధు బాబు, సాయి కేశవ బీఆర్ఎస్ నేతలు మహిళా నాయకులు టీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరానికి విశేష స్పందన




నవతెలంగాణ-మల్కాజ్‌గిరి

ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభించిందని అని సీఐటీయు మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు అన్నారు. ఆదివారం సీఐటీయూ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరంలో 150 మందికి పైగా పేదలకు పరీక్ష లు నిర్వహి ంచి మందుల పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఉచిత వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా సీహెచ్ శ్రీనివాసులు సీఐ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఐటీయూ కార్మిక సంఘం,లయన్స్‌క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలను చేయడం అభినం దనీయమన్నారు. ఈ సందర్భంగా పేద ప్రజలకు ఎల్లవేళలా సామాజిక సేవా కార్యక్ర మాలు నిర్వహిస్తున్న క్లబ్ సభ్యులను అభినందించారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని, ఈ అవకాశాన్ని పేద ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవా లన్నారు. ఏ శిబిరానికి అతిథిగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జే.చంద్రశేఖర్ హాజరై మాట్లాడుతూ పేద ప్రజల కోసం నిరంతరం కార్మిక ప్రజా సంఘాలు పనిచేస్తున్నాయ న్నారు. ఈ వైద్య శిబిరంలో కాప్రా లయన్స్ క్లబ్ ఆఫ్ ఏఎస్ రావు నగర్ సెక్రటరీ సీహెచ్ వరప్రసాద్, కోశాధికారి చందన్ రాజు, క్లబ్ సభ్యులు కేవీన్ రెడ్డి , సురేష్ కుమార్ , నాగన్న , సీ.ఎస్.ఆర్ మూర్తి, కే.శ్రీనివాస్ రెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహపురి డాక్టర్ బి.ఎస్.ఎన్ రాజు , బృందం తదితరులు పలువురు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న పవన్ ఖేరా దంపతులు

నవతెలంగాణ-బేగంపేట్

అఖిల భారత కాంగ్రెస్ కమిటీ జాతీయ మీడియా అండ్ పబ్లిసిటీ చైర్మెన్, కాం గ్రెస్ జాతీయ అధికార ప్రతి నిధి పవన్ ఖేరా, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట నీలిమ దంపతులు సికింద్రాబాద్, ఉజ్జయిని మహంకాళి దేవాల యాన్ని ఆది వారం సందర్శించి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఆలయ ప్రధాన ద్వారం వద్ద కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వారికీ ఘనస్వాగతం పలికారు. దంపతులు అమ్మవారికి బంగారు బొట్టు , ముక్కుపుడుకను సమర్పించారు. అనంతరం ఆలయ అర్చకులు వారికీ వేద ఆశీర్వచనం చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎన్.ఎస్.యు.ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనుప శేఖర్, యువజన కాంగ్రెస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మోత రోహిత్, నేతలు భరత్, సుదీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల వైద్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసా

- కార్పొరేటర్ మునిగల సతీష్ కుమార్



నవతెలంగాణ-జవహర్‌నగర్

పేదల వైద్యానికి సీఎం సహాయనిధి భరోసాని స్తుందని, బీఆర్ఎస్ పభుత్వంలోనే నాణ్యమైన వైద్యం అందుతుందని కార్పొరేటర్ మునిగల సతీష్ కుమార్ అన్నారు. కార్పొరేషన్ లోని 12వ డివిజన్ శ్రీరామనగర్ కాలనీకి చెందిన ప్రమీల గుండె నొప్పితో అవస్థ పడుతుండగా... స్థానికులు విషయాన్ని కార్పొరేటర్ సతీష్ దృష్టికి తీసుకురాగా వైద్యఖర్చుల నిమిత్తం వెంటనే మంత్రి మల్లారెడ్డికి వివరించగా రూ.1.75లక్షల ఎల్వీ చెక్కు ను మంజూరు చేసి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పేదల ప్రజల వైద్యానికి మంత్రి మల్లారెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహిస్తారని, గతంలో కూడా డివిజన్ ప్రజలకు కంటి పరీక్షలు సీఎంఆర్ హాస్పిటల్లో ఉచితంగా చేసి మానవత్వం చాటుకున్నారని అన్నారు. అనంతరం మంత్రి మల్లారెడ్డికి కార్పొరేటర్ సతీష్‌కుమారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకురాలు మంజుల, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## శానిటేషన్ ప్యాడ్లపై మహిళల్లో అవగాహన కల్పిస్తాం

**అద్యాపన పౌండేషన్ చైర్మెన్ దీపక్‌తేజ**



నవతెలంగాణ-హైదరాబాద్

పేద మహిళల్లో శానిటేషన్ ప్యాడ్లపై అవగాహన లేకపోవడంతో వారు దుస్తు లను ఉపయోగిస్తు న్నారని అధ్యాపన ఫౌండేషన్ చైర్మెన్ దీపక్ తేజ ఆవేదన వ్యక్తం చేశారు. వారికి అవగాహన కల్పించి, శానిటేషన్ ప్యాడ్లు ఉపయోగించేలా చైత్యనం తీసుకొస్తామన్నారు. శనివారం సైదాబాద్‌లోని సింగరేణి కాలనీలో దళిత మహి ళలకు రూ 60 వేల విలువైన 560 సానిటేషన్ ప్యాడ్లు 150 మందికి అందజేసారు. వీటితోపాటు చిన్నపిల్లలకు పుస్తకాలు, పెన్నులు, ఎరైజర్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా దీపక్ మాట్లాడుతూ దళిత మహిళలకు సానిటేషన్ ప్యాడ్లు పంపిణీ చేయడం సంతోషకంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అరెన్, సొహేల్, ఫణీ, అనిషా తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సవాల్లో పాల్గొన్న బీఎల్ఆర్



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ తిరుమలనగర్‌లోని పోచమ్మ ముత్యాలమ్మ దేవ స్థానంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.శ్రీవారాహి దేవి నవ రాత్రి మహెూత్సవాలల్లో బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాప కులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి పాల్గొ న్నారు. అనంతరం అన్నదానంలో పాల్గొ న్నారు. బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి గుమ్మడి జంపాల్ రెడ్డి, సము ద్రాల కృష్ణ మూర్తి గుప్తా, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాప్రా డివిజన్ వంపుగూడ శ్రీరేణుక ఎల్లమ్మ దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యా ణ మహెూత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడి హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లమ్మ తల్లి దీవెనలు గ్రామ ప్రజల మీద ఉండాలని, కల్యాణ మహెూత్సవాన్ని అం గరంగవైభవంగా నిర్వ హిం చిన కమిటీ వారికి అభినం దనలు తెలియ జేశారు.ఈ కార్యక్రమంలో బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి బైరి నవీన్‌గౌడ్, ఎస్‌సి సెల్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పత్తి కుమార్ , గూడ ఇంద్రయ్య, పుట్ట బిక్షపతి గౌడ్, ప్రధాన కార్యదర్శి కృష్ణ, రవి ప్రసాద్, శ్రీ రాములు, గణేశ్, కృష్ణ, నర్సింహా, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.



సికింద్రాబాద్‌లో ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభిం చారు. అమ్మవారికి బోనాన్ని సమర్పించడానికి భక్తులుపెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి, రాజ్య సభ మెంబర్ కేశవరావుతో కలిసి అమ్మవారికి పూజలు నిర్వహించారు.ముందుగా ఉత్సవ కమిటీ సభ్యులు మేయర్‌ను సాధారణంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా మేయర్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి బోనం సమర్పించారు.

# బోనమెత్తిన లష్కర్

- వైభవంగా ఉజ్జయినీ మహాకాళి బోనాల జాతర
- అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్న ప్రముఖులు, భక్తులు
- భక్తజనంతో కళకళలాడిన ఆలయ పరిసర ప్రాంతాలు
- తొలిబోనం, పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి తలసాని





నవతెలంగాణ-సిటీబ్యూరో..బేగంపేట

సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి (లష్కర్) బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగా యి. పోతు రాజుల విన్యాసాలు, అమ్మవారికి బోనం, భక్తుల కోలాహలం నడుమ ఉత్సవాలు ఘనంగా నిర్వహిం చారు. ఆది వారం ఉదయం మూడున్నరకు అమ్మవారికి తొలి పూజ నిర్వహించారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ దంపతులు తొలి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ తర్వాత అమ్మవారి దర్శనం కోసం సాధారణ భక్తులకు అనుమతిచ్చారు. వేలాది మంది భక్తులు అమ్మవారికి బోనాలు, సాక, తొట్టెలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులు బోనాలతో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళల కోలాటాలు, శివ సత్తుల పూనకాలు, భక్తి భావం పరవశించగా అమ్మవారు ఆవహించి ఊగిపోయే భక్తులు, డప్పుల ధరువులు, యువతీ, యువకుల నృత్యాల కోలాహలు, ఆనందోత్సవాల మధ్య అమ్మవారి బోనం, సాక సమర్పించేందుకు వచ్చే భక్త జన సందోహంతో సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతర కన్నులపండువగా సాగింది. అమ్మవారి దర్శనం కోసం వేలాది మంది భక్తులు తరలి రావడంతో పరిసర ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా కనిపించింది. ఉదయం నుంచే క్యూ కట్టారు. దీంతో స్థానిక వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థలు క్యూలో ఉన్న భక్తులకు తాగునీరు, పులిహోరా వంటి అందించారు. భక్తులు ఓపికగ్గా లైన్‌లో ఉండి మహంకాళి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. అమ్మవారిని దర్శించుకునే భక్తుల కోసం ఆరు క్యూలైన్లను అధికారులు ఏర్పాటు చేశారు. బోనాల పండుగ నేపథ్యంలో టీఎస్ఆర్టీసీ భక్తుల సౌకర్యం కోసం నగరంలో ప్రత్యేక బస్సులు నడిపింది. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. అక్కడక్కడ భక్తుల పట్ల అత్యుత్సహం పదర్శించారు.

**మంత్రి తలసాని కుటుంబం తొలిబోనం సమర్పణ**

ఆషాడ బోనాల సందర్భంగా రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ దంపతులు సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి తొలి బోనం సమర్పించారు. ఆదివారం ఉదయం 4గంట లకు మంత్రి శ్రీనివాస్ యాదవ్ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి ఆలయం వద్దకు చేరుకోగా, ఆలయ ఈవో మనోహర్ రెడ్డి, వేద పండితులు పూర్ణ కుంభం, మేళతాళాలతో స్వాగతం పలికారు. అమ్మవారికి బోనం, పట్టు వస్త్రాలు, కుటుంబ సభ్యులతో సమర్పించి.. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాధారణ భక్తులను అనుమతించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి తలసాని సాయికిరణ్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు అత్తిలి అరుణ గౌడ్, కిరణ్మయి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మోండా మార్కెట్ డివిజన్ ఆదయ్య నగర్ కమాన్ వద్ద మంత్రి తలసాని కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో బోనాల సందర్భంగా నిర్వహించిన పూజల్లో డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, ఎమ్మెల్సీ కవిత పాల్గొనగా.. అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం వారిని మంత్రి తలసాని శాలువాతో సత్కరించారు.

**ప్రముఖుల ప్రత్యేక పూజలు**

ఉజ్జయినీ మహంకాళి బోనాల సందర్భంగా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దేవదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని బోనం సమర్పించారు. బీజేపీ జాతీయ ధ్యక్షుడు జేపీ నడ్డా, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కుటుంబ సభ్యులతో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీలు, రాజ్యసభ్యులు, స్థానిక కార్పొరేటర్లు చీర సుచిత్ర, మార్కెట్ కార్పొరేటర్లు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దేవదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌లు అమ్మవారిని దర్శించుకుని అక్కడే ఉండి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

**బంగారు బోనంతో కవిత..**

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బంగారు బోనంతో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మొండా మార్కెట్ డివిజన్ ఆదయ్యనగర్‌లో నిర్వహించిన పూజలలో పాల్గొన్నారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఆధ్వర్యంలో స్పీకర్ పద్మారావు గౌడ్, అర్చకులు ఎమ్మెల్సీకి స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాలు అనంతరం ఎమ్మెల్సీ కవిత బంగారం బోనంతో అమ్మవారిని దర్శించుకుని బోనం సమర్పించారు. ఎమ్మెల్సీతో పాటు నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి అమ్మవారికి బోనం సమర్పించారు.

**సీఎం కేసీఆర్ పీఎం కావాలి : మంత్రి మల్లారెడ్డి**

సీఎం కేసీఆర్ వచ్చే ఎన్నికల్లో దేశానికి ప్రధానమంత్రి కావాలని అమ్మవారిని మొక్కుకున్నానని కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి తెలిపారు. లష్కర్‌లోని మహంకాళి ఆలయంలో కుటుంబ సమేతంగా కలిసి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణలో అమలవుతున్న తాగు, సాగునీరును దేశవ్యాప్తంగా అమలు చేయాలంటే సీఎం కేసీఆర్ దేశానికి ప్రధానమంత్రి కావాలని ఆయన ఆకాంక్షించారు. ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలకు దేశానికే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని వివరించారు.

**తెలంగాణ ప్రజలు చల్లగా ఉండాలి : రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి**

ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆశిస్సులతో తెలంగాణ రాష్ట్రంలో త్వరలో ప్రజలకు మంచి పాలన చేసే ప్రభుత్వం ఏర్పడుతుందని కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు కిషన్ రెడ్డి అన్నారు. ఆయన కుటుంబసమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. తెలంగాణ ప్రజలను సుఖ సంతోషాలతో చల్లగా చూడాలని అమ్మవారిని కోరుకున్నట్టు చెప్పారు.

**బోనమెత్తిన సీఎల్పీ నేత సతీమణి మల్లు నందిని విక్రమార్క**

తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన మహంకాళి అమ్మవారి ఆషాఢం బోనాలు సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ శాసనసభ పక్ష నేత మల్లు భట్టివిక్రమార్క సతీమణి మల్లు నందిని విక్రమార్క బోనమెత్తుకున్నారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో అమ్మవారికి సీఎల్పీ నేత భట్టి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంజన్ కుమార్ యాదవ్, బల్మూరి వెంకట్, మెట్టు సాయికుమార్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**బోనాల పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీక : జేపీ నడ్డా**

తెలంగాణ ప్రజల సేవకు బీజేపీ ఎల్లప్పుడూ ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్టు భారతీయ జనతా పార్టీ జాతీయాధ్యక్షులు జేపీ నడ్డా ఆకాంక్షించారు. సికింద్రాబాద్ బోనాల పండుగను పురస్కరించుకుని ఉజ్జయినీ మహాకాళి దేవాలయంలో రాష్ట్ర అధ్యక్షులు మంత్రి కిషన్ రెడ్డి, డాక్టర్ లక్ష్మణ్, మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డిలతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. బోనాల పండుగ తెలంగాణ సం స్కృతికి, సాంప్రదాయాలకు ప్రతీకని, దీనిని కాపాడేందుకు బీజేపీ పార్టీ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు.

**వెయ్యికోట్లతో ఆలయ పరిసరాలు అభివృద్ధి చేయాలి : ఎమ్మెల్యే జగ్గారెడ్డి**

వెయ్యికోట్లతో ఆలయ పరిసరాలు అభివృద్ధి చేయాలనీ సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి ప్రభుత్వాన్ని కోరుతానన్నారు. లష్కర్ బోనాల పండుగ సందర్భంగా సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి దేవాలయంలో ఆయన అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**తెలంగాణ ప్రజలు సుభిక్షంగా ఉండాలి : ఈటల**

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడబోతుందని జోస్యం చెప్పారు. ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడుతుందని రాష్ట్ర బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మెన్ ఈటల రాజేందర్ అన్నారు. ఈ మేరకు ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని ఆయన దర్శించుకున్నారు. తెలంగాణ ప్రజలు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్టు తెలిపారు.

**నేడు భవిష్యవాణి..**

అమ్మవారి బోనాల ఉత్సవాల్లో భాగంగా సోమవారం రంగం కార్యక్రమం జరగనుంది. రంగంలో స్వర్ణలత పచ్చికుండపై నిలుచుని భవిష్యవాణిని వినిపిస్తుంది. ఉదయం 9.30 గంటలకు అమ్మవారి గర్భగుడికి ఎదురుగా మాతంగేశ్వరీ దేవాలయం ఎదుట ఆమె భవిష్యవాణి వినిపించనున్నారు.



## వైద్య కళాశాల మంజూరైన సందర్భంగా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



ముఖ్యమంత్రి కేసీఆర్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ప్రభుత్వ వైద్య కళాశాల మంజూరు చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం ఎమ్మెల్యే కేపి వివేకానంద్‌ని అఖిలభారత వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎత్తరి మారయ్య, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు దూదిమెట్ల సోమేష్ యాదవ్, జీహెచ్ఎంసీ కుత్బుల్లాపూర్ డివిజన్ల అధ్యక్షులు పుప్పాల భాస్కర్, చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని అసెంబ్లీ వేదికగా పలు మార్లు సీఎం కేసీఆర్ గారి దృష్టికి తీసుకెళ్ళినందుకు వారు ఎమ్మెల్యే కేపి వివేకానంద్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు. మలేషియా నుండి తీసుకువచ్చిన కుమారస్వామి విగ్రహాన్ని ఎమ్మెల్యేకి బహుకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## వంగవీటి మోహన రంగా పేదల పక్షపాతి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



దివంగత వంగవీటి మోహన రంగా పేదల పక్షపాతి అని కుత్బు ల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. ఆదివారం గాజులరా మారం డివిజన్ పరిధిలోని హెచ్ఏఎల్ కాలనీ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన వంగవీటి మోహన రంగా గారి 10 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్యే కేపి వివేకానంద్ బీఆర్ఎస్ పార్టీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు తోట చంద్రశేఖర్ రావు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ, స్థానిక కార్పొరేటర్ రావుల శేషగిరి రావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ వంగవీటి మోహన రంగా ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, డివిజన్ల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

## భూ కబ్జాలను గాలికి వదిలేశారు



- సీపీఐ కార్యదర్శి ఉమా మహేష్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఓ 59 ద్వారా ప్రజలు దరఖాస్తు చేసుకొంటే ప్రజలకు పట్టాలు ఇస్తామని ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం ఆశలు చూపి, దరఖాస్తు చేసుకున్న వారికి అశాస్త్రీయంగా లక్షల రూపాయలు కట్టాలని నోటీసులు పంపించడం దారుణమన్నారు. వెంటనే ఇలాంటి నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కుత్బుల్లాపూర్ నియోజక వర్గ సీపీఐ కార్యదర్శి ఈ. ఉమా మహేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం మగ్దూం నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. పదుల ఎకరాల ప్రభుత్వ భూములు కబ్జాలు అవుతున్నాయని సీపీఐ మొత్తుకుంటుంటే పట్టించుకోని అధికారులు, నేడు సుమారు 20,30 సంవత్సరాల నుండి నివసిస్తున్న వారి ఇండ్లను జి ఓ 59 పేరుతో డబ్బులు కట్టలేదని కూల్చివేస్తామని బెదిరించడం అధికారులకు తగదని హెచ్చరించారు. సర్వే నెంబర్ 306,342,359,181 లాంటి ప్రభుత్వ భూముల్లో సుమారు 2500 నుండి 3000 గృహాలు అక్రమంగా వెలిసాయని స్వయంగా అధికారి తెలిపి కూల్చేవెయ్యమంటే, కూల్చివేయ్య కుండా ఉండడం వెనుకాల అధికారులకు ఏమి ఉందని ప్రశ్నించారు. గత కొద్ది సంవత్సరాలుగా ఉంటున్న ఇండ్లను ఏ రాష్ట్ర అధికారి కూల్చివేయ్యమని ఆదేశాలు ఇచ్చారో చెప్పాలని ఇక్కడి అధికారులు ఎవ్వరి ఆదేశాలు పాటిస్తారో ఎవ్వరి వెనుకాల ఉంటారో తెలుస్తోందన్నారు. ఇప్పటికైనా ఇలాంటి చర్యలు తీసుకోకుండా ముందుగా కబ్జాలు అవుతున్న స్థలాలను కాపాడి, ఇండ్లను కూల్చివేసి, చిత్తశుద్ధి నిరూపించు కోవాలని హితువు పలికారు. లేని పక్షంలో మరో ఉద్యమం త ప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కోశాధికారి సదానంద, శాఖ కార్యదర్శులు సహదేవ్ రెడ్డి, సుధాకర్, సహాయ కార్యదర్శి నర్సయ్యలు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు అరికట్టేందుకు చర్యలు

- ఎమ్మెల్యే కేపి వివేకానంద్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట-కుత్బుల్లాపూర్



సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రతి ఆదివా రం పది గంటలకు పది నిమిషాలు కార్యక్రమంలో భాగంగా ఆదివారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపి వివేకానంద్ చింత ల్‌లోని తన కార్యాలయం వద్ద భాగస్వాములయ్యారు. ఇందులో భాగంగా తన కార్యాలయ పరిసరాల్లో పేరుకు పోయిన నీటిని శుభ్రపరచడంతో పాటు, పూల కుండిలతో పాటు, వివిధ పాత్రల్లో నిండిన నీటిని శుభ్రపరిచారు. ఎక్కడైనా పేరుకుపోయిన వాననీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సుచి శుభ్రంతో కూడిన ఆహారం తీసుకోవాలని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, ప్రజలు ఈ కార్యక్రమంలో భాగస్తులై తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజి ఏఈ ఉమారాణి, సిబ్బంది తోపాటు కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నియోజకవర్గ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు, డివిజన్ల అధ్యక్షులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యునైటెడ్ వే ఆఫ్ సేవాసంస్థకు కృతజ్ఞతలు తెలిపిన కార్పొరేటర్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని జయశంకర్ కాలనీలో యునైటెడ్ వేఆఫ్ హైదరాబాద్ సంస్థ వారు, శనివారం సాయంత్రం నిర్వహించిన సమ్మర్ క్యాంప్ ముగింపు, ఇతర కోర్సులు ప్రారంభ వేడుకలకు, ముఖ్యఅతిథిగా డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ వారు నిర్వహిస్తున్న ఉచిత కోర్సుల గురించి వివరించడం సమ్మర్ క్యాంప్‌లో వివిధ కోర్సులలో శిక్షణ పొంది అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులకు కార్పొరేటర్ చేతులమీదుగా బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ వారు ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నరన్నారు. ఇప్పుడు ఈ సంస్థ తరపున పిల్లలకు కంప్యూటర్ విద్య, స్పోకెన్ ఇంగ్లీష్, మహిళలకి టైలరింగ్ వంటి మొత్తం పదకొండు రకాల కోర్సులను ఉచితంగా అందిస్తునందుకు సంస్థ వారికి కృతజ్ఞతలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సమ్మారెడ్డి, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ మ్యానేజర్ కె.రాములు, కరీమ్, షేక్ బీబీ, డాక్టర్ సౌమ్య, బ్రహ్మ కుమారిస్ శ్రీకాంత్, పోశెట్టిగౌడ్, సాయిగౌడ్, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ సిబ్బంది ఎం.కృష్ణ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బోనాల పండుగ ఉత్సవాలలో పాల్గొన్న కేఎం ప్రతాప్

- ఘనంగా తొట్టెల ఊరేగింపు
- అమ్మవారికి ప్రత్యేక పూజలు
- దర్శించుకున్న ప్రముఖులు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని దుండిగల్ గ్రామంలో నిర్వహించినటువంటి ఆషాడమాస బోనాల పండుగకు, ఏడుగుళ్ల దేవస్థాన కమిటీ వారి ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజ కార్యక్ర మాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, కె.యం ప్రతాప్‌ని ఆలయ కమిటీ వారు సత్కరించారు. ప్రతాప్ మాట్లాడుతూ... దుండిగల్ గ్రామ ప్రజలకు ,కు త్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు ఆషాడ మాస బోనాల పండుగ శుభాకాంక్షలను తెలియజేశారు. గ్రామదేవతలు, ప్రజలను చల్లగా చూడాలని కోరానన్నారు. ఈ కార్యక్ర మంలో మాజీ ఎంపీపీ, ఆలయ కమిటీ చైర్మెన్ చినంగి వెంకటేశం, ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు బాల్ రెడ్డి, ఏ. మల్లేష్, డి గోపాల్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీ శత చండీయాగ మహా పూర్ణాహుతి మహోత్సవ వేడుకలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం రంగారెడ్డి నగర్ డివిజన్‌లోని గాంధీనగర్ పారిశ్రామిక వాడలో గల పవర్ టెక్ ట్రాన్స్ఫార్మర్స్ కంట్రోల్ సిస్టమ్స్ పరిశ్రమలలో 7 న (ఆషాడ మాస బహుళపంచమి) శుక్రవారం ప్రారంభమైన శ్రీ శత చండీయాగ మహా పూర్ణాహుతి మహోత్సవ వేడుకలు పరిశ్రమలో ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. పవర్ టెక్ పరిశ్రమ అధినేత, గాంధీనగర్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు సభ్యులు పైడిపల్లి స్వామి గౌడ్, పైడిపల్లి స్వప్న దంపతుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజలకు కుటుంబ సభ్యులతో పాటు పరిసర ప్రాంతాల, పారిశ్రామిక వేతలు, కార్మికులు, పెద్ద సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా పైడిపల్లి స్వామి గౌడ్ మాట్లాడుతూ అమ్మవారి కృపాకటాక్షలతో అందరూ యోగక్షేమాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పవర్ టెక్ పరిశ్రమ యాజమాన్యం సాయితేజ గౌడ్, భరత్ గౌడ్, సందీప్ గౌడ్, తోపాటు పరిసర ప్రాంత కాలనీవాసులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివారం పది నిమిషాలు కేటాయిస్తే ఆరోగ్యానికి రక్షణ

- జీహెచ్ఎంపీ ఎంటమాలజి సిబ్బంది

నవతెలంగాణ-కూకట్‌పల్లి



ప్రతి ఆదివారం ప్రతి కుటుంబంలో ఉదయం 10 గంటలకు పది నిముషాలు కేటాయించి ఇంటి పరిసరాలను శుభ్ర పరుచుకోవాలని ,తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ సూచనల మేరకు, కూకట్‌పల్లి సర్కిల్, ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో, పీజేఆర్ కాలనీలో జీహెచ్ఎంసీ ఎంటామాలజి సూపర్ రైజర్ డి.నరసింహులు, ఎంట మాలాజి సిబ్బందితో కలిసి ,ప్రతి ఆదివారము ఉదయ ము 10 గంటలకు 10 నిమిషాల పాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలకు ఆవాసాలుగా ఉన్నటువంటి నీటి నిల్వలను తొలగించాలనీ, అదేవిధంగా ఇంటి పరిసరాలలో ఉండే నీటి నిల్వలు అనగా, నీటి సంపులు, డ్రమ్ములు, పూల కుండీలు, టైర్లు, కూలర్స్ , కుండలు, నల్లా గుంతలు ప్లాస్టిక్ సెంటెక్సు ,రిఫ్రిజిరేటర్ బ్యాక్ సైడ్ కింద ఉండే ప్లాస్టిక్ డబ్బా, మొదలగు వాటిని వారానికి ఒకసారి తనిఖీలు చేసుకోవాలన్నారు. పాత నీటిని తొలగించి, మళ్ళీ నీటిని నింపుకుని వాటిపైన ఎప్పుడు మూతలు పెట్టుకోవాలని, దోమ కాటు ద్వారా మనకు డెంగ్యూ ఫీవర్, మలేరియా, చికెన్ గునియా, ఫైలేరియా, మెదడువాపు, జీంక వైరస్, మొదలగు వ్యాధులు వస్తాయి. దోమల నివారణకు జీహెచ్ఎంసీ ఎంటమాలాజీ సిబ్బంది సూచనలు పాటిస్తూ, ప్రతి కుటుంబంలో ప్రతి ఆదివారము ఉదయము 10 గంటలకు 10 నిమిషాల పాటు కేటాయించి, ప్రజలందరూ ఎవరికి వారు ప్రతి ఇంట్లో నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిజేఆర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

## షాపూర్ నగర్‌లో బోనాల ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే...



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సూరారం 129 డివిజన్ పరిధిలోని షాపూర్ నగర్ రైతు బజార్ పోచమ్మ ఆల యం వద్ద బోనాల ఉత్సవంలో ఆదివా రం ఎమ్మెల్యే కేపి వివేకానంద్ గారు ము ఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు సోమేశ్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, రుద్ర అశోక్, పోలె శ్రీకాంత్, సీనియర్ నాయకులు సదానంద్, ఎత్తరి మారయ్య, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జీడిమెట్లలో బోనాల పండుగ ఉత్సవాలు

- పాల్గొన్న నర్సారెడ్డి భూపతిరెడ్డి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, జీడిమెట్ల 132 డివిజన్‌లోని జైరాం నగర్‌లో బోనాల పండుగ సందర్భ ంగా టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యద ర్శి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూప తిరెడ్డి , ఆదివారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి భూపతిరెడ్డి మాట్లాడుతూ అమ్మ వారి దయతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, కలిసి మెలిసి ఉండాలని ఆకాంక్షించారు .ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షులు బండి శ్రీనివాస్ గౌడ్, 131 డివిజన్ ఇంచార్జ్ ఇరుగు రాధాకృష్ణ, మిద్దెల సీతారాం రెడ్డి, రాకేశ్, దుర్గా ప్రసాద్, లక్ష్మణ్, బండి సాయి, నరేశ్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు

## శ్రీ జగన్నాథ రథయాత్ర సందర్భంగా ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, జీడిమెట్ల 132 డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ శ్రీ కృష్ణ మందిర్ వద్ద శ్రీ జగన్నాథ రథయాత్ర సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కేపి వివేకానంద్ ముఖ్యఅతి థిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు సోమేశ్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, రుద్ర అశోక్, పోలె శ్రీకాంత్, సీనియర్ నాయకుడు తెలంగాణ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సాయికిరణ్ గౌడ్ జన్మదిన వేడుకలు

తెలంగాణ-జగద్గిరిగుట్ట



కుత్బుల్లాపూర్ నియోజక వర్గం చింతల్ డివిజన్ బీఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షులు సాయికిరణ్ గౌడ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరి గాయి. నర్సాపూర్ చాకరిమెట్ల హనుమాన్ దేవాలయంలో జరిగిన వేడుకలకు శాసన మండలి విప్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో కలిసి హాజరై ఆంజనేయ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్సీ ఆశీర్వాదం తీసుకున్నారు. శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మంత్రి సత్యనారాయణ, రషీదా మహ్మద్ రఫీ, చింతల్ డివిజన్ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు బాల్ రెడ్డి, సోషల్ మీడియా అధ్యక్షులు వంశీకృష్ణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఉచిత వైద్య శిబిరం అభినందనీయం

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల 132 డివిజన్ పరిధిలోని అయోధ్య నగర్‌లో మల్లారెడ్డి నారా యణ మల్టీ స్పెషలిటీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో, ఉచిత వైద్య శిబిరాన్ని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత సింహారెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరాన్ని డివిజన్ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న యజమాన్యానికి, డాక్టర్లకు, సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బస్తీ అధ్యక్షులు యేసు, మల్లేష్ గౌడ్, అంజయ్య, వీరేశం, జ్ఞానేశ్వర్, సింహాద్రి, కృపాల్ యాదవ్, ఉమేష్ సింగ్, వనజ, వెంకట్, క్రాంతి, అభిద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

చెరుకుపల్లి భరత సింహారెడ్డి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, జీడిమెట్ల 132 డివిజన్ పరిధిలోని వినాయక నగర్‌లో రోడ్డు, డ్రైనేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని బస్తీ వాసులు తెలియజేయడంతో బస్తీ వాసులతో కలిసి బస్తీలో పర్యట ించి సమస్యల యొక్క వివరాలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో అంజయ్య సింహాద్రి, వీరేశం, వనజ, అభిద్, వెంకట్, జయంత్, నార్లకంటి దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

## చెట్ల కొమ్మలను కొట్టేందుకు నేడు విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-కూకట్‌పల్లి

నేడు కూకట్‌పల్లి సర్కిల్ ఆల్విన్ కాలని సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం పై ఆల్విన్ కాలనీ సబ్ స్టేషన్ ఏఈ. శరత్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఇచ్చిన సమాచారం మేరకు, 11 కే.వి ఫీడర్ నిర్వహణలో భాగంగా కరెంట్ తీగల పై పడి ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు గాను ఈ రోజు కూకట్‌పల్లి మైత్రినగర్ ఇండస్ట్రియల్ ప్రాంతం, విజ్ఞాన్ పూరి కాలని, ఏవీబీ పురం, శక్తి పురం ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉంటుందన్నారు. అలాగే 11 కే వి లైన్ పాపి రెడ్డి నగర్ ఫీడర్ పరిధిలో, మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు, హనుమాన్ నగర్, పాపిరెడ్డి నగర్, రామకృష్ణ నగర్, ప్రగతి నగర్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతున్నందున చింతిస్తున్నట్టుగా ఆల్విన్ కాలని సబ్ స్టేషన్ ఏ ఈ శరత్ బాబు ప్రకటించారు.



## ఏడుగుండ్ల బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి



నవతెలంగాణ- మేడ్చల్

ఆషాడమాస బోనాల జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మేడ్చల్ పట్టణంలోని ఎడుగుండ్ల బోనాల ఉత్స వాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి అమ్మవార్లను దర్శించుకుని తొట్టెల ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ నర్సింహ రెడ్డి, కౌన్సిలర్లు కౌడే మహేష్, మర్రి శ్రీనివాస్ రెడ్డి, ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు నవీన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అధిక రుసుం చెల్లించాలని నోటీసులు ఇవ్వడం భావ్యం కాదు

- మేడ్చల్ జిల్లా ట్రస్మ అధ్యక్షులు శివరాత్రి యాదగిరి
- శంభీపూర్ రాజుకు వినతిపత్రం అందజేత



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో జీవో 59 ఇటీవలే ప్రభుత్వం ప్రకటించింది. దీంతో జీవో 59 దరఖాస్తు చేసుకున్నామని మేడ్చల్ జిల్లా ట్రస్మ అధ్యక్షులు శివరాత్రి యాదగిరి తెలిపారు. జీవో 59 వచ్చినప్పుడు 2014 రేట్ల ప్రకారమే అని తెలపడం వల్ల దరఖాస్తు చేసుకున్నామన్నారు. ప్రస్తుతం 2022 ప్రకారం అధిక రేట్లు రేట్లు వేసి నోటీసులు ఇవ్వడం సమంజసం కాదని మేడ్చల్ ట్రస్మ అధ్యక్షులు శివరాత్రి యాదగిరి ప్రైవేటు పాఠశాలల బృందంతో కలిసి శాసనమండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. మురికివాడల ప్రాంతాల్లో గల ప్రైవేట్ పాఠశాలలకు 10 శాతం రుసుముతో రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం రావడం కోసం ఉద్యమ సమయంలో జేఏసీ ఏర్పాటు చేసి, ప్రజలను చైతన్యవంతులను చేస్తూ అనేక పోరాటాలు ఉద్యమాలు చేశామని ఎమ్మెల్సీతో చెప్పా రు. తమపై అధిక భారాలు మోపడం వల్ల చాలా ఇబ్బందు లు ఎదుర్కొంటున్నామని ఆయన దృష్టికి తీసుకువ చ్చారు. తక్షణమే 10 శాతం రుసుముతో రెగ్యులరైజేషన్ చేసే విధంగా చూడాలని కోరారు. ఈ సందర్భంగా శంభీపూర్ రాజు మాట్లాడుతూ ఈ విషయాన్ని సంబంధిత మంత్రులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వీలైనంత త్వరగా పరిష్క రించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

## బోనం సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక



- సర్పంచ్ సింగం ఆంజనేయులు

నవతెలంగాణ-శామీర్‌పేట

బోనం తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని లక్ష్మాపూర్ సర్పంచ్ సింగం ఆంజనేయులు అన్నారు. మూడుచింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో సర్పంచ్ సింగం ఆంజనేయులు పాలకవర్గం ఆధ్వర్యంలో ఆదివారం బోనాల పండుగ అత్యంత భక్తిశ్రద్దలతో నిర్వహిం చారు. మహిళలు నూతన వస్త్రాలు ధరించి బోనాలు ఎత్తుకుని డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలను దర్శించుకుని నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అయితే శివసత్తుల పునకాలు, పోతరా జుల విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ కటికెల వైద్యనాద్, వార్డుసభ్యులు, మాజీ సర్పంచ్ సింగం సత్తయ్య, గ్రామ పెద్దలు సింగం కృష్ణమూర్తి, మాడబోయిన సత్యనారాయణ, కిసరి నర్సింలు, గౌటే గోపాల్, యువ నాయకులు క్యాతం మధుకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## యోగ చేయడంతో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారు


- బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావు

నవతెలంగాణ- కేపీహెచ్‌బీ



నిత్యం యోగ చేయడంతో సంపూర్ణ ఆరోగ్యవంతు లుగా ఉంటారని బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ పగుడా ల శిరీష బాబురావు అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని కూకట్‌పల్లి ద్వాదశ జ్యోతిర్లింగ శివాలయంలో ఏర్పాటు చేసిన పత్రీజీ మహిళా చైతన్యం కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ యోగ చేయడం వల్ల శ్వాసపై ధ్యాస కలుగుతుందన్నారు. మానసికంగా శారీరకంగా ఉన్న ఒత్తిడిని తగ్గించి ప్రశాంతంగా వుండేట్లు చేస్తుందని తెలిపారు. యోగా అనేది ఒక శక్తివంతమైన మైండ్‌ఫుల్‌నెస్ సాధన అని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంతో నిండు ప్రాణం బలి



నవతెలంగాణ- మేడ్చల్

విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంతో నిండు ప్రాణం బలైన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని కిష్టాపూర్ 4వ వార్డులోని ఓ మామిడి తోటలో విద్యుత్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి రాహుల్ తన బంధువు ఆంజి (21) సహాయంతో స్తంభం పైన ఫ్యూజ్ సమస్యను పరిష్కరించే సమయంలో ఒక్కసారిగా కరెంటు సరఫరా కావడంతో విద్యుత్ షాక్ గురైన ఆంజి, స్థానిక ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మృతి చెందాడు. కాగా రాహుల్ మాట్లాడుతూ తన్ను ఎల్‌సీ తీసుకున్న విషయం స్థానిక ఆపరేటర్‌కు సమాచారం ఇచ్చినట్టుగా తెలిపాడు. ఎల్‌సీ తీసుకొని విద్యుత్ మరమ్మత్తులు చేపట్టాల్సింది ఉండగా, సదరు ఉద్యోగి రాహుల్ ఎల్‌సీ తీసుకున్న విషయంలో తనకు ఎలాంటి సమాచారం లేదని లైన్ మెన్ జయరాం చెప్పారు. ఇదే విషయమై ఏఈ. శశిధర్ రెడ్డిని వివరణ కోరే ప్రయత్నంలో భాగంగా ఫోన్ చేయగా ఎన్నిసార్లు ఫోన్ చేసినా మొబైల్ లిఫ్ట్ చేయలేదు.

## పరిమళ రాగాలు

నవతెలంగాణ-కల్చరల్



పుణ్య భూమి నాదేశం నమో నమామి పాటను ఉత్తేజంతో పాడి పరిమళ ప్రేక్షకులను ముగ్ధులను చేశారు. శ్రీ త్యాగరాయ గాన సభ ప్రధాన వేదిక పై వరస పరిమళ ఫౌండేషన్ నిర్వహణలో విఖ్యాత గాయకుడు ఎస్.పీ.బాల సుబ్రహ్మణ్యం జయంతిని పురస్కరించుకొని పరిమళ, తదితరులులతో కలసి పలు గీతలు అలపించారు. వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు శాలువా మలలతో డాక్టర్ కొండలరావుని పరిమళను సత్కరించారు

## గుండ్లపోచంపల్లి మున్సిపాల్టీలో బోనాల ఉత్సవాలు

నవతెలంగాణ- మేడ్చల్



గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో పరిధిలోని లక్ష్మీ నగర్ కాలనీలో పోచమ్మ తల్లి బోనాలు ఉత్సవాలు ఆది వారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయా నికి భక్తులు అధిక సంఖ్యలో బోనాలను డప్పు చప్పుడ్లతో ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్ ముదిరాజ్ మీడియాతో మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో వర్షాలు బాగా కురిసి పాడి పంటలు భాగ పండి రాష్ట్ర ప్రజలు, గుండ్లపోచంపల్లి ప్రజలను చల్లగా చూడాలని అమ్మవారిని వెడుకునట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు ఆనందోత్సాహాల మధ్య బోనాల సంబరాలు ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుండ్లపోచంపల్లి కౌన్సిలర్ సాయి పేట శ్రీనివాస్ యాదవ్,బిజెపి సీనియర్ నాయకులు రవీందర్ గౌడ్, కావేరి శ్రీధర్ ముదిరాజ్, విక్రమ్ ముదిరాజ్, సుంకు నవీన్ ముదిరాజ్, బన్నీ, శివ, చరణ్, దొరబాబు, వినోద్, కిషోర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం కార్యక్రమాన్ని మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు పన్నాల హరీష్ రెడ్డి సందర్శించారు. ఈ వైద్య శిబిరంలో అనేక ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షలు, వారికి కావలసిన ఉచిత మందులు ఉచితంగా ప్రజలకు అందించారు. ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్‌ని భారతీయ జనతా పార్టీ తరపున హరీష్ రెడ్డి, అభినందించారు. ఈ ఉచిత వైద్య శిబిరం కార్యక్రమాన్ని కాలనీ ప్రజలు వినియోగించుకోవాలని కోరిన ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ బిజెపి నాయకులు, సీనియర్ నాయకులు, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జమ్మిగడ్డలో జ్ఞానమాల కార్యక్రమం



**నవతెలంగాణ-కాప్రా**

కాప్రా సర్కిల్ జమ్మి గడ్డలో 58వ వారం జ్ఞానమాల కార్యక్రమం సందర్భంగా భారతరత్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ భీమ్ రావు అంబేద్కర్ చిత్రపటానికి రాజ్ కుమార్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం ప్రతినిధి తాడూరి గగన్ కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగ పుస్తకం ప్రతి ఇంట్లో ఉండాలని, తప్పకుండా ప్రతి ఒక్కరూ చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నరసిం హ చారి, రవి నాయక్, నాగేష్, చిన్నారావు, నరేందర్ రావు, కిరణ్ పాల్గొన్నారు.

## వరహాదేవి నవరాత్రి ఉత్సవాల ముగింపు



**నవతెలంగాణ-కాప్రా**

మీర్పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్‌లోని తిరుమల్ నగర్ శ్రీ నల్ల పోచమ్మ దేవాలయంలో వరహా దేవి నవ రాత్రి ముగింపు ఉత్సవాలను నిర్వ హించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జేరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొ రేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు బ్రహ్మచారి, బీఆర్ఎస్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర రెడ్డి, కాటేపల్లి రవీందర్‌రెడ్డి, తిరుమలనగర్ వెల్ఫేర్ అసోసి యేషన్ అధ్యక్షుడు మల్లే ష్ గౌడ్, దాసు, శ్రీనివాస్, స్థానిక భక్తులు, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆలయాల్లో ప్రత్యేక పూజలు

**నవతెలంగాణ-కంటోన్మెంట్**

బోయిన్‌పల్లి బాపూజీనగర్ శ్రీనల్ల పోచమ్మ దేవాలయం వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శ్రీ గణేష్ ఫౌండేషన్ చైర్మెన్ శ్రీ గణేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సందర్భంగా ఆలయంలో నిర్వహించిన వివిధ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అమ్మ వారి ఆశీస్సులు భక్తులు అందరి పైనా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ కమి టీ సభ్యులు బండి రాజు, నర్సింగ్ రావు, నాగ రాజు, లక్ష్మణ్, శరత్‌తో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. అనంతరం హెూం డా డివిజన్ రెజిమెంటల్ బజార్ గండిమైసమ్మ దేవాలయంలో ఐదవ వార్డు గాంధీనగర్ అమ్మవారి ఆలయాల వద్ద జరిగిన బోనాల కార్యక్రమాల్లో కూడా పాల్గొని



ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు శ్రీ గణేష్‌ని సన్మానించారు.

# చినకమైనలో క్రిశాంక్ బస్తీనిద్ర



**నవతెలంగాణ-కంటోన్మెంట్**

తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ మన్నె క్రిశాంక్ కంటో న్మెంట్ 7వవార్డులోని చిన్నక మెలలో 16వ బస్తీ నిద్ర కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్య క్రమంలో పలువురు స్థానికులు పాల్గొని తమ సమస్యలను ఆయనకు తెలిపారు. ఈ కార్యక్ర మంలో కంటోన్మెంట్ మాజీ బోర్డ్ సభ్యుడు పి.శ్యామ్‌కుమాం పాల్గొన్నారు. ప్రధానంగా బస్తీలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు అధికారుల నిర్లక్ష్యం కారణంగా డ్రయినేజీ సమస్య రోడ్లు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లుతెలిపారు. ఈ సందర్భంగా క్రిశాంక్ మాట్లా డుతూ మంత్రి కేటీఆర్ కంటోన్మెంట్‌లోని పౌరభూములును రాష్ట్రానికి అప్పగించాలని భారత ప్రభు త్వాన్ని కోరినట్లు, అలాగే స్థానికులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని క్రిశాంక్ తెలిపారు. అనంతరం స్థానికు లతో కలిసి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో జాన్, వే ణు, సరిత, విజయ్ కుమార్, సాయి, పాల్గొన్నారు.

## 'అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరికలు

**కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి**

**నవతెలంగాణ-జవహర్‌నగర్**

తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిని చూసి దేశమంతా సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటుందని కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. జవహర్ నగర్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన 100మంది కార్యకర్తలు మేయర్ మేకల కావ్య ఆధ్వర్యంలో మంత్రి సమక్షంలో ఆదివారం బోయినపల్లి క్యాంపు కార్యాలయంలో బీఆర్ ఎస్‌లో చేరారు. మంత్రి మల్లారెడ్డి మాట్లా డుతూ సీఎం కేసీ ఆర్ చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రతి పక్షాలకు భయపడి పోతున్నాయని, బీఆర్ఎస్ లోకి వలసలు పెరిగాయని, పేద ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలే ఇందుకు నిదర్శనమన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జిట్టా శ్రీవాణి శ్రీనివాస్‌రెడ్డి, లావణ్య సతీష్ గౌడ్, కోఆప్షన్ సభ్యురాలు



శోభారెడ్డి, జిల్లా నాయకులు మేకల అయ్యప్ప, యువజన విభాగం అధ్యక్షుడు భార్గవ్రామ్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణులకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం

**గత ప్రభుత్వాలు బ్రాహ్మణుల సంక్షేమాన్ని పట్టించుకోలేదు : ఎమ్మెల్సీ కవిత**

**నవతెలంగాణ-చైతన్యపురి**

బీఆర్ఎస్ ప్రభుత్వం బ్రాహ్మణులకు ఎంతో సహాయ సహ కారాలు అందిస్తుందని, గత ప్రభుత్వాలు బ్రాహ్మణుల సంక్షే మాన్ని పట్టించుకోలేదని ఎమ్మెల్సీ కవిత అన్నారు. సోమవారం సరూర్‌నగర్ స్టేడియంలో బ్రాహ్మణ గర్జన పేరుతో అధ్యక్షుడు వన్నంపల్లి జగన్మోహన్ శర్మ, ప్రధాన కార్యదర్శి తులసి శ్రీని వాస్, కోశాధికారి మునిపల్లె శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ కవిత హాజరయ్యారు. కవిత మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా బ్రాహ్మ ణులు ఉద్యమానికి ఎంతో అండగా నిల బడ్డారన్నారని, బడిబం దు అన్ననాడే గుడి బందు పెట్టి ఉద్య మానికి అండగా ఉన్నార న్నారు. అలాంటి వారిని ప్రభుత్వం మర్చిపోదు అని వారిని కడుపులో పెట్టి చూసుకుంటామన్నారు. అందుకే వారికి ఎన్నో కార్యక్రమాలు చేస్తుందన్నారు. ధూపదీప నైవేద్యానికి కూడా రూ.10000లు అందజేయడం జరుగుతుందన్నారు. రూ.6000 ఉన్న గుడులకు 8000 గుడులు విస్తరింపడం చేయడం జరిగింది. 2242 కోట్ల తో గుడులకు డబ్బులు ఇచ్చి ఆ గుడులను కాపాడు కుంటున్నామన్నారు. 1200 కోట్లతో యాదాద్రి గుడిని, 500 కొండగట్టు అంజనేయ స్వామి గుడిని కేటాయిస్తూ అభివద్ధి చేయడం జరిగింది అన్నారు. 1600 గుడులకు పదివేల నుంచి 5 లక్షల వరకు ఒక గుడికి బోనా లకు కేటాయించడం జరిగిందన్నారు. భవిష్యత్తుని దష్టిలో పె ట్టుకొని వందలాది మందిని ఉద్యోగాలను ఉద్యోగాలను తయారు చేసే విధంగా స్టడీని ప్రోత్సహించడం జరుగు తుం ది. విదేశీ విద్యలో కూడా 20 లక్షలు ఇచ్చి ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. 780 మంది విద్యార్థులు లబ్ధి పొందినారు. ఫీజు రియంబర్స్మెంట్ కూడా అన్ని కళాశాలలో కూడా అప్లై అవుతున్నది, వేరే రాష్ట్ర విద్యార్థిలకి కూడా( ఐఐ టీ) విస్తరింప



చేసేందుకు కషి చేస్తాం అన్నారు. రాజకీయ పరంగా అత్యంత చైతన్యం కలిగిన సమూహం కలిగిన మీరు, ఎంత పెద్ద కింగ్ మేకర్ అయినా బ్రాహ్మణ పాత్ర అందులో ఉంటుందన్నారు. అందరి రక్షణ కోసం ఉన్న ప్రభుత్వం ఉందన్నారు. వారి సంక్షేమాన్ని దష్టిలో ఉంచుకొని బ్రాహ్మణ భవ నం కోసం తొమ్మిది ఎకరాల కేటాయించి 12 కోట్ల రూపా య ల నిధులను కేటాయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్ర మంలో శ్రీ శ్రీ సత్యానంద భారతీ స్వామి, ఎమ్మెల్సీ వాణీదేవి, టీఎస్ఐడీ సి చైర్మన్ వేణుగోపాలాచారి, ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, శ్రీధర్ బాబు, మాజీ ఎంపీ లక్ష్మీకాంత్ రావు, తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ రమణా చారి, మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు, ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, మా జీ ఎమ్మెల్యే ఎన్ వీ ఎస్ ఎస్ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవిప్రసాద్, గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, రామ్మోహన్, పీవీ ప్రభాకర్ రావు, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ, కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి, వనం జ్వాలా నరసింహ రావు, సినీ నటుడు కాదంబరి కిరణ్, పాల్గొన్నారు.

# కార్నల్ దంత వైద్యశాల ప్రారంభం

**నవతెలంగాణ-కాప్రా**

కార్నల్ దంత వైద్యశాల, అశోక హియరింగ్ క్లినిక్ విజన్ థెరఫీని ఆదివారం ఏఎస్ రావు నగర్ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. అశోక రెహబ్ ప్రైవేట్ లిమిటెడ్ 6వ బ్యాచ్ ఈసీఐఎల్ దగ్గరలోని శివాలయం గుడి ఎదురుగా ఆదివార ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజలకు అందు బా టుధరలో నాణ్యమైన వైద్యాన్ని అందించి, అభివృద్ధి చెందాల ని కార్పొరేటర్ ఆకాంక్షిం చారు. నిర్వాహకులకు శుభాకాం క్షలు తెలిపారు. నిర్వాహకులు డైరెక్టర్ డాక్టర్ రాహుల్ గుల్వే, డైరెక్టర్ డాక్టర్ కిరణ్ కుమార్ గుల్వే, డైరెక్టర్ సచిన్ కుమార్ గుల్వే, డాక్టర్ నవీత గుల్వే, డాక్టర్ శ్వేతా గుల్వే ఈ కార్య క్రమానికి ముఖ్య అతి థులుగా బీ.ఎన్. అహ్మద్ అలీ ఖాన్, బండారు నర సింహారెడ్డిలు హాజరయ్యారు.



## ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌నకు విశేష స్పందన

**నవతెలంగాణ-నేరేడ్‌మెట్**

మచ్చ బొల్లారం ఏంఫర్ సేవ ప్రాంగణంలో ఆది వా రం ఓజోన్ ఆస్పత్రిలో, జన రిక్ మెడికల్ స్టోర్స్ ఆధ్వ ర్యం లో ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌కు మంచి స్పందన లభిం చింది. ఓజోన్ హాస్పిటల్ చైర్మెన్ సత్య సాయి ప్రసాద్ మేనే జింగ్ డైరెక్టర్ దీప్తి గడ్డం రఘునాథ్ రెడ్డి సూపరిటెండెంట్ సౌజన్యంతో గోపు రమణారెడ్డి సహకారంతో సోలిస్ కంటి ఆస్పత్రి వారిచే ఈ క్యాంపు నిర్వహించారు. ఈ శిబిరంలో బిపి, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. నిర్వాహకులు సత్యాత్మానంద, మేనేజర్ జగన్మోహన్ , డాక్టర్ కరుణ శ్రీ, డాక్టర్ మంగారెడ్డి, డాక్టర్ మోహన్, డాక్టర్ రాములు, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాలలో ప్రత్యేక పూజలు

**నవతెలంగాణ-కంటోన్మెంట్**

బోనాలు పండగ సం దర్భంగా ఆదివారం తెలం గాణ రాష్ట్ర ఖని జాభివృద్ధి సంస్థ చైర్మన్ శ్రీ మన్నె క్రిశాంక్ కంటో న్మెంట్ నియో జకవర్గం లో పలు దేవాలయాల్లో ప్ర త్యేక పూజలు నిర్వ హించారు. రెజిమెం టల్‌లోని గండి మైసమ్మ దేవాలయం శివాజీ నగర్‌లోని శ్రీ డొక్కాలమ్మ దేవాలయం బాపుజీ నగర్ లోని, శ్రీ నల్ల పోచమ్మ షిక్ విలేజ్‌లోని శ్రీ ఎల్లమ్మ దేవాల యం మారేడ్పల్లిలోని శ్రీనల్ల పోచమ్మ దేవాలయం సంద ర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నందికంటి రవి, గంటా రాజు, దేవేందర్ ముదిరాజ్, రాజు, అశోక్, బాల చందర్, శేఖర్, మోని, ర ఘు, సాయితో పాటు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి పూజలో కాంగ్రెస్ నేత నోముల ప్రకాశ్‌రావు గౌడ్



**నవతెలంగాణ-ఓయూ**

ఆషాఢ మాసం లష్కర్ బోనాలు సందర్భంగా మెట్టుగూడ డివిజన్‌లోని వరగంటి అమ్మవారికి కాంగ్రెస్ సీనియర్ నాయకులు నోముల ప్రకాష్‌రావు గౌడ్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తార్నాక, సీతాఫల్‌మండి డివిజన్స్‌లోని అమ్మవారి దేవాలయాల్లో నిర్వహించిన పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. అమ్మవారి దయ ప్రజలందరి మీద ఉండాలని కోరుకునట్టు తెలిపారు. ఆయన వెంట అభిషేక్, రవికుమార్, అరుణ్ కుమార్, నాగులురు శ్రీనివాస్, శ్రీశైలం యాదవ్, హర్ష పింటూ ఉన్నారు.

## స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం



**నవతెలంగాణ-అడిక్‌మెట్**

రోడ్ల పక్కన ఫుట్‌పాత్‌పై జీవనం సాగిస్తున్న అనాథలకు, మతిస్థిమితం కోల్పోయిన ఆకలితో అలమటిస్తున్న వారికి స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో 232 అన్నదాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రెసిడెంట్ సంజీవ్ కుమార్, సభ్యులు దీపిక, కీర్తి, వర్షితారెడ్డి, హరీష్ కుమార్, ఇర్ఫాన్, అఖిల్, అరుణ్ కుమార్, సాయికిరణ్, కుషాల్, వెంకటేష్, శుభం పాల్గొన్నారు.

## కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని వినతి



**నవతెలంగాణ-ఓయూ**

ఉస్మానియా విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులు ఆదివారం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. విశ్వ విద్యాలయంలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను జీవో నెంబర్ 16 ప్రకారంగా రెగ్యులరైజ్ చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకుపోతానని హామీ ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగ సంఘ నాయకులు ఎడ్ల అంజయ్య, వీరేశం, రాము, అభిలాష్, అరుణ్, చేతన్, చరణ్ సింగ్, మెహర్ మల్లేష్, నర్సింగ్ యాదవ్, గౌతమ్, సురేష్, రాజశ్రీ సతీష్, రామకృష్ణ అలీముద్దీన్ పాల్గొన్నారు.

## ప్రభుత్వం అందరి సంప్రదాయాలను గౌరవిస్తుంది

- ఎమ్మెల్యే దానం నాగేందర్



**నవతెలంగాణ-బంజారాహిల్స్**

ప్రభుత్వం అందరి సంప్రదాయలను, పండుగలను నిర్వహిస్తూ గౌరవిస్తుందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఆదివారం బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని ఆలయాల్లో బోనాలను నిర్వహించేందుకు దేవాదాయ శాఖ అధికారులతో కలిసి 106 చెక్కులను అందజేశారు. అనంతరం రెవెన్యూ అధికారులతో కలిసి కల్యాణ లక్ష్మీ షాదీ ముబారక్ చెక్కులను 20 లబ్దిదా రులకు అందజేశారు. కార్యక్రమంలో జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, వెంకటేశ్వర కాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నే కవితారెడ్డి ,సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతాశ్రీనివాస్ యాదవ్, మాజీ కార్పొరేటర్స్, డివిజన్స్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## లో ప్రెషర్ నీటి సమస్య పరిష్కారానికి కృషి

- కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్‌గౌడ్



**నవతెలంగాణ-అంబర్‌పేట**

లో ప్రెషర్ నీటి సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందని అంబర్‌పేట కార్పొరేటర్ ఇ. విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. ఆదివారం అంబర్‌పేట డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో పర్యటించి బస్తీ వాసులతో సమస్యలను తెలుసుకున్నారు. ఎంసీహెచ్ కాలనీ, ఆకాష్‌నగర్‌లో వారం రోజుల నుంచి నల్ల నీరు రావడం లేదని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కార్పొరేటర్ సంబంధిత జలమండలి అధికారులను పిలిపించి సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. భవిష్యత్‌లో ఇలాంటి సమస్య పునరావృతం కాకుండా చూడాలన్నారు. దుర్గానగర్‌లో ఏర్పాటు చేస్తున్న మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను పరిశీలించి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ప్రేమ్‌నగర్ బస్తీ ప్రజలు నల్ల నీరు తక్కువ ప్రెషర్‌తో వస్తుందని కార్పొరేటర్‌కు తెలిపారు. అన్ని సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు యాదగిరి రెడ్డి, వర్క్ ఇన్స్పెక్టర్ రమేష్, లైన్‌మెన్ సతీష్,మాజీ కార్పొరేటర్ ఫారుక్ బాయ్, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి జాఫర్, అతీక్, షానూర్, ఆదిల్, యూసుఫ్ బాబా, సంతోష్ చారి తదితరులు పాల్గొన్నారు.

## బీసీ, ఎస్సీ, ఎస్టీ, హాస్టల్స్‌లో మెస్ చార్జీలను పెంచాలి

- బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీలపల్లి అంజి



**నవతెలంగాణ-అడిక్‌మెట్**

రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టల్స్‌లో మెస్ చార్జీలను ప్రభుత్వం ప్రకటించినట్టుగా రూ.1500 నుంచి రూ. 2000 మెను అమలు చేయాలని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీలపల్లి అంజి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం విద్యానగర్ బీసీ భవన్‌లో బీసీ విద్యార్థి నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మాదిరిగా బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టల్స్ మెస్ చార్జీలను వెంటనే పెంచాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ స్కాలర్ షిప్‌లకు రూ.5వేల కోట్లు తక్షణమే విడుదల చేయాలన్నారు. బీసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ రూ.5500 నుంచి రూ.20 వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. బీసీ హాస్టళ్లకు, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. లేనిపక్షంలో డిమాండ్ల సాధనకై పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిళ్ల సతీష్, నరేష్ , సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ డిమాండ్లపై స్పందించకపోవడాన్ని ఖండిస్తున్నాం

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ



**నవతెలంగాణ-అడిక్‌మెట్**

ప్రధాని నరేంద్ర మోడీ వరంగల్ పర్యటనలో బీసీ జనగణన, కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ, బీసీ బిల్లుపై స్పందించకపోవడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ వరంగల్ పర్యటనపై విద్యానగర్ బీసీ భవన్‌లో బీసీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం సంయుక్త కన్వీనర్‌గా సీనియర్ సామాజిక రాజకీయ ఉద్యమ నాయకుడు సైంటిస్ట్ పొర్ల లింగప్పను నియమించి ఎంపీ ఆర్.కృష్ణయ్య నియామక పత్రం అందజేశారు. అనంతరం ఎర్ర సత్యనారాయణ మాట్లాడుతూ..రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ చేస్తున్న అవినీతిపై వాస్తవ విచారణ, దర్యాప్తు చేపట్టే చర్యలు ప్రకటించకపోవడం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఎన్నికల తర్వాత కేసీఆర్ అవినీతిపై చర్యలు తీసుకుంటామని చెప్పే బ్లాక్‌మెయిలింగ్ వ్యాఖ్యలను ప్రజలు నమ్మేస్థితిలో లేరని పేర్కొన్నారు. ఇంత కాలం బీజేపీని మోసిన ప్రజా సంఘాలపై, జర్నలిస్ట్ ఛానల్లపై విరుచుకు పడడం మానుకొని కేసీఆర్ అవినీతిపై యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాల న్నారు. టైం బౌండ్‌తో విచారణ కమిషన్ వేసి లక్షల కోట్ల అవినీతిని వెలికితీస్తేనే భవిష్యత్ ఉంటుందని తెలిపారు.

## సినీ కార్మికుడికి " మనం సైతం" ఫౌండేషన్ ఆర్థిక సాయం



**నవతెలంగాణ-జూబ్లీహిల్స్**

సినీ కార్మికుడు కే.లక్ష్మీనారాయణ (కార్డు నెంబర్ 263)కు ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. దీంతో ప్రయివేట్ హాస్పిటల్‌లో వైద్యం చేయించు కుంటున్నారు. విషయం తెలుసుకున్న" మనం సైతం" ఫౌండేషన్ నిర్వాహకులు కాదాంబరి కిరణ్ తన తోటి కార్మికులతో కలిసి వసూలు చేసిన రూ.25 వేల రూపా యల చెక్కును బాధితుడికి అందజేశారు. ఈ ఫౌండేషన్ ద్వారా సినీ కార్మికులు ఎవరు ఇబ్బందుల్లో ఉన్నా ఆర్థిక సహాయం చేస్తున్నామని, ఎవరైనా ఇబ్బందులలో ఉంటే ఫిల్మ్ ఛాంబర్‌కు వచ్చి ఫౌండేషన్‌కు తెలియపరచాలని కోరారు.

## రుచికరమైన వంటలకు హైదరాబాద్ నిలయం : ఎండీ. అలీ

**నవతెలంగాణ-బంజారాహిల్స్**

రుచికరమైన వంటలకు హైదరాబాద్ నిలయం అని ఆల్ టాజా రెస్టారెంట్ నిర్వాహకులు ఎండీ.అలీ తెలిపారు. హైదరబాద్ ప్రజలకు కొత్త రుచులను అందించాలనే లక్ష్యంతో ఆల్ టాజా రెస్టారెంట్ ఆదివారం గచ్చిబౌలి, కొండాపూర్, ఆసీఫ్‌నగర్ బ్రాంచ్‌లను ప్రారంభించారు. ఆల్ టాజా రెస్టారెంట్ నాణ్యమైన ముడిపదార్థాలతో వంటలు తయారు చేస్తారని తెలిపారు. ఈ రెస్టారెంట్‌లో చికెన్ , షావర్మ, సాన్విచ్, ఫలాఫీల్, వెజ్ రోల్స్, ఫ్రెంచ్ ఫ్రైస్, రుమాలి రోటి, పండ్లు, జూస్, బర్గర్లు వంటివి లభిస్తాయని చెప్పారు.జోమటో వంటి ఫుడ్ డెలివరీ సదుపాయం ఉందని తెలిపారు. వర్చువల్‌గా బంజారాహిల్స్‌లోని మంత్రుల ఇండ్లలో ప్రారంభించామని తెలిపారు.

# దేశం తల దించుకునేలా బీజేపీ పాలన

- మనుస్మృతి అమలు కాకుండా ప్రజలు జాగృతం కావడమే రాజ్యాంగానికి రక్షణ
- సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యురాలు సుభాషిణి అలీ




**నవతెలంగాణ-ధూల్‌పేట్**

దేశం తల దించుకునేలా కేంద్రం పాలన కొనసాగిస్తున్నదని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యురాలు సుభాషిణి అలీ అన్నారు. సీపీఐ(ఎం) సౌత్ జిల్లా ఆధ్వర్యంలో ఫలక్‌నుమా స్టేషన్‌రోడ్డు కార్యాలయంలో నిర్వహించిన సెమినార్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. గుజరాత్‌లో బిల్కిస్ బానో కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న నిందితులను ఆగస్ట్ 15న విడుదల చేయడం మనుస్మృతిని అమలు చేయడంలో భాగమేనన్నారు. మోడీ నాయకత్వంలోని బీజేపీ పాలనలో రాజ్యాంగాన్ని పూర్తిగా పక్కకు పెట్టి పాలన కొనసాగుతున్నది అన్నారు. ఇది దేశ ప్రజలను మోసగించడం అని పేర్కొన్నారు. బిల్కిసు బానో కేస్‌లో తల్లి కండ్ల ముందే బాలింతను అత్యాచారం చేసి 2 రోజుల పసి బిడ్డను కూడా క్రూరంగా హత్య చేసిన 11మంది మృగాళ్ల వ్యవహరించారని



ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సంఘటనను ఖండిస్తూ 8 ఏండ్లుగా పోరాడిన ఫలితంగానే వారికి యావజ్జీవ శిక్ష పడిందన్నారు. అలాంటి వారిని గుజరాత్‌లోని బీజేపీ ప్రభుత్వం 2022 ఆగస్ట్ 15న విడుదల చేసిందని ఆమె మండిపడ్డారు. మహిళలను, పిల్లలను క్రూరంగా హింసించాలని 2000 ఏండ్ల క్రితం రాయబడిన మనుస్మృతిలో ఉన్నదని తెలిపారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం పనికిమాలినదని బీజేపీ నేతలు అనేక సందర్భాల్లో ఉపన్యాసాలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వారిని బస్తీల్లోకి రాకుండా తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. మరో వైపు పేదప్రజలపై భారం పడేలా గ్యాస్ సిలిండర్ ధరలు రూ.1200 పెంచిందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు బడ్జెట్ క్రమంగా తగ్గిస్తు ప్రజలపై భారం మోపుతుందన్నారు. ఆదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ దొంగలకు వేల కోట్లు మాఫీ చేస్తూ, వారు బ్యాంకులను లూటీ చేస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమ న్నారు. నిరుద్యోగులకు, పేద ప్రజలకు, కార్మికులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను నిర్వీర్యం చేస్తూ మోడీ పాలన సాగుతున్నది అని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజలు జాగృతం అయి పోరాటం చెయ్యడమే రాజ్యాంగ రక్షణకు అసలైన పరిష్కారమని ఆమె సూచించారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఓల్డ్ సిటీలో ఇల్లు లేని పేదలకు తక్షణం డబుల్ బెడ్ రూం ఇండ్లు మంజూరు చేయాలన్నారు. పేదలు వేసుకున్న గుడిసెలకు ప్రభుత్వం పట్టాలివ్వాలని సీపీఐ(ఎం), ఇతర వామపక్షాల పార్టీలే పోరాడుతున్నాయని పేర్కొన్నారు. చాంద్రాయణగుట్ట జోన్ సీపీఐ(ఎం) కన్వీనర్ ఎల్.కోటయ్య అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జంగమెట్ సీపీఐ(ఎం) నాయకులు ఏ.కృష్ణ, వందన, సౌత్ జిల్లా నాయకులు జి.విఠల్, ఎం. మీన, పి.నాగేశ్వర్, ఎస్.కిషన్, ఎం. లక్ష్మమ్మ, ఎం. బాలు, బాబర్ ఖాన్, అబ్దుల్ సత్తార్, రామ్ కుమార్, శ్రావణ్ కుమార్, నూర్జహాన్, జంగయ్య, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## సహకార బ్యాంకింగ్ రంగంలో.. రెండంచెల విధానానికి బీఆర్ఎస్ ప్రభుత్వం సానుకూలం

- రెండంచెల వ్యవస్థపై ఏఐబీఈఏ లాంటి యూనియన్లు నివేదిక ఇవ్వాలి
- ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్



**నవతెలంగాణ-సుల్తాన్‌బజార్**

రైతులకు ప్రయోజనం చేకూర్చే విధంగా సహకార బ్యాంకింగ్ రంగంలో రెండంచెల విధానం పట్ల బీఆర్ఎస్ ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. సహకార బ్యాంకింగ్ రంగంలో రెండంచెల విధానాన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలనే విషయంపై ఈ రంగంలో పనిచేస్తున్న ఏఐబీఈఏ లాంటి యూనియన్లు ప్రతిపాద నలతో నివేదిక ఇస్తే సీఎం దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. 'సహకార రంగంలో నిర్మాణాత్మక మార్పులు' అనే అంశంపై సదస్సు అఖిల భారత బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) ఆధ్వర్యంలో ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వినోద్ కుమార్‌తోపాటు ఏఐబీఈఏ జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాం బాబు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఏపీటీబీఈఎఫ్) అధ్యక్షులు రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శి పి.వి.కృష్ణారావు, సహకార బ్యాంకుల ఉద్యోగుల అసోసియేషన్ నాయకుడు సురేందర్‌లు ప్రసంగించారు. ఈ సందర్భంగా బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ.. సహకార ఉద్యమం కంటే ముందు కొద్ది మంది చేతుల్లోనే భూమి ఉండేదని తెలిపారు. ప్రజాఉద్య మాల వల్ల భూ సంస్కరణ అమలు జరిందని పేర్కొన్నారు. ప్రస్తుతం చిన్న కమతాల రూపంలో వ్యవసాయ భూమి పెద్దఎత్తున పెరగడమే ఇందుకు కారణమన్నారు. ఆ ఉద్దేశ్యంతోనే బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి ఐదు వేల ఎకరాలకు ఒక వ్యవసాయ విస్తరణ అధికారిని నియమించిందని వివరించారు. సీజన్ ఎకరానికి రూ.5 వేల పంట పెట్టుబడి సాయం, పంటరుణాలు ఇస్తుందని తెలిపారు.

### బ్యాంకింగ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

ఒక వైపు ప్రైవేటు బ్యాంకులను జాతీయకరణ చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తుంటే మరోవైపు ప్రభుత్వరంగ బ్యాంకింగ్ వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వరంగ బ్యాంకింగ్ వ్యవస్థను కాపాడుకోవాల్సిన అవసరంపై ప్రజలను చైతన్యవంతం చేయాలని ఆయన బ్యాంకు ఉద్యోగులను కోరారు. బి.ఎస్.రాంబాబు మాట్లాడుతూ సహకార బ్యాంకింగ్ రంగంలో మూడంచెల విధానాన్ని తొలగించి డీసీసీబీలను అపెక్స్ బ్యాంకులలో విలీనం చేయడం ద్వారా రెండంచెల విధానాన్ని అమలు చేసేందుకు ఆర్‌బీఐ కూడా సానుకూలంగా స్పందించిందన్నారు. సహకార బ్యాంకింగ్ రంగంలో రెండంచెల విధానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా రైతులకు రుణాలను 9 శాతంవడ్డీకి బదులుగా 3 శాతానికే ఇవ్వవచ్చని సురేందర్ వివరించారు.

## కుల దురహంకార హత్యలపై మౌనం వీడాలి

- జస్టిస్ చంద్రకుమార్

**నవతెలంగాణ-ముషీరాబాద్**

కుల మత దురహంకార హత్యలపై పాలకులు మౌనం వీడాలని జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. టీపీఎస్‌కే, కేవీపీఎస్ సంయుక్తంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. "కుల, మతాంతర వివాహాలకు రక్షణ కల్పించాలన్నారు. ప్రేమికులపై జరిగే దాడులను వార్త పత్రికల్లో పరువు హత్యల పేరుతో ప్రచారం చేయడం కరెక్ట్ కదన్నారు. కుల దురహంకార హత్యలుగా చూడాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర నాయకులు జి.రాములు మాట్లాడుతూ.. కుల, మత ధర్మాల పేరుతో బీజేపీ ప్రభుత్వం ఇలాంటి ఘటనలను ప్రోత్సాహిస్తున్నదని మండిపడ్డారు. దేశంలో కులం కొందరికి వరమైతే ..ఎందరికో శాపంగా మారిందని తెలిపారు. కుల రహిత సమాజం కోసం సాంస్కృతిక విప్లవం తీసుకురావాలని అన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు మాట్లాడుతూ.. ప్రేమ పెళ్లి చేసుకున్న వారిపై జరుగుతున్న దాడులను మానవ హక్కుల కమిషన్, మహిళా కమిషన్ పట్టించుకోకపోవడం బాధాకరమని వాపోయారు. బి. ఆర్ అంబేద్కర్ కులాంతర వివాహాలు జరగాలని ఆనాడే తెలిపారని గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని అమలు చేయాలన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్. వినయ కుమార్ మాట్లాడుతూ..కుల మత వివాహాలకు అండగా సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఉంటుందన్నారు. కుల నిర్మూలన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వహీద్ మాట్లాడుతూ.. స్వాతంత్రం వచ్చి ఇన్నేండ్లు అవుతు న్నా నేటికీ కులం పేరుతో దాడులు జరుగుతున్నాయన్నారు. తెలంగాణలో నేటికీ 78 మంది హత్యా గావించబడ్డారని తెలిపారు. టీసీఎస్‌కే రాష్ట్ర నాయకులు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థత వల్లనే కుల దురహంకార హత్యలు జరుగుతున్నాయన్నారు. త్వరలోనే కులాంతర వివాహాల రక్షణ వేదిక ఏర్పాటు చేస్తాంమని తీర్మానించారు. కార్యక్రమంలో నిర్మూలన సంఘం గౌరవాధ్యక్షురాలు గట్టు జ్యోత్స్న, జి.బుచ్చిరెడ్డి రజక వృత్తిదారుల రాష్ట్ర అధ్యక్షుడు నరేష్, మూర్తి, అలివేలు మంగ ,వరిజ, గంజి ఈశ్వర్ కళాకారులు అశ్విని బాలస్వామి,వీరమల్లు జి. బాలాజీ రెడ్డి పాల్గొన్నారు .

## వికలాంగులకు సామాజిక భద్రత కల్పించాలి




**నవతెలంగాణ-ధూల్‌పేట్**

వికలాంగులకు సామాజిక భద్రత కల్పించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఆర్. వెంకటేష్ డిమాండ్ చేశారు. జూలై 10న జంతర్ మంతర్ వద్ద జరిగే వికలాంగుల మహాధర్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదానికై వికలాంగులు బయలు దేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో వికలాంగులకు రక్షణ లేకుండా పోతోందని అన్నారు. మహిళా వికలాంగులు, బాలికలు, మూగ, చెవిటి, మానసిక మహిళా వికలాంగులపై లైంగిక వేధింపులు, అత్యాచారాలు జరుగుతున్నయని అన్నారు. వీటన్నింటినీ అరికట్టి వికలాంగులకు వారి కుటుంబ సభ్యులకు భరోసా కలిపించల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉన్నదన్నారు. వికలాంగుల భద్రత కోసం ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరా గాంధీ జాతీయ వికలాంగుల పెన్షన్ ధరల పెరుగుదలకు అనుగుణంగా రూ.10 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. 40శాతం వైకల్యం కలిగిన వికలాంగులకు పెన్షన్ మంజూరు చేయాలన్నారు. వికలాంగుల కుటుంబాలకు అంత్యోదయ కార్డులు పంపిణీ చేయాలని అన్నారు. వికలాంగుల నిత్య జీవిత అవసరాలు తీర్చడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. నిరుద్యోగ వికలాంగులకు స్వయం ఉపాధి కల్పించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు శశికళ ఉన్నారు.

## అమ్మవారికి బంగారు బోనం సమర్పణ



**నవతెలంగాణ-ఓయూ**

సికింద్రాబాద్ బోనాలు వేడుకల్లో భాగంగా డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆయన నివాసం నుంచి జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకు ంట్ల కవిత కళా సంస్కృతిక బృందాలతో ఊరేగింపుగా తరలి వెళ్లి అమ్మవారికి బంగారు బోనాన్ని సమర్పించింది. టకార బస్తీలో తీగుల్ల కుటుంబం నెలకొల్పిన ముత్యాలమ్మను సీఎం కేసీఆర్ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. సీఎం దంపతులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

## స్వచ్ఛంద సేవ చేయడం అభినందనీయం




- ఎంపీ జోగినిపల్లి సంతోష్

**నవతెలంగాణ-బంజారాహిల్స్**

వ్యాపారులు స్వచ్ఛంద సేవ చేయడం అభినందనీయమని ఎంపీ జోగినిపల్లి సంతోష్ అన్నారు. ఓ ప్రయివేట్ హాల్‌లో నిర్వహించిన కళామందిర్ వ్యవస్థాపక దినోత్సవానికి ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా పలువురు సినీ ప్రముఖులతో కలిసి కళామందిర్ ఫౌండేషన్ ద్వారా విరాళాలు అందించారు. ఈ సందర్భంగా ఎంపీ సంతోష్ మాట్లాడుతూ..వ్యాపార సంస్థలు వ్యాపార ధోరణితోనే కాకుండా చేనేత కార్మికులకు, అంధ విద్యార్థులకు, ఒంటరి మహిళల కోసం స్వచ్ఛంద సంస్థలకు విరాళాలు అందించడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా సంస్థ ఫౌండర్ చల్వాది ప్రసాద్ పలు స్వచ్ఛంద సంస్థలకు చెక్కుల రూపంలో విరాళాలు అందించారు. కార్యక్రమంలో దర్శకులు మెహర్ రమేష్, అనిల్ రావిపుడి, ఐటీ శాఖ కార్యదర్శి జయేష్ రంజన్, సినీ హీరో సత్యదేవ్, మాజీ జేడీ లక్ష్మీనారాయణ, హైపర్ ఆది, మీనాక్షి చౌదరి, నిత్యా నరేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వికలాంగులు, అంధ విద్యార్థులు నిర్వహించిన ర్యాంప్‌షో అందరినీ అలరింపజేసిందనీ తెలిపారు.

## బీజేపీ పార్టీ కార్యాలయం ప్రారంభం



**నవతెలంగాణ-జూబ్లీహిల్స్**

ఆరు నెలలుగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీజేపీ కార్యక్రమాలలో పాల్గొంటూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న కీర్తిరెడ్డి ఫౌండేషన్ నిర్వాహకురాలు కీర్తిరెడ్డి జన్మదిన సందర్భంగా ఆదివారం జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 65లో ఏర్పాటు చేసిన బీజేపీ పార్టీ కార్యాలయాన్ని సికింద్రాబాద్ ఎంపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి సతీమణి కావ్యారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కీర్తిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కీర్తిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేయాలంటే ఆఫీస్ లేకుండా చేయలేమని ఆఫీస్ కార్యాలయం ప్రారంభించామని తెలిపారు. ప్రజలు సమస్యలను చెప్పుకోవాలంటే పార్టీ కార్యాలయాలలో తెలపాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గౌతమ్‌రావు, శ్రీధర్‌రెడ్డి మహిళలు భారీగా పాల్గొన్నారు.

## వజ్ర మైసమ్మ అమ్మవారికి పూజలు



**నవతెలంగాణ-సుల్తాన్‌బజార్**

అషాఢ మాసం పురస్కరించుకుని కోఠి సుల్తాన్ బజార్‌లోని వజ్ర మైసమ్మ ఆలయంలో అమ్మవారికి బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలు చేసిన వారిలో ఆశీష్ కుమార్ యాదవ్, వినోద్ కుమార్, శేఖర్ చారి, తదితరులు ఉన్నారు.

మానవి
హైదరాబాద్ నవతెలంగాణ 11
సోమవారం 10 జులై 2023
www.navatelangana.com

## చర్మ నిగారింపుకు...

చర్మం కాంతివంతంగా ఉండాలని అందరూ కోరుకుంటారు. అందుకు రకరకాల క్రీములు, లోషన్లు ఉపయోగిస్తుంటారు. వాటికి బదులుగా గంధంతో కొన్ని చిట్కాలు పాటిస్తే చర్మం సహజంగా నిగారిస్తుంది.. అవేంటో చూద్దాం...

- గంధపు చెక్కను రోజ్ వాటర్‌తో అరగదీసి.. దాన్ని ముఖానికి ఫేస్ ప్యాక్‌లా వేసుకోవాలి. బాగా ఆరిన తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేసుకుంటే సరిపోతుంది. మీ దగ్గర గంధపు చెక్క లేకపోతే.. దానికి బదులుగా గంధపు పొడిని ఉపయోగించవచ్చు. గంధం పొడిలో సరిపడినంత రోజ్ వాటర్ కలిపి ముఖానికి మాస్క్‌లా వేసుకోవాలి.
- టమాటా గుజ్జు, పెరుగు చెంచా సుమారుగా తీసుకుని మిశ్రమంగా తయారు చేయాలి. దీన్ని ముఖానికి అప్లై చేసి పావుగంట పాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకొంటే సరిపోతుంది.
- రెండు చెంచాల ఓట్ మీల్‌లో చెంచా చందనం పొడి వేసి సరిపడినంత రోజ్ వాటర్ కలిపి మిశ్రమంగా తయారు చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి పావుగంట ఆరనివ్వాలి. ఆ తర్వాత మసాజ్ చేసుకొంటున్నట్టుగా శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల చర్మంపై ఉన్నమృతకణాలు తొలగిపోతాయి.



- చిన్న సైజులో ఉన్న టమా టాను తీసుకొని దాన్ని చెంచా సాయంతో మెత్తగా చేయాలి. ఇందులో కొద్దిగా చక్కెర కలిపి మిశ్రమంగా తయారు చేసి, ముఖానికి ఫేస్ ప్యాక్‌లా అప్లై చేసుకోవాలి. పది నిమిషాల తర్వాత చేతి వేళ్లను తడి చేసుకొని మసాజ్ చేస్తున్నట్లు మొత్తం రుద్దుకోవాలి. తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేసుకుంటే సరిపోతుంది.

## దుర్వాసన తగ్గాలంటే...

కొంతమంది మాట్లాడుతుంటే నోటి నుండి దుర్వాసన వస్తుంటుంది. తిన్న ఆహారం లేదా ఇతర పదార్థాలు నోటిలో మిగిలి అలాగే ఉండిపోవడమే దీనికి కారణం. అందుకు కొన్ని చిట్కాలు పాటిస్తే చెక్ పెట్టవచ్చు. అవేంటంటే...

- ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో కల్లుప్పు వేసుకుని కలిపి దానిని రోజులో రెండు మూడు సార్లైనా పుక్కిలించాలి. ఆహారం తీసుకున్న తర్వాత ఇలా చేస్తే నోరు శుభ్రమవతుంది. దుర్వాసన కూడా వుండదు. రోజులో కనీసం రెండు మూడు లవంగాలు, సోంపు వంటివి తింటుండాలి. ఇందులో ఉండే మంచి లక్షణాలు నోట్లోని బ్యాక్టీరియాను దూరం చేస్తాయి.
- కొంచెం మిరియాల పొడి, పసుపు, కాస్త ఉప్పు, అందులో నువ్వుల నూనె వేసి పేస్టులా చేసుకుని ఈ పేస్ట్‌తో పళ్లను తోమితే నోటి దుర్వాసన వుండదు. తద్వారా పంటి సమస్యలు తీరడంతో పాటు నోటి దుర్వాసనా తగ్గుతుంది. అంతేకాదు, నిమ్మరసంతో బ్రష్ చేయడం వల్ల దుర్వాసనను తగ్గించుకోవచ్చు.



- రోజులో రెండు సార్లు బ్రష్ చేయడం అలవాటు చేసుకోవాలి. టూత్ బ్రష్‌లను రెండు మూడు నెలలకు ఒకసారి మారుస్తూ ఉండాలి. నోట్లోని చెడు వాసనకు కారణమైన బ్యాక్టీరియాను తరిమేందుకు సహజసిద్ధమైన మౌత్ వాష్‌లను వినియోగించడం ద్వారా ఈ సమస్యకు చెక్ పెట్టవచ్చునని వైద్యులు సూచిస్తున్నారు.




ఘనా మహిళలు "డోంట్ టాక్స్ మై పీరియడ్" అంటూ కవాతు చేస్తూ వీధుల్లోకి వచ్చారు. తమ దేశంలో రుతుస్రావ పరిశుభ్రత ఉత్పత్తులపై పన్ను విధించడాన్ని, వీటిని మహిళలు వాడే విలాస వస్తువుల కింద పరిగణించడాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు. రుతుస్రావ సమయంలో సురక్షితమైన ప్యాడ్స్ ఉపయోగించాలనే అవగాహన ఇప్పటికే చాలా మంది పేదలకు లేదు. ఈ పన్ను భారం వల్ల వాడే కొద్దిమంది కూడా వాటికి దూరమయ్యే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే ప్యాడ్స్‌పై విధించిన పన్నును ఖండిస్తూ ఉద్యమం చేస్తున్నారు. ఆ వివరాలు నేటి మానవిలో...

### ఘనా మహిళల పోరాటం

# డోంట్ టాక్స్ మై పీరియడ్

జూన్ 22న ఘనా కార్యకర్తలు "డోంట్ టాక్స్ మై పీరియడ్" అనే నినాదాలు ఉన్న ప్లకార్డ్ పట్టుకొని అక్ర వీధుల్లోకి వచ్చారు. రుతుస్రావ పరిశుభ్రత ఉత్పత్తులపై పన్ను భారాన్ని వ్యతిరేకిస్తూ నిరసన చేపట్టారు. యెబెతుమి, ఒబాసిమా సంస్థల కార్యకర్త సహకారంతో ఘనా సోషలిస్ట్ మూవ్‌మెంట్ (SMG) ఉమెన్స్ వింగ్ దీనికి నాయకత్వం వహిస్తున్నది.

### మళ్లీ వీధుల్లోకి వస్తాం

నిరసనకారులు పార్లమెంటుకు కవాతు చేశారు. స్పీకర్ ఆ ప్రతినిధి బృందంతో సమావేశమై వారి డిమాండ్లను వినడానికి కొనసాగుతున్న తమ సమావేశానికి విరామం ఇచ్చారు. వారి డిమాండ్లపై త్వరలో సానుకూల స్పందన వస్తుందని స్పీకర్ అల్బన్ బాగ్బిన్ నిరసనకారులకు హామీ ఇచ్చారు. బహిష్టు పరిశుభ్రత ఉత్పత్తులపై పన్నులు ఎత్తివేయకుంటే మళ్లీ వీధుల్లోకి వస్తామని కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు.

### పీరియడ్ పేదరికం

పెరుగుతున్న ధరలు దేశంలోని మెజారిటీ కుటుంబాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఘనా ఘోరమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. సంక్షోభం కారణంగా ప్రజలు కనీసం నిత్యావసర వస్తువులను కూడా కొనుగోలు చేయలేకపోతు న్నారు. ఈ పరిస్థితి మహిళలతో పాటు బలహీన వర్గాలపై అసమాన ప్రభావాన్ని చూపుతున్నది. ప్రపంచ మహిళా జనాభాలో నాలుగింట ఒక వంతు రుతుస్రావ వయసులో ఉన్నప్పటికీ 500 మిలియన్ల మంది రుతు పరిశుభ్రత ఉత్పత్తులకు ప్రాధాన్యతే ఇవ్వడం లేదు. అంటే వారంతా పీరియడ్ పేదరికంలో ఉన్నారు. అంటే రుతుక్రమ ఉత్పత్తులను కొనుగోలు చేసే ఆర్థిక శక్తి వారి వద్ద లేదు.

### పన్నులతో పెరిగిన భారం

పన్నుల తొలగింపు కోసం కార్యకర్తలు కవాతుకు సిద్ధమయ్యారు. ఈ పన్నులు ఘనాలో పేదరికాన్ని ఎలా పెంచుతున్నాయో తెలుసుకునేందుకు జూన్ 21న "లింగ జీవన వ్యయం: వర్కింగ్ క్లాస్ మహిళలపై విలాసవంతమైన పన్ను ప్రభావం" అనే శీర్షికతో పాన్ ఆఫ్రికనిజం టుడే ఒక చర్చను నిర్వహించింది. ఇందులో SMG మహిళా విభాగం నాయకురాలు, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు లోరెట్టా అషీ, ట్రైకాంటినెంటల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సోషల్ రీసెర్చ్ లో విద్యావేత్త, పరిశోధకురాలు మైకేలా ఎర్స్కోగ్ పాల్గొన్నారు. ఈ చర్చ సామాజిక, ఆర్థిక సమస్యలను లేవనెత్తింది.

### మహిళల సమస్యగా...

రుతుస్రావంలో ఉన్నవారికి సరసమైన ధరలకు ఉత్పత్తులు అందించేందుకు ప్రభుత్వ వైఖరి ఎలా ఉందో ఈ పన్నుల భారం (ఘనాలో మాత్రమే కాదు) ప్రతిబింబిస్తుంది. నిజానికి ఈ ఉత్పత్తులను ముఖ్యమైన వస్తువుగా వర్గీకరించడం లేదు. అంతేకాకుండా రుతు పరిశుభ్రత సమస్యలను మహిళల సమస్యగా చూసే ధోరణి మారాలని, దీన్ని రాజకీయ, సామాజిక, ప్రజారోగ్య ప్రాముఖ్యతకు సంబంధించిన విషయంగా చూడాలనే చర్చ అక్కడ జరిగింది.

### కనీస సౌకర్యాలు లేక

పీరియడ్ ఉత్పత్తుల ధరలను పక్కన పెడితే కనీసం టాయిలెట్ సౌకర్యాలు లేవు, తాగునీరు లేదు, శానిటరీ ఉత్పత్తులను పారవేసేందుకు అవసరమైన సౌకర్యాలు లేనందున బాలికలు పాఠశాలకు దూరంగా ఉండవలసి వస్తుందని ఎన్నో పరిశోధనల్లో తేలింది. ఈ సమస్యతో చాలామంది బాలికలు పాఠశాలలు పూర్తిగా మానేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో శానిటరీ ప్యాడ్‌ల అధిక ధరల కారణంగా కొందరు వాటిని ఉపయోగాన్ని మానేయడం, లేదా గుడ్డ ముక్కలను ఉపయోగించడం వంటివి చేయవలసి వస్తున్నది.

### తిండి ఎలా తింటారు..?

"మా కనీస వేతనం 14 సెడీలు, 88 పెసేవాలు. ఇది దాదాపు USD 1.88. ఒక మెన్‌స్ట్రువల్ ప్యాడ్ 15 నుండి 40 సెడిస్‌ల మధ్య అమ్మబడుతుంది. కాబట్టి ఒక వ్యక్తి రెండు ప్యాడ్‌లను ఉపయోగిస్తే వారు దాదాపు 70 నుండి 80 సెడిస్‌లు ఖర్చు చేస్తున్నారు. ఇది వారి ఆదాయంలో దాదాపు 20 నుంచి 25శాతం" పీరియడ్స్ ప్యాడ్స్ కోసమే ఇంత పోతే ఇక ఇంటి అద్దెలు ఎలా కడతారు, తిండి ఎలా తింటారు. వారిపై ఆధారపడే వారుంటే వారి కడుపు ఎలా నింపుతారు" అని ఆషీ చెప్పారు.






### ఉచితంగా అందించాలి

"ప్రభుత్వం ఈ పన్నులను వెంటనే ఎత్తివేయాలి. శానిటరీ ప్యాడ్‌లకు సబ్సిడీ ఇవ్వాలి. ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో బాలికలకు ఉచితంగా అందించాలి. శానిటరీ ఉత్పత్తులను తప్పనిసరిగా ముఖ్యమైన వస్తువుగా పరిగణించాలి" అని ఆమె అన్నారు. వీరి నిరసనకు అతీతంగా SMG తన పోరాటాన్ని కొనసాగించబోతోంది. రుతుస్రావం, విద్యకు ప్రాముఖ్యం ఇస్తూ దీని చుట్టూ అల్లుకొని ఉన్న సామాజిక సమస్యలను అంతం చేయడానికి పని చేస్తున్నది.

- సలీమ

### సామాజిక నిబంధనతో...

"రోజురోజుకీ వస్తువుల ధరలు పెరిగిపోతు న్నాయి. దీని వల్ల మహిళలే ఎక్కువగా బాధ పడుతున్నారు. ఎందుకంటే లింగ వివక్ష కారణంగా మహిళల ఆదాయం తక్కువ. పైగా అనధికారిక రంగంలో పని చేస్తూ పింఛన్లు పొందలేకపోతున్నారు. ఈ ఆర్థిక సంక్షోభంతో మహిళలు పురుషుల కంటే పది రెట్లు ఎక్కువ బాధను ఎదుర్కొంటున్నారు" అని ఎర్స్కోగ్ అన్నారు. రుతుక్రమం అంటే అంతర్లీనంగా కలుషితమైనదిగా, అంటరానిదిగా చూసే సామాజిక నిబంధనల వల్ల పీరియడ్ పేదరికం పెరిగిపోతున్నది. ఇది రుతుక్రమానికి సంబంధించిన సమస్యలపై బహిరంగ చర్చలకు ఆటంకం కలిగిస్తుంది.

---

# లష్కర్ బోనాల్లో సీఎం

(మొదటిపేజీ తరువాయి)

దేవాలయానికి రాగా ఆయన సతీమణి స్వర్ణ బోనంతో అమ్మవారికి తొలి బోనం సమర్పించారు. అనంతరం సాధారణ భక్తులకు అనుమతించారు. మహంకాళి బోనాల జాతర విశ్వవ్యాప్తమైందని, ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఈ సందర్భంగా మంత్రి తలసాని తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ కవిత ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి బంగారు బోనం సమర్పించారు. ముందుగా మంత్రి తలసాని నివాసం గాస్ మండిలో ప్రత్యేక పూజలు చేసిన కవిత అనంతరం డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ నివాసం నుంచి బంగారు బోనంతో మహంకాళి ఆలయానికి బయలుదేరారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు, అధికారులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. కవిత వెంట మంత్రులతో పాటు బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి కేశవరావు, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి డిప్యూటీ మేయర్ శ్రీలత రెడ్డి, స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ తదితరులున్నారు.

**అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు**

ఉజ్జయినీ మహంకాళి బోనాల సందర్భంగా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దేవదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని బోనం సమర్పించారు. హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మంత్రి మల్లారెడ్డి కుటుంబ సభ్యులతో వచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, బీజేపీ నాయకులు ఈటల రాజేందర్, గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్, బీఆర్ఎస్ నాయకులు దానం నాగేందర్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, పద్మా దేవేందర్ రెడ్డి, కాలేరు వెంకటేష్, మాజీ రాజ్యసభ సభ్యులు హనుమంతరావు, సికింద్రాబాద్ ఆర్డీవో వసంత కుమారి తదితరులు పాల్గొన్నారు. బోనాల సందర్భంగా సికింద్రాబాద్ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లోని రోడ్ల నుంచి ఇతర మార్గాల వైపు ట్రాఫిక్‌ను మళ్లించారు.

# రాజ్యాంగ పరిరక్షణకు సంఘటితం కండి

(మొదటిపేజీ తరువాయి)

రాసిన భారత రాజ్యాంగాన్ని ఆర్ఎస్ఎస్ అప్పట్లోనే వ్యతిరేకించిందనీ, దాని స్థానంలో మనుస్మృతిని అమల్లోకి తేవాలని ప్రతిపాదించిందని వివరించారు. ఇప్పుడు దేశంలో ఆ మనుస్మృతి ఆధారంగానే దుస్సంఘటనలు జరుగుతున్నాయంటూ బిల్కిస్‌బానో కేసు సహా పలు అంశాలను ఆమె ఉదహరించారు. గడచిన తొమ్మిందేండ్లలో దేశంలో నిరుద్యోగం, ధరలు ఆకాశమంత ఎత్తు ఎదిగాయనీ, వాటిని నియంత్రించడంలో మోడీ సర్కారు ఘోరంగా విఫలమైందని విమర్శించారు. గతంలో ప్రభుత్వాలతో పోరాడితే, కనీసం ఆ సమస్యలు ఏంటో తెలుసుకొనే ప్రయత్నమన్నా చేసేవనీ, కానీ గడచిన 9 ఏండ్లలో ఏనాడు మోడీ సర్కారు ప్రజా ఆకాంక్షలతో కూడిన ఆందోళనల్ని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ప్రస్తుతం దేశంలో ఖాళీ గ్యాస్ సిలిండర్లపై కూర్చుని, కట్టెల పొయ్యిలో పొగ గొట్టాలను ఊదుకొనే పరిస్థితి కల్పించారని ఎద్దేవా చేశారు. అధికారం కోసం ప్రజల మధ్య అసమానతలు, ద్వేష భావాన్ని పెంచి పోషించే దుశ్చర్యలకు పాల్పడుతున్నారన్నారు. పేద, ధనిక తారతమ్యాన్ని పెంచి ఆర్థిక అసమానతలు పెచ్చరిల్లేలా పరిపాలన సాగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. దేశానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టిన మహిళా రెజ్లర్ల డిమాండ్లను పరిష్కరించడంలో మోడీ సర్కారు నిర్లక్ష్యంగా, నిర్దయగా వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రిజ్‌భూషణ్‌ను ఎందుకు అరెస్టు చేయట్లేదని ప్రశ్నించారు. చట్టాలు పేదలు-పెద్దలపై భిన్నంగా పనిచేస్తున్నాయని విమర్శించారు. దేశం కోసం, ధర్మం కోసం అంటూ సెంటిమెంటును రాజేసి, ఓట్లు దండుకోవడానికి వచ్చే నేతలకు ప్రజలు సరైన రీతిలో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సీపీఎం హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి ఎమ్‌డీ అబ్బాస్ అధ్యక్షత వహించారు. చాంద్రాయణగుట్ట జోన్ కన్వీనర్ ఎల్ కోటయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎమ్ మీనా, జీ విఠల్, పీ నాగేశ్వర్, జిల్లా కమిటీ సభ్యులు ఎస్ కిషన్, ఎమ్‌డీ బాబర్‌ఖాన్, ఏ కృష్ణ, ఎమ్ బాలునాయక్, ఎమ్ శ్రవణ్‌కుమార్, ఎమ్‌డీ అబ్దుల్ సత్తార్, ఎమ్ లక్ష్మమ్మ, చాంద్రాయణ గుట్ట జోన్ కమిటీ సభ్యులు నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

# దెబ్బ మీద దెబ్బ

(మొదటిపేజీ తరువాయి)

ఆలోచనల్లో మార్పు కనిపిస్తున్నది. బ్యాక్ టూ పెవిలియన్ అనే వాతావరణం పార్టీలో కనిపిస్తున్నది. బీజేపీ చేరికల కమిటీ చైర్మెన్ ఈటల రాజేందర్ గతంలో చేసిన ప్రయోగాలు విఫలమైన సంగతి తెలిసిందే. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావును పార్టీలోకి ఆహ్వానించినప్పటికి సఫలం కాలేదు. పైగా వాళ్లే ఈటలకు రివర్స్ కౌన్సిలింగ్ ఇచ్చిన విషయం విదితమే. ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో ఈటల రాజేందర్ కూడా పార్టీ మారుతారనే ప్రచారం కాస్త ఊపందుకుంది. దీంతో ఆయనకు బీజేపీ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మెన్ పోస్టు కట్టబెట్టింది. కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరి మునుగోడులో ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని జాతీయ కార్యవర్గ సభ్యుడిగా నియమించింది. అయినప్పటికీ వారు బీజేపీలో ఉంటారనే నమ్మకం ఆ పార్టీ నేతలకు కుదరడం లేదని తెలుస్తోంది .వరంగల్ మోడీ సభకు కూడా పార్టీ నేతలు డుమ్మా కొట్టిన సంగతి తెలిసిందే. దక్షణాది రాష్ట్రాల బీజేపీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు సమావేశంలో పాల్గొనేందుకు బీజేపీ జాతీయ అధ్యక్షులు నడ్డా హైదరాబాద్‌కు వచ్చారు. రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, పార్టీ అంతర్గత విషయాలను పార్టీ నూతన అధ్యక్షులు జి కిషన్‌రెడ్డి... నడ్డాకు వివరించినట్టు తెలిసింది. పార్టీ పరిస్థితులను చక్కదిద్దేందుకు కార్యాచరణ రూపొందిస్తున్న తరుణంలో బీజేపీలో పిడుగులాంటి వార్త గుప్పుమంది.

వివిధ జిల్లాలకు చెందిన బీజేపీ కీలక నేతలు పది మంది కాంగ్రెస్ గూటికి చేరేందుకు సిద్ధమవుతున్నట్టు ప్రచారం జరుగుతున్నది. మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు నేతృత్వంలో ఈనెలాఖరులో మహబూబ్‌నగర్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఆ సభకు ఏఐసీసీ అగ్రనేత ప్రియాంకగాంధీ హాజరు కానున్నట్టు కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఆ సభావేదికపై ప్రియాంక సమక్షంలో చేరేందుకు చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. అందులో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముగ్గురు నేతలు కూడా ఉన్నట్టు జాబితా మీడియాలో వైరల్ అవుతున్నది. యెన్నం శ్రీనివాస్ రెడ్డి, కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి, రామారావు పటేల్, ఖాజీపేట లింగయ్య, రవీంద్ర నాయక్, ఏనుగు రవీందర్ రెడ్డి, ఏ చంద్రశేఖర్, రమేష్ రాథోడ్, పవన్‌కుమార్‌రెడ్డి (బీజేపీ), గద్వాల జెడ్పీ చైర్‌పర్సన్ సరితా తిరుపతయ్య, ఎమ్మెల్సీ దామోదరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి (బీఆర్ఎస్) తదితరులు కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరుగుతున్నది.


కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యే జగ్గారెడ్డి కారెక్కుతారనీ, ఈటల రాజేందర్ హస్తం గూటికి వస్తారా? అధికార బీఆర్ఎస్‌లోకి వెళతారా?, విజయశాంతి, కొండా విశ్వేశ్వరరెడ్డి, వివేక్ వెంకటస్వామి తదితరులు బీజేపీ నేతల వ్యవహార శైలి నచ్చక దూరం దూరంగా ఉంటున్నట్టు పార్టీ వర్గాలు అంటున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇటువంటి పరిణామాలు కమలనాథులకు నిద్రాహారాలు లేకుండా చేస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

# అప్పుల కుప్ప..

(మొదటిపేజీ తరువాయి)

వారి వాదన. అయితే మంచి ఆదాయాలు, మేలైన సామాజిక భద్రత, నిలకడైన ఉద్యోగాలు కలిగి ఆర్థికంగా పురోభివృద్ధి చెందుతున్న వ్యవస్థలకు ఇది మేలు చేయవచ్చు. కానీ భారత ఆర్థిక వ్యవస్థ స్థితిగతులను పరిగణనలోకి తీసుకుంటే ఇదేమీ మంచి సంకేతాన్ని ఇవ్వదు. పైగా పరిస్థితి మరింత క్షీణిస్తుంది. ఎందుకంటే మన దేశంలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం అధికంగా ఉన్నాయి. ఉద్యోగులు, కార్మికులకు వేతనాలు కూడా తక్కువగానే లభిస్తున్నాయి. పారిశ్రామిక రంగం తక్కువ వృద్ధిరేటును నమోదు చేస్తోంది. వచ్చే జీతం సరిపోక ప్రజలు రుణాలు తీసుకోవాల్సి వస్తోంది తప్ప ఖరీదైన విలాస వస్తువుల కొనుగోలు కోసం కాదు.

### రాష్ట్రాలు సైతం...




రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తామేమీ తక్కువ తినలేదన్నట్లు భారీగానే రు ణాలు తీసుకుంటు న్నాయి. 2014-15లో అన్ని రాష్ట్రాల రుణభారం రూ.25 లక్షల కోట్లు ఉంటే అది ప్రస్తుత సంవత్సరంలో రూ.76 లక్షల కోట్లకు చేరిందని అంచనా. 2017లో జీఎస్టీని ప్రవేశపె ట్టిన తర్వాత పన్నులు, సుంకాల విషయంలో రాష్ట్రాలకు అధికారాలు లేకుండా పోయాయి. దీంతో వాటి ఆదాయం తగ్గిపోయింది. పైగా పెట్టుబడుల కోసం మూలధనాన్ని పెంచేందుకు కేంద్రం కఠినమైన, ఆర్థికంగా భారమైన షరతులు విధిస్తోంది. వివిధ పథకాలకు నిధుల కేటాయింపుపై కూడా కేంద్రం పెత్తనం చెలాయిస్తోంది. ఇది రాష్ట్ర ప్రభుత్వాలకు పెద్ద సమస్యగా మారింది.

అనేక రాష్ట్ర ప్రభుత్వాలు రుణాల సేకరణ విషయంలో కేంద్రాన్నే అనుసరిస్తున్నాయి. రాజకీయంగా ప్రయోజనం చేకూర్చే ప్రాజెక్టులు చేపట్టి భారీగా ఖర్చు చేస్తున్నాయి. కేంద్రం మాదిరిగానే స్థానిక కార్పొరేట్ శక్తులు, వ్యాపారులకు రాయితీలు ఇస్తున్నాయి. వీటన్నింటి ఫలితంగా దేశ ప్రజల నెత్తిపై మోయలేని రుణభారం పడుతోంది. ఎందుకంటే అంతిమంగా ఈ అప్పులు తీర్చాల్సింది ప్రజలే.

## వడ్డీలకే సరి

(మొదటిపేజీ తరువాయి)

వనరుల నుండి పొందినవే. అంటే బ్యాంకుల వంటి వాణిజ్య సంస్థల నుండి తీసుకున్నవి. ఈ తరహా రుణాలపై వడ్డీ భారం అధికంగా ఉంటుంది. 2023-24 బడ్జెట్ అంచనాల ప్రకారం వడ్డీ చెల్లింపులకే సుమారు రూ.11 లక్షల కోట్లు వినియోగించాల్సి వస్తుంది. సంవత్సరంలో చేసే మొత్తం వ్యయంలో ఇది 23%. అంటే ప్రజల సొమ్ములో అధిక భాగం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న రుణాలపై వడ్డీ చెల్లింపులకే వినియోగిస్తున్నారు. రుణాలను చెల్లించడం సంవత్సరాల తరబడి కొనసాగుతూనే ఉంటోంది. తదుపరి ఏర్పడే ప్రభుత్వాలకు ఇది పెద్ద తలనెప్పిగా మారుతుంది.

# వారం రోజుల్లో డీఎంఈ కార్యాలయం ఘెరావ్

- తెలంగాణ టీచింగ్ వైద్యుల సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే వారం రోజుల్లో డీఎంఈ కార్యాలయాన్ని ఘెరావ్ చేయనున్నట్టు తెలంగాణ టీచింగ్ వైద్యుల సంఘం తెలిపింది. ఆదివారం హైదరాబాద్ కోఠిలోని ఐఎంఏ కార్యాలయంలో ఆ సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్రంలోని 32 వైద్య కళాశాలల నుంచి దాదాపు 200 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల నుంచి అడిషనల్ డీఎంఈ స్థాయి వరకున్న టీచింగ్ వైద్యులు హాజరై సమస్యలపై చర్చించారు. బదిలీలు, పీఆర్సీ ఎరియర్స్, పెరిఫెరల్ కాలేజీల్లో ఉన్న సమస్యల విషయంలో స్పందించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే ఐక్య ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ప్రతి నెలా సమీక్షా సమావేశాలు నిర్వహించి టార్గెట్లు నిర్ణయించడమే కకుండా వైద్యుల సమస్యలపై కూడా చర్చించాలని కోరారు. దేశంలోనే ఆరోగ్య రంగంలో తెలంగాణ ఉత్తమ స్థానంలో ఉండటానికి వైద్యుల సమిష్టి కృషి కారణమని ప్రభుత్వం గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. గతేడాది సమస్యలపై నిరసన తెలిపిన సమయంలో వైద్యారోగ్యశాఖ మంత్రి ఇచ్చిన భరోసాతో వెనక్కి తగ్గినప్పటికీ,




అందులో అనేక సమస్యలు అలాగే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సంఘం అధ్యక్షులు డాక్టర్ అన్వర్దా, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జలగం తిరుపతి రావు, ఉపాధ్యక్షులు డాక్టర్ కిరణ్ మాదాల, డాక్టర్ ప్రతిభా లక్ష్మి, కోశాధికారి డాక్టర్ కిరణ్ ప్రకాష్, రీజనల్ సెక్రెటరీ డాక్టర్ రమేష్, డాక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారు

(మొదటిపేజీ తరువాయి)

సంధించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 159 ప్రకారం ప్రమాణ స్వీకారం చేసేటప్పుడు రాజ్యాంగాన్ని, చట్టాన్ని పరిరక్షిస్తానని, తమిళనాడు ప్రజల సంక్షేమానికి అంకిత భావంతో పనిచేస్తానని ప్రతిజ్ఞ చేసిన గవర్నరు, ఆ ప్రమాణాన్ని తుంగలో తొక్కి కేంద్రానికి ఏజెంట్‌లా వ్యవహరిస్తూ, మన ఫెడరల్ స్ఫూర్తిని,ప్రజాస్వామ్య మౌలిక విలువలను మంటగలుపుతున్నారని ముఖ్యమంత్రి విమర్శించారు. రాష్ట్ర రాజధానిలో కూర్చొని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎప్పుడు కూలదోద్దామా అని గవర్నరు ఎదురు చూస్తున్నారని అన్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించి పంపిన బిల్లులకు ఓకే చెప్పకుండా నెలల తరబడి గవర్నరు తొక్కిపెడుతున్నారని, ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న వైఖరికి భిన్నమైన రాజకీయ, సైద్ధాంతిక వైఖరి తీసుకుంటున్నారని, నిందితులకు మద్దతిస్తున్నారని పోలీసు దర్యాప్తుల్లో జోక్యం చేసుకుంటున్నారని స్టాలిన్ ఆ లేఖలో పేర్కొన్నారు. మంత్రి సెంథిల్ బాలాజీని ఏకపక్షంగా డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులివ్వడం, ఆతరువాత వాటిని నిలుపుచేస్తున్నట్టు ప్రకటించడం ఇవన్నీ గవర్నరు పిల్ల చేష్టలను తెలియజేస్తున్నాయని అన్నారు. ఆరు మాసాల క్రితం స్టాలిన్ ఇదే అంశంపై రాష్ట్రపతికి ఫిర్యాదు చేశారు.

# డేటా ప్రొటెక్షన్‌లో జోక్యమా..?

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేసే ఈ బోర్డులో సాంకేతిక నిపుణులు సభ్యులుగా ఉంటారు. ఈ బిల్లును ప్రభుత్వం రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో ప్రవేశపెడుతుందా లేదా అనే విషయం తెలియరాలేదు.

అయితే బిల్లు నుంచి ప్రభుత్వాన్ని, ప్రభుత్వ సంస్థలను మినహాయించడం ఆందోళన కలిగిస్తోందని జస్టిస్ శ్రీకృష్ణ తెలిపారు. ముసాయిదా బిల్లు ప్రభుత్వానికి అధిక వెసులుబాటు ఇస్తోందని, ప్రజల వ్యక్తిగత సమాచారానికి రక్షణ కల్పించే చర్యలేవీ ఇందులో పెద్దగా లేవని ఆయన వ్యాఖ్యానించారు. బిల్లులో అనేక లోపాలు ఉన్నాయని చెప్పారు. వ్యక్తిగత సమాచార గోప్యతకు సంబంధించి ప్రజలకు ఉన్న ప్రాథమిక హక్కులను ఈ బిల్లు హరిస్తోందని విమర్శించారు. డాటా ప్రొటెక్షన్ బోర్డు కేంద్రం చేతిలో కీలుబొమ్మ అని, దానికి స్వతంత్రత లేదని అన్నారు. 2018లో తాను రూపొందించిన మొట్టమొదటి ముసాయిదా బిల్లులో స్వతంత్ర డాటా ప్రొటెక్షన్ అథారిటీ ఏర్పాటుకు సిఫారసు చేశానని గుర్తు చేస్తూ అలాంటి స్వతంత్ర సంస్థ అవసరం ఉన్నదని సూచించారు. ప్రస్తుతం ప్రతిపాదిస్తున్న బోర్డు ప్రభుత్వం చేతిలో బందీ అని అన్నారు. గత బిల్లు కంటే ఇది ఘోరంగా ఉన్నదని అంటూ మినహాయింపులు ఇస్తే సమస్య ఎలా పరిష్కారం అవుతుందని ఆయన ప్రశ్నించారు.

# బైక్ మెకానిక్‌గా రాహుల్

(మొదటిపేజీ తరువాయి)

రాహుల్ గాంధీ తన యూట్యూబ్ ఛానెల్‌లో అప్‌లోడ్ చేశారు.

'నా దగ్గర కేటీఎం 390 బైక్ ఉంది. కానీ, దాన్ని నేను వినియోగించను. దాన్ని నడిపేందుకు నా భద్రతా సిబ్బంది అనుమతించరు. మీ సమస్యలను తెలుసుకునేందుకు నేను ఇక్కడకు వచ్చాను' అని మెకానిక్‌లతో రాహుల్ గాంధీ చెప్పారు. మీ పెండ్లి ఎప్పుడు జరుగుతుంది..? అని మెకానిక్‌లు అడిగిన ప్రశ్నలకు మాత్రం రాహుల్ చిరునవ్వే సమాధానమైంది.


# తీస్తా సెతల్వాద్‌పై ఆరోపణలను ఉపసంహరించుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వంపై శాంతియుత విమర్శల కోసం శుత్రువు వాతావరణ తీరును తప్పుబట్టింది. "సెతల్వాద్‌పై ఉన్న అన్ని ఆరోపణలను తక్షణమే ఉపసంహరించుకోవాలి. వారి శాంతియుత వ్యక్తీకరణ కోసం రచయితలు, జర్నలిస్టులు, ఉద్యమకారులపై వారి వేధింపులకు ముగింపు పలకాలని సంస్థ భారత అధికారులను కోరుతున్నది" అని పెన్ ఇంటర్నేషనల్ ఒక ప్రకటనలో తెలిపింది. 2002 అల్లర్లకు సంబంధించి అప్పటి గుజరాత్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ముంబయికి చెందిన కార్యకర్త తీస్తా సెతల్వాద్‌కు గుజరాత్ హైకోర్టు గత వారం బెయిల్ నిరాకరించిన విషయం విదితమే. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు సుప్రీంకోర్టు ఆమె మధ్యంతర బెయిల్‌ను పొడిగించడంతో ఆమెకు కాస్త ఊరట లభించింది. సుప్రీంకోర్టులో తదుపరి విచారణ ఈనెల 19న జరగనున్నది.


# లక్ష్యసేన్ X ఫెంగ్

- కెనడా ఓపెన్ ఫైనల్లో ఢీ
- సెమీస్‌లో సేన్ అలవోక విజయం
- పి.వి సింధుకు తప్పని భంగపాటు



**లక్ష్యసేన్ జోరందుకున్నాడు. ఏడాది విరామానికి తెరదించుతూ బిడబ్ల్యూఎఫ్ సూపర్ 500 టోర్నీ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. టైటిల్ ఫేవరేట్, నాల్గో సీడ్ జపాన్ షట్లర్ కెంటా నిషిమోటపై వరుస గేముల్లో గెలుపొందిన లక్ష్యసేన్.. కెనడా ఓపెన్ టైటిల్ పోరుకు సిద్ధమయ్యాడు. ఆల్ ఇంగ్లాండ్ చాంపియన్ లి షి ఫెంగ్ (చైనా)తో నేడు టైటిల్ వేటలో అమీతుమీ తేల్చుకోనున్నాడు. భారత అగ్రశ్రేణి షట్లర్ పి.వి సింధు పోరాటానికి సెమీఫైనల్లోనే తెరపడింది.**

కాల్గరీ (కెనడా)



భారత యువ షట్లర్ లక్ష్యసేన్ అదరగొట్టాడు. సుదీర్ఘ విరామం అనంతరం ఓ టైటిల్ పోరుకు సిద్ధమయ్యాడు. ఆదివారం జరిగిన (భారత కాలమానం ప్రకారం) పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో వరుస గేముల్లో గెలుపొందిన లక్ష్యసేన్ కెనడా ఓపెన్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. జపాన్ షట్లర్, నాల్గో సీడ్ కెంటా నిషిమోటపై 21-17, 21-14తో లక్ష్యసేన్ సులువైన విజయం సాధించాడు. మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో తెలుగు తేజం, మాజీ వరల్డ్ నం.2 పి.వి సింధు పరాజయం పాలైంది. టాప్ సీడ్, జపాన్ అమ్మాయి అకానె యమగూచి 21-14, 21-15తో సింధుపై వరుస గేముల్లో పైచేయి సాధించింది. సెమీఫైనల్లో ఓటమితో కెనడా ఓపెన్ నుంచి పి.వి సింధు నిష్క్రమించగా.. పురుషుల సింగిల్స్ టైటిల్ కోసం లక్ష్యసేన్ అంతిమ సమరానికి రంగం సిద్ధం చేసుకున్నాడు.

### సేన్ సూపర్

వరల్డ్ నం.19 లక్ష్యసేన్ ఈ ఏడాది నిలకడగా నిరాశపరిచాడు. ఒక్క టోర్నీలోనూ ఫైనల్స్‌కు చేరలేదు. 2022 ఆల్ ఇంగ్లాండ్ చాంపియన్‌షిప్ ఫైనలే లక్ష్యసేన్ తలపడిన చివరి టైటిల్ పోరు. 2022 బర్మింగ్‌హామ్ కామన్‌వెల్త్ క్రీడల్లో చివరగా లక్ష్యసేన్ స్వర్ణ పతకం సాధించాడు. గాయాలు, ఫిట్‌నెస్ సమస్యలతో ఫామ్ కోల్పోయిన లక్ష్యసేన్ ఈ ఏడాది బిడబ్ల్యూఎఫ్ సీజన్‌లో అంచనాలను అందుకోలేదు. కెనడా ఓపెన్ 500 టోర్నీలో గత వైభవం దిశగా ఓ అడుగు వేసిన లక్ష్యసేన్.. ఇక్కడ సెమీఫైనల్స్ వరకు అలవోక విజయాలే సాధించాడు. బలమైన ప్రత్యర్థులు ఎదురైనా.. దీటైన ప్రదర్శనతో మెప్పించాడు. సెమీఫైనల్లో నాల్గో సీడ్, టైటిల్ ఫేవరేట్ కెంటా నిషిమోట (జపాన్)ను సైతం లక్ష్యసేన్ చిత్తు చేశాడు. 44 నిమిషాల్లోనే జపాన్ షట్లర్‌ను ఓడించిన లక్ష్యసేన్.. టైటిల్ పోరుకు సమర శంఖం పూరించాడు. తొలి గేమ్ ఆరంభంలో లక్ష్యసేన్ వెనుకంజ వేశాడు. 2-4తో తడబాటుకు లోనయ్యాడు. 8-8తో లక్ష్యసేన్ స్కోరు సమం చేసినా.. 11-10తో విరామ సమయానికి నిషిమోట ఓ పాయింట్ ఆధిక్యం సాధించాడు. ద్వితీయార్థంలో వరుసగా ఆరు పాయింట్లు సాధించిన లక్ష్యసేన్ 16-11తో జపాన్ షట్లర్‌ను వెనక్కి నెట్టాడు. 17-15తో నిషిమోట అంతరం తగ్గించే ప్రయత్నం చేసినా.. లక్ష్యసేన్ 21-17తో తొలి గేమ్‌ను సొంతం చేసుకున్నాడు. ఇక రెండో గేమ్‌లో ఆది నుంచీ లక్ష్యసేన్ హవా నడిచింది. 4-4 అనంతరం 7-4, 9-6, 11-10తో లక్ష్యసేన్ ఆధిక్యంలో కొనసాగాడు. విరామం అనంతరం మరోసారి వరుసగా ఆరు పాయింట్లు సొంతం చేసుకున్న లక్ష్యసేన్.. నిషిమోటను రేసులో వెనక్కి నెట్టేశాడు. 21-14తో అలవోకగా రెండో గేమ్‌ను, ఫైనల్స్ బెర్త్‌ను దక్కించుకున్నాడు.

మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో పి.వి సింధు అంచనాలను అందుకోలేదు. టాప్ సీడ్, జపాన్ స్టార్ అకానె యమగూచికి గట్టి పోటీ ఇవ్వలేకపోయింది. 14-21, 15-21తో 43 నిమిషాల్లోనే ఫైనల్స్ బెర్త్ కోల్పోయింది. తొలి గేమ్‌లో 1-4 నుంచి పుంజుకున్న సింధు 4-4తో స్కోరు సమం చేసింది. కానీ ఆ తర్వాత పోరాట పటిమ కనబరచలేదు. సింధుపై స్పష్టమైన ఆధిపత్యం సాధించిన యమగూచి సులువుగా తొలి గేమ్ నెగ్గింది. రెండో గేమ్‌లో సింధు కాస్త ప్రతిఘటన చూపించే ప్రయత్నం చేసింది. 13-13, 14-14తో స్కోరు సమం చేసిన సింధు.. ఆ తర్వాత తడబాటుకు గురైంది. వరుసగా పాయింట్లు కోల్పోయి రెండో గేమ్‌పైనా ఆశలు వదులుకుంది. సెమీఫైనల్లో పరాజయంతో కెనడా ఓపెన్ నుంచి ఇంటిబాట పట్టింది.

### టైటిల్ ఫేవరేట్‌గా..

కెనడా ఓపెన్ టైటిల్‌పై కన్నేసిన లక్ష్యసేన్ నేడు పురుషుల సింగిల్స్ ఫైనల్లో ఫేవరేట్‌గా బరిలోకి దిగుతున్నాడు. టైటిల్ పోరులో చైనా షట్లర్ లి షి ఫెంగ్‌తో లక్ష్యసేన్ పోటీపడనున్నాడు. ఐదో సీడ్ లి షి ఫెంగ్ ఈ ఏడాది ఆల్ ఇంగ్లాండ్ చాంపియన్‌షిప్ విజేతగా నిలిచాడు. ఆ తర్వాత ఫెంగ్ సైతం ఫామ్ కోల్పోయినా.. ప్రస్తుతం కెనడా ఓపెన్‌లో దూకుడుగా రాణిస్తున్నాడు. మరో సెమీఫైనల్లో జపాన్ షట్లర్ కొడాయ్ నరోకపై 21-18, 21-11తో 33 నిమిషాల్లోనే విజయం సాధించాడు. ఫెంగ్‌తో ముఖాముఖి పోరులో లక్ష్యసేన్ 4-2తో పైచేయి సాధించాడు. చివరగా థాయ్‌లాండ్ ఓపెన్‌లోనూ ఫెంగ్‌పై లక్ష్యసేన్ విజయం సాధించాడు. కెనడా ఓపెన్ టైటిల్‌తో ఏడాది అనంతరం తొలి విజయం అందుకునేందుకు లక్ష్యసేన్ చూస్తుండగా.. ఆల్ ఇంగ్లాండ్ విజయానికి కొనసాగింపుగా మరో టైటిల్ అందుకోవాలని ఫెంగ్ భావిస్తున్నాడు.

# భారత్ బోణీ

- మెరిసిన హర్మన్‌ప్రీత్ కౌర్
- తొలి టీ20లో బంగ్లాపై గెలుపు

మీర్పూర్ (బంగ్లాదేశ్)

హర్మన్‌ప్రీత్ కౌర్ (54 నాటౌట్, 35 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో అదరగొట్టింది. స్లో వికెట్‌పై పరుగుల వేట గగనమైన వేళ.. ఛేదనలో నాయకురాలు బాధ్యతాయుత ఇన్నింగ్స్‌తో మెరిసింది. వైస్ కెప్టెన్ స్మృతీ మంధాన (38, 34 బంతుల్లో 5 ఫోర్లు) సైతం రాణించటంతో బంగ్లాదేశ్‌తో తొలి టీ20లో భారత అమ్మాయిలు ఘన విజయం సాధించారు. 115 పరుగుల లక్ష్యాన్ని భారత్ 16.2 ఓవర్లలోనే ఛేదించింది. ఏడు వికెట్ల తేడాతో గెలుపొందిన టీమ్ ఇండియా టీ20 సిరీస్‌లో 1-0 ఆధిక్యం దక్కించుకుంది. హర్మన్‌ప్రీత్ కౌర్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్‌ను భారత బౌలర్లు 114 పరుగులకే కట్టడి చేశారు. పూజ, మిన్ను, షెఫాలీ వర్మలు తలా ఓ వికెట్ ఖాతాలో వేసుకున్నారు. బంగ్లాదేశ్ బ్యాటర్లలో ఎవరూ అంచనాలకు తగినట్టు ఆడలేదు. టాప్ ఆర్డర్‌లో రాణి (22), షబాన (23).. మిడిల్ ఆర్డర్‌లో అక్తర్ (28) చెప్పుకోదగిన ప్రదర్శన చేశారు. 20 ఓవర్లలో బంగ్లాదేశ్ 5 వికెట్ల నష్టానికి 114 పరుగులే చేసింది. ఛేదనలో తొలుత టీమ్ ఇండియా సైతం తడబడినా.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ఇన్నింగ్స్‌తో పరుగులు సులువుగా వచ్చాయి!. భారత్, బంగ్లాదేశ్ మహిళల రెండో టీ20 మంగళవారం మీర్పూర్‌లోనే జరుగనుంది.




**యాషెస్ సిరీస్‌లో ఎట్టకేలకు బజ్‌బాల్ పైచేయి సాధించింది. గెలుపు వేటలో అత్యంత దూకుడుగా ఆడుతూ ఓడినా ఫర్వాలేదనే ఫార్ములాతో ఇంగ్లాండ్ జట్టు టెస్టు క్రికెట్‌లో సంచలనం రేపుతున్న సంగతి తెలిసిందే. బజ్‌బాల్ ఆటతో తొలి రెండు టెస్టుల్లో ఓడినా.. ఆతిథ్య జట్టు ఆట మాత్రం విశేషంగా అలరించింది. సిరీస్‌లో కీలక మూడో టెస్టులో బజ్‌బాల్ జోరుతో 3 వికెట్ల తేడాతో గెలుపొందిన ఇంగ్లాండ్.. టెస్టు క్రికెట్ ఛేదనలో మరో చారిత్రక విజయం సొంతం చేసుకుంది. ఐదు టెస్టుల యాషెస్ సిరీస్‌లో ఆశలు సజీవంగా నిలుపుకుంది.**

# ఎట్టకేలకు బజ్‌బాల్!

- ఛేదనలో బ్రూక్, క్రాలీ, వోక్స్ మెరుపుల్
- మూడో టెస్టులో ఇంగ్లాండ్ గెలుపు
- యాషెస్ సిరీస్‌పై ఆశలు సజీవం

లీడ్స్ (ఇంగ్లాండ్)

యాషెస్ సిరీస్ రెండో టెస్టులో 371 పరుగుల ఛేదనలో విజయానికి అత్యంత చేరువగా వచ్చిన ఇంగ్లాండ్.. దూకుడుగా ఆడినందుకు పశ్చాత్తాపం చెందలేదు. తర్వాతి టెస్టు లీడ్స్‌లో అంతకుమించిన దూకుడుతో బజ్‌బాల్ మెరుపుల్ మెరిపించి.. 3 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 251 పరుగుల సవాల్‌తో కూడిన లక్ష్యాన్ని ఇంగ్లాండ్ 50 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఇంగ్లాండ్ తరఫున యువ బ్యాటర్ హ్యారీ బ్రూక్ (75, 93 బంతుల్లో 9 ఫోర్లు) అర్థ సెంచరీకి తోడు ఓపెనర్ జాక్ క్రాలీ (44, 55 బంతుల్లో 5 ఫోర్లు), క్రిస్ వోక్స్ (32 నాటౌట్, 47 బంతుల్లో 4 ఫోర్లు), మార్క్‌వుడ్ (16 నాటౌట్, 8 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) రాణించారు. ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ (5/78) ఐదు వికెట్ల ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఏడు వికెట్లతో పాటు బ్యాట్‌తో కీలక పాత్ర పోషించిన మార్క్‌వుడ్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. లీడ్స్ టెస్టులో ఇంగ్లాండ్ విజయం సాధించగా యాషెస్ సిరీస్‌లో ఆ జట్టు 1-2తో నిలిచింది. మరో రెండు టెస్టులు మిగిలి ఉండగా.. సిరీస్‌పై ఆతిథ్య జట్టు ఆశలు సజీవంగా నిలుపుకుంది. జులై 19 నుంచి మాంచెస్టర్‌లో యాషెస్ నాల్గో టెస్టు జరుగనుంది.



### ఆద్యంతం రసవత్తరం

పేసర్ల స్వర్గధామం లీడ్స్‌లో నాలుగు రోజుల్లోనే ఫలితం తేలింది. ఆసీస్ నిర్దేశించిన 251 పరుగుల ఛేదనలో.. ఇంగ్లాండ్ మూడో రోజే 27/0 పరుగులు చేసింది. దీంతో నాల్గో రోజు ఉదయం సెషన్‌కు మరో 224 పరుగుల వేటకు బరిలోకి దిగింది. రెండో టెస్టులో ఇంగ్లాండ్ బ్యాటర్లు ఏకంగా రికార్డు లక్ష్యాన్నే ఊదేసేలా కనిపించటంతో.. 224 పరుగులు పెద్ద విషయం కాదు అనిపించింది. కానీ ఇంగ్లాండ్ బజ్‌బాల్ మంత్ర పఠించినా.. ఆసీస్ అంత సులువుగా పట్టు విడువలేదు. ఓపెనర్ జాక్ క్రాలీ (44), బెన్ డకెట్ (23) తొలి వికెట్‌కు 42 పరుగులతో శుభారంభం అందించారు. మోయిన్ అలీ (5), జో రూట్ (21) నిరాశపరిచారు. దీంతో 131/4తో ఇంగ్లాండ్ కాస్త ఒత్తిడిలో పడింది. ఈ సమయంలో యువ బ్యాటర్ హ్యారీ బ్రూక్ (75) బాధ్యత తీసుకున్నాడు. కెప్టెన్ బెన్ స్టోక్స్ (13), జానీ బెయిర్‌స్టో (5)సైతం చేతులెత్తేయగా.. భారం అంతా బ్రూక్ మోశాడు. క్రిస్ వోక్స్ (32 నాటౌట్) జతగా కీలక భాగస్వామ్యం నిర్మించాడు. ఆరు ఫోర్లతో 67 బంతుల్లో అర్థ సెంచరీ సాధించిన బ్రూక్.. స్టార్క్ ఓవర్లో నిష్క్రమించటంతో కాస్త హైడ్రామాకు అవకాశం కనిపించింది. కానీ మార్క్‌వుడ్ (16 నాటౌట్) ఓ సిక్సర్, ఫోర్‌తో సమీకరణాలను మార్చివేశాడు. ఉత్కంఠను తొలగించి ఇంగ్లాండ్‌కు విజయాన్ని



కట్టబెట్టాడు.

ఉదయం సెషన్ అనంతరం ఇంగ్లాండ్ 153/4తో నిలువగా.. ఆ జట్టు విజయానికి మరో 98 పరుగులు అవసరం. ఆస్ట్రేలియాకు మరో విజెట్లు అవసరం. ఈ దశలో ఇంగ్లాండ్ ఆచితూచి ఆడుతుందా? సహజశైలిలో బజ్‌బాల్ మెరుపులు చూపిస్తుందా? అనే చర్చ నడిచింది. ఈ ఛేదనలో ఇరు జట్లు అనుసరించే వ్యూహంపై భవిష్యత్ టెస్టు క్రికెట్ గమనం ఆధారపడి ఉందనే స్థాయిలో చర్చ సాగింది. చివరగా ఇంగ్లాండ్ బజ్‌బాల్ దూకుడుతోనే విజయాన్ని అందుకుంది. చివర్లో మార్క్‌వుడ్ ఒత్తిడిని చిత్తు చేస్తూ స్టార్క్, కమిన్స్ వేసిన బౌన్సర్లను బౌండరీలను తరలించిన విధానం బజ్‌బాల్ మార్క్‌కు నిదర్శనం.

### స్కోరు వివరాలు

**ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : 263/10**

**ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ : 237/10**

**ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ : 224/10**

**ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్ :** జాక్ క్రాలీ (సి) అలెక్స్ (బి) మార్ష్ 44, డకెట్ (ఎల్బీ) స్టార్క్ 23, మోయిన్ (బి) స్టార్క్ 5, రూట్ (సి) అలెక్స్ (బి) కమిన్స్ 21, బ్రూక్ (సి) కమిన్స్ (బి) స్టార్క్ 13, బెయిర్‌స్టో (బి) స్టార్క్ 5, వోక్స్ నాటౌట్ 32, మార్క్‌వుడ్ నాటౌట్ 16, ఎక్స్‌ట్రాలు : 20, **మొత్తం : (50 ఓవర్లలో 7 వికెట్లకు) 254.**

**వికెట్ల పతనం :** 1-42, 2-60, 3-93, 4-131, 5-161, 6-171, 7-230.

**బౌలింగ్ :** పాట్ కమిన్స్ 15-0-77-1, మిచెల్ స్టార్క్ 16-0-78-5, స్కాట్ బొలాండ్ 11-1-49-0, మిచెల్ మార్ష్ 6-0-23-1, టాడ్ మర్ఫీ 2-0-13-0.




## జామ్ జామ్ జజ్జనక..


**చి**రంజీవి లేటెస్ట్‌గా నటిస్తున్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భోళా శంకర్'. మెహర్ రమేష్ దర్శకత్వంలో రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమాకి సంబంధించిన ప్రమోషన్స్ జోరుగా సాగుతున్నాయి. మొదటి సింగిల్ చార్ట్‌బస్టర్‌గా నిలవగా, టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది.

ఇప్పుడు మేకర్స్ మరొక ట్రీట్‌ని రెడీ చేశారు. ఈ చిత్రంలోని సెకండ్ సింగిల్ 'జామ్ జామ్ జజ్జనక' ఈనెల 11న విడుదల చేసేందుకు రంగం సిద్ధం చేశారు.

ఈ పాట ప్రోమో ఆదివారం సాయంత్రం రిలీజ్ అయ్యింది. ఈ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో చిరంజీవి లుక్ అందర్నీ అలరిస్తోంది. టైటిల్, పోస్టర్ ఈ పాట మెగా డ్యాన్స్ ట్రీట్‌గా ఉండబోతుందని సూచిస్తోంది. ఈ చిత్రానికి మహతి స్వర సాగర్ సంగీతం అందిస్తున్నారు. అటు ప్రేక్షకులు, ఇటు మెగా అభిమానుల్లో భారీ అంచనాలను పెంచిన ఈ చిత్రాన్ని ఆగస్టు 11న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. డడ్లీ డీవోపీగా పని చేస్తున్నారు. సత్యానంద్ కథ పర్యవేక్షణ చేయగా, తిరుపతి మామిడాల డైలాగ్స్ అందిస్తున్నారు. మార్తాండ్ కె వెంకటేష్ ఎడిటర్‌గా, ఎఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్‌గా పని చేస్తున్నారు. ఇందులో చిరు సరసన తమన్నా నటిస్తుండగా, ఆయన చెల్లెలుగా కీర్తి సురేష్ కనిపించనున్నారు. సుశాంత్, రఘుబాబు, మురళీ శర్మ, రవిశంకర్, వెన్నెల కిషోర్, తులసి, సురేఖా వాణి, శ్రీ ముఖి, హైపర్ ఆది, వైవా హర్ష, ప్రదీప్, అనీ, బిత్తిరి సత్తి, సత్య, గెటప్ శ్రీను, వేణు టిల్లు, రష్మీ గౌతమ్, ఉత్తేజ్, వీర్, షావర్ అలీ, తరుణ్ అరోరా తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఫైట్ మాస్టర్స్: రామ్-లక్ష్మణ్, దిలీప్ సుబ్బరాయన్, కాచే కంపాక్డీ, కొరియోగ్రఫీ: శేఖర్ మాస్టర్.

# నవచిత్రం

## క్రేజీ కాంబోలో 4వ సినిమా



రవితేజ, మలినేని గోపీచంద్

**ర**వితేజ, గోపీచంద్ కాంబినేషన్ ఇప్పటికే హ్యాట్రిక్ హిట్‌ని పూర్తి చేశారు. తాజాగా ఈ బ్లాక్‌బస్టర్ కాంబో నాలుగోసారి చేతులు కలిపింది. ఈ ప్రాజెక్ట్‌ని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఆదివారం ఈ సినిమాని అధికారికంగా అనౌన్స్ చేశారు.

గోపీచంద్ మలినేని గత బ్లాక్‌బస్టర్ మూవీస్ 'క్రాక్, వీరసింహారెడ్డి' మాదిరిగానే వాస్తవ సంఘటనల ఆధారంగా యూనిక్ అండ్ పవర్ ఫుల్ కథని రాశారు. అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో భయానక స్థితిలో ఉన్న ఓ గ్రామం, కాలిపోతున్న ఇల్లు, డేంజర్ బోర్డు కనిపిస్తున్నాయి. టెర్రిఫిక్‌గా ఉన్న ఈ పోస్టర్ సినిమాపై క్యూరియాసిటీని పెంచిందని అని చిత్ర బృందం తెలిపింది.

నవీన్ యెర్నేని, వై రవిశంకర్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో, అత్యున్నత నిర్మాణ విలువలతో నిర్మించనున్నారు. ప్రముఖ సాంకేతిక నిపుణులు ఈ చిత్రానికి పని చేస్తున్నారు. తమన్ ఈ చిత్రానికి సంగీతం సమకూరుస్తున్నారు. మిగిలిన వివరాలను మేకర్స్ త్వరలో తెలియజేస్తారు.



## సరికొత్త అనుభూతినిచ్చే మహావీరుడు

**శి**వ కార్తికేయన్ కథానాయకుడిగా, 'మండేలా' ఫేమ్ మడోన్ అశ్విన్ దర్శకత్వం వస్తున్న ఫాంటసీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మహావీరుడు'. అదితి శంకర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని శాంతి టాకీస్ పతాకంపై అరుణ్ విశ్వ నిర్మిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ, పంపిణీ సంస్థ ఏషియన్ సినిమాస్ ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో గ్రాండ్‌గా ఈనెల 14న విడుదల చేస్తోంది. ఈ నేపథ్యంలో నిర్వహించిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో హీరో అడివి శేష్, డైరెక్టర్ శేఖర్ కమ్ముల ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

హీరో శివ కార్తికేయన్ మాట్లాడుతూ, 'మహావీరుడు ఫాంటసీ జోనర్. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది. దర్శకుడు అశ్విన్ బ్రిలియంట్‌గా తీశారు. ఈ సినిమాలో చాలా మంచి సర్‌ప్రైజ్ ఉంది. అందరూ థియేటర్‌కి వెళ్లి సినిమా చూడండి. కచ్చితంగా ఎంజాయ్ చేస్తారు' అని అన్నారు.

హీరో అడివి శేష్ మాట్లాడుతూ, 'శివకార్తికేయన్‌తో కలిసి పని చేయాలని ఉంది. అశ్విన్ మొదటి సినిమా 'మండేలా' చూసినప్పుడు ఆయనతో వర్క్ చేస్తే బావుండని అనుకున్నాను. ఆయన దగ్గరికి 'క్షణం' రీమేక్ వెళ్ళిందని తెలిసి ఆనందంగా ఉంది' అని తెలిపారు.

'దర్శకుడు అశ్విన్ 'మండేలా' సినిమా చూశాను. చాలా ముఖ్యమైన సినిమా అది. 'మహావీరుడు' కూడా అంతే ప్రత్యేకంగా ఉంటుందని భావిస్తున్నాను. ఈ చిత్ర ట్రైలర్ విజువల్స్ గొప్పగా ఉన్నాయి. సరిత గారి సినిమాలు చూస్తూ పెరిగాం. ఆమెతో వేదిక పంచుకోవడం ఆనందంగా ఉంది' అని దర్శకుడు శేఖర్ కమ్ముల చెప్పారు. దర్శకుడు మడోన్ అశ్విన్ మాట్లాడుతూ, 'ఇందులో శివకార్తికేయన్ అద్భుతమైన నటన, యాక్షన్ యాంగిల్ చూస్తారు. అదితి శంకర్ ఎనర్జిటిక్‌గా చేసింది. సునీల్ వలనే ఈ సినిమా ఇంత గ్రాండ్‌గా విడుదల అవుతోంది' అని అన్నారు.

## వచ్చే నెలలో యూనివర్సిటీ రీ- రిలీజ్

**స్నే**హ చిత్ర పిక్చర్స్ బ్యానర్ పై ఆర్.నారాయణమూర్తి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'యూనివర్సిటీ'. ప్రేక్షకుల అభిప్రాయాన్ని, సూచనలను గౌరవిస్తూ ఈచిత్రాన్ని వచ్చే నెలలో రీ-రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ,'నేను తీసిన 'యూనివర్సిటీ' సినిమా జూన్ 9న రిలీజ్ అయ్యింది. అప్పుడు ఎండలు, వడగాల్పుల వలన సినిమా చూడ్డానికి ప్రేక్షకులు బయటకు రాలేదు. దీంతో నా సినిమా నలిగిపోయింది. చూసిన కొద్దిమంది చాలా బాగా తీశావ్. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలు, వాళ్ళ తల్లిదండ్రుల కష్టాలు, కన్నీళ్లు ఆవేదనలు, ఆవేశాలతోపాటు పేపర్ల లీకేజ్‌లు ఎందుకు?, ఎలా జరుగుతున్నాయి అనే వాటిని చాలా బాగా చూపించావు. పాటలూ బాగున్నాయి. వాతావరణం చల్ల బడ్డాక ఇంత మంచి చిత్రాన్ని రిలీజ్ చేస్తే ప్రజలకు మరింత చేరువవుతుంది అని చెప్పారు. అందుకే మళ్ళీ ఈ చిత్రాన్ని వచ్చే నెలలో రిలీజ్ చేస్తున్నాను. సహకరిస్తున్న డిస్ట్రిబ్యూటర్లకు, ఎగ్జిబిటర్స్‌కు ధన్యవాదాలు' అని తెలిపారు.



ఆర్.నారాయణమూర్తి



సిమ్రాన్ శర్మ, రవితేజ, మాధవ్

## మిస్టర్ ఇడియట్‌గా మాధవ్

**ర**వితేజ తమ్ముడు రఘు తనయుడు మాధవ్ హీరోగా నటిస్తున్న చిత్రానికి 'మిస్టర్ ఇడియట్' అనే టైటిల్ ఖరారు. సిమ్రాన్ శర్మ హీరోయిన్‌గా నటిస్తోంది. జేజేఆర్ ఎంటర్‌టైన్ మెంట్స్ పతాకంపై యలమంచి రాణి సమర్పణలో జె.జె.ఆర్ రవిచంద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'పెళ్లి సందడి' దర్శకురాలు గౌరీ రోణంకి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఆదివారం ఈ సినిమా టైటిల్ పోస్టర్, ప్రీ లుక్‌ను రవితేజ ఆవిష్కరించారు. 'నా కెరీర్‌లో 'ఇడియట్' సినిమాకు ఎంత ప్రాముఖ్యత ఉందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు మా రఘు కొడుకు మాధవ్ 'మిస్టర్ ఇడియట్'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. నాలాగే తనకు కూడా ఈ మూవీ బిగ్గెస్ట్ హిట్ మూవీగా నిలవాలని కోరుకుంటున్నాను' అని టీమ్‌కి రవితేజ అభినందనలు తెలియజేశారు. 'ఈ నెలాఖరు నాటికి షూటింగ్ అంతా పూర్తవుతుంది. డైరెక్టర్ గౌరి సహా ఇతర టెక్నీషియన్స్, నటీనటుల సపోర్ట్‌తో సినిమాను అనుకున్న టైమ్‌కి పూర్తి చేస్తున్నాం. నవంబర్‌లో విడుదల చేస్తాం' అని నిర్మాత జె.జె.ఆర్. రవిచంద్ అన్నారు. డైరెక్టర్ గౌరి రోణంకి మాట్లాడుతూ, 'ఇడియట్' మాదిరిగానే 'మిస్టర్ ఇడియట్' కూడా హిట్ అవుతుంది' అని చెప్పారు.

**రు**హాణి శర్మ ప్రధాన పాత్ర పోషించిన డిఫరెంట్ లేడీ ఓరియెంటెడ్ కాన్సెప్ట్ సినిమా 'హర్'. ఇప్పటికే అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకొని ఈనెల 21న ఈ సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సందర్భంగా తాజాగా హీరో వరుణ్ తేజ్ చేతుల మీదుగా వర్చువల్‌గా ఈ చిత్ర ట్రైలర్ రిలీజ్ చేశారు. ట్రైలర్ రిలీజ్ చేసిన అనంతరం ఆయన చిత్ర యూనిట్‌కి ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి నిర్మాత రాజ్ కందుకూరి ముఖ్య అతిథిగా విచ్చేశారు.

## నయా సస్పెన్స్ స్టోరీ



రుహాణిశర్మ

ఆయన మాట్లాడుతూ, 'ఈ సినిమా నేను ఆల్రెడీ చూశాను. సినిమా చాలా బాగుంది. ఈ మధ్య వచ్చిన ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్స్ అన్ని మంచి హిట్ అయ్యాయి. ఈ సినిమాలో కూడా ఒక కేసుని తీసుకొని దాన్ని చాలా బాగా సాల్వ్ చేశారు. అందులోనూ ఫిమేల్ లీడ్‌తో చేయడం నాకు బాగా నచ్చింది. రుహాణితోపాటు నటీనటులంతా బాగా యాక్ట్ చేశారు. సినిమాటోగ్రాఫర్ విష్ణు చాలా బాగా తీశాడు. ఈ సినిమా మంచి హిట్ అవుతుంది. నిర్మాతలకు బాగా డబ్బులు వస్తాయి. ఇటీవల ఫస్ట్ సినిమా తీసే డైరెక్టర్స్ అంతా హిట్స్ కొడుతున్నారు. శ్రీధర్ కూడా హిట్ కొడతాడు' అని తెలిపారు. 'నాకు ఎప్పుడూ చాలా స్ట్రాంగ్ క్యారెక్టర్స్ చేయాలని ఉండేది. ఈ సినిమా వచ్చి నన్ను ఆశ్చర్యపరిచింది. సినిమా నా దగ్గరికి వచ్చినప్పుడు ఫిమేల్ ఓరియెంటెడ్ నేను చేయగలనా అని ఒక డౌట్ ఉంది. కానీ డైరెక్టర్ నాకు కాన్ఫిడెన్స్ ఇచ్చారు. రిస్క్ తీసుకుని ఈ సినిమా చేశాను. చాలా రియలిస్టిక్‌గా సినిమా ఉంటుంది' అని హీరోయిన్ రుహాణి శర్మ అన్నారు. డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ,'జనాలు థియేటర్‌కి వచ్చి చూడాలంటే ఏదో ఒక కొత్త విషయం ఉండాలి. 2 గంటలలోపు ఉన్న ఈ సినిమా మొదటి సీన్ నుంచి చివరి వరకు మిమ్మల్ని అలరిస్తుంది. థియేటర్స్‌కి వచ్చి సినిమా చూడండి. ఈ సినిమా కోసం రుహాణి చాలా కష్టపడింది. మా నిర్మాతలు ఎక్కడా రాజీపడలేదు.' అని చెప్పారు.ఎడిటర్ చాణక్య మాట్లాడుతూ,సినిమాకి ఫస్ట్ ఆడియన్ ఎడిటర్. నేను ఈ సినిమాను చూశాను. చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాను. థియేటర్లో చూశాక మీకు కూడా నచ్చుతుంది' అని అన్నారు.

సినిమాటోగ్రాఫర్ విష్ణు మాట్లాడుతూ, 'ఇది మంచి సినిమా అవుతుంది. ఇప్పటికే టీజర్‌కి మంచి రీచ్ వచ్చింది. సినిమాకి కూడా చాలా రీచ్ వస్తుంది. నన్ను సినిమాటోగ్రాఫర్‌గా సెలెక్ట్ చేసుకు న్నందుకు చాలా థ్యాంక్స్' అని తెలిపారు. 'ఈ సినిమా సస్పెన్స్ స్టోరీ. హీరోయిన్ రుహాణి కెరీర్ ఆరంభంలోనే ఇలాంటి క్యారెక్టర్ చేయడం చాలా గొప్ప విషయం' అని నటులు జీవన్, ప్రదీప్ అన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.